ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం 13.10.2026 | సంపుటి : 13 | సంచిక : 84 | పేజీలు : 12 | వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# మార్చ్ ఫర్ డెమోక్రసీ
## ఇండియా కూటమి మహాకవాతు



## జనసంద్రమైన ఢిల్లీ.. అడుగడుగునా ఉద్రిక్తత

- ఈసీకి వ్యతిరేకంగా 11 రిట్ పిటిషన్లు
- ఢిల్లీని జైలుగా మార్చారెందుకు..?
- మోదీజీ.. మీ వాళ్లు 200 మంది మాతో టచ్‌లో ఉన్నారు.. రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు
- విపక్షాల మార్చ్‌ను అడ్డుకున్న పోలీసులు..
- రాహుల్ తరఫున సుప్రీంలో కాంగ్రెస్ పిటిషన్

"ప్రస్తుతం ప్రజలు, ప్రతిపక్షాలన్నీ ఒకవైపు ఉంటే.. మోదీ, అమిత్ షా, అజిత్ ధోబాల్, జ్ఞానేశ్ కుమార్, మోహన్ భాగవత్ మరోవైపు ఉన్నారు. వారు ప్రజాస్వామ్యాన్ని చంపేస్తు న్నారు. మోదీకి నేను చెప్పేది ఒక్కటే.. మీ ప్రభుత్వంలోని 200 మంది అధికారులు మాతో టచ్‌లో ఉన్నారు. ఇది మోదీ-రాహుల్ మధ్య జరిగే యుద్ధం కాదు. దేశ యువత భవిష్యత్తు, రాజ్యాంగాన్ని రక్షించడం కోసం జరుగుతున్న పోరాటం. ఎన్నికల వ్యవస్థ ప్రక్షాళన జరిగే వరకు మా పోరాటం కొనసాగుతుంది. ఆ ఐదుగురు నేరగాళ్లు న్యాయవిచారణ ఎదుర్కొనే వరకు వదిలిపెట్టేది లేదు - రాహుల్ గాంధీ





:సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేస్తూ సుప్రీంకోర్టు వరకు మార్చ్‌కు విపక్ష ఇండియా కూటమి పిలుపునిచ్చిన నేపథ్యంలో తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు.. ర్యాలీలో పాల్గొని శ్రేణులకు అభివాదం తెలుపుతున్న కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్, ప్రియాంక, మల్లికార్జున ఖర్గే, తదితరులు

న్యూఢిల్లీ(జనంసాక్షి):సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండును మరింత బలంగా వినిపిస్తూ సుప్రీంకోర్టు వరకు మార్చ్‌కు పిలుపునిచ్చింది విపక్ష ఇండియా కూటమి. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ నేతృత్వంలో ప్రతిపక్ష నేతలు ఈ ర్యాలీ చేపట్టారు. వీరి మార్చ్‌ను పోలీసులు అడ్డుకున్నా రు.'మార్చ్ ఫర్ డెమోక్రసీ' పేరుతో విపక్ష ఎంపీలు, నేతలు ఈ ర్యాలీ చేపట్టారు. ఓటు చోరీ అంశంతో పాటు సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకం గా సుప్రీంకోర్టులో స్వయంగా పిటిషన్ దాఖలు చేసేందుకు రాహుల్ బృందం బయల్దేరింది. విపక్ష నేతలు ప్రియాంక గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, తేజస్వీ యా దవ్, అఖిలేశ్ యాదవ్, సుప్రియా సూలే, సంజయ్ రౌత్, శశి థరూర్, సచిన్ పైలట్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తదితరులు ఇందులో పాల్గొన్నారు. వీరికి మద్దతుగా వేలాది మంది కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు. అయితే, భగవాన్ దాస్ రోడ్డు వద్ద బారికేడ్లు పెట్టి విపక్ష నేతలను నిలువరించారు.

మిగతా 2లో..

## విపక్షాలతో సమావేశం అధికార విభజన సూత్రానికి విరుద్ధం

విపక్ష నేతలకు అపాయింట్‌మెంట్‌ను నిరాకరించిన సీజేఐ

వార్త 2 లో



## 'సర్'తో ఓట్-చోరీకి మోడీ, షా, జ్ఞానేష్ కుట్ర

### ఇది మరో స్వాతంత్య్ర పోరాటం

- 'సైమన్ గో బ్యాక్' స్ఫూర్తితో 'జ్ఞానేశ్ గో బ్యాక్' ఉద్యమం
- మైనారిటీ, దళిత, గిరిజన, పేదల ఓట్ల తొలగింపునకు యత్నం
- ఓటు చోరీకి వ్యతిరేకంగా రాహుల్‌గాంధీ నేతృత్వంలో తీవ్ర పోరు
- ఆయనతో కలిసి కదం తొక్కాలి: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఢిల్లీలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, సీఎం దిశానిర్దేశం

న్యూఢిల్లీ(జనంసాక్షి):దేశ ప్రజల ఓటు హక్కును కాపాడుకునేం దుకు జరుగుతున్న పోరాటం మరో స్వాతంత్య్ర ఉద్యమమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్

మిగతా 2లో..

సర్ ప్రక్రియ జరగని రాష్ట్రాల్లో భాజపా ఓడిపోయింది. ఈ ప్రక్రియ జరిగిన బిహార్, బెంగాల్‌లో భాజపా గెలిచింది. దేశంలో జనాభా పెరుగుతుంటే ఓటర్ల సంఖ్య కూడా పెరగాలి కదా.. మరి ఎందుకు తగ్గింది?.. మోదీ తన అధికారం నిలబెట్టుకునేందుకు గతంలో ఈడీ, సీబీఐ, ఇన్‌కమ్‌ట్యాక్స్ విభాగాలను వాడుకున్నారు. ఇప్పుడు వాటితో పని జరగడం లేదని.. ఎన్నికల కమిషన్‌ను వినియోగించుకుంటున్నారు. భాజపా వ్యతిరేకుల ఓట్లు తొలగించేందుకు ప్రస్తుతం 'సర్' తెచ్చారు. తమ వ్యతిరేకుల ఓట్లు తొలగించాలని సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌కు టాస్క్ ఇచ్చారు. సీఈసీలో తప్పులు జరిగాయని మిగతా ఇద్దరు ఈసీలు వ్యతిరేకించారు. జ్ఞానేశ్‌కుమార్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని తేలింది. అలాంటి అధికారిని తొలగించేందుకు మోదీకి అభ్యంతరం ఏమిటి?" - సీఎం రేవంత్ రెడ్డి

## ఫారం-6పై ఎటువంటి తీర్పు వెలువరించలేదు

### 'సర్' ప్రక్రియ విషయంలో సుప్రీం కోర్టు వ్యాఖ్యలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):బిహార్ 'సర్' ప్రక్రియ విష యంలో సుప్రీం కోర్టు ఎన్నికల కమిషన్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. కొత్త ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకోవాలనుకునేవారు నింపాల్సిన ఫారం-6లో తాము ఎలాంటి సవరణలనూ ఆమోదించలేదని స్పష్టం చేసింది. తాము బిహార్ సర్‌కు సంబంధించిన తీర్పు వెలువరించినప్పుడు అందులో కొత్త ఫారం-6 లేదని పేర్కొంది. రికార్డుల్ని తమకు సమర్పించినప్పుడు ఆ మార్పుల్ని ఎవరు చేశారో పరిశీలించి, తగిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపింది. కొత్త ఫారం డిక్లరేషన్‌కు సుప్రీంకోర్టు ఆమోదం ఉందంటూ ఎన్నికల సంఘం

మిగతా 2లో..

## జ్ఞానేశ్ దిగిపోయే వరకు ఆందోళన ఆగదు

నిరసనలకు అనుమతివ్వండి:సీజేపీ
దేశమంతా జంతర్‌మంతర్ చేస్తామని హెచ్చరిక



న్యూఢిల్లీ(జనంసాక్షి):జంతర్‌మంతర్‌ను డీనో టిఫై చేయడంపై కాక్రోచ్ జనతా పార్టీ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇలాంటి ఏకపక్ష నిర్ణయాలు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని మండిపడింది. "జంతర్ మంతర్ దేశ ప్రజల ఆస్తి. ఈ నిర్ణయం తీసుకునే ముందు కేంద్ర హోం మంత్రిత్వశాఖ ప్రజలను సంప్రదించిందా? ఏవైనా సంస్థలతో మాట్లాడిందా? ఇది పూర్తిగా ఏకపక్ష నిర్ణయమే. నిరసనలు తెలిపే, శాంతియుత ఆందోళనలు చేపట్టే ప్రజల ప్రాథమిక హక్కుపై ఇది దాడి లాంటిదే.

మిగతా 2లో..



## నిరసనలకు జంతర్‌మంతర్ ఇక వేదిక కాదు

- డీనోటిఫై చేసిన ఢిల్లీ పోలీసులు
- ప్రత్యామ్నాయంగా మరో మూడు ప్రదేశాలు రామ్‌లీలా గ్రౌండ్, బురారీ గ్రౌండ్, సీబీడీ గ్రౌండ్‌లు వాడుకోవచ్చని సూచన

న్యూఢిల్లీ(జనంసాక్షి):సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ ఆందోళనలు కొనసాగుతోన్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. దిల్లీలోని ప్రఖ్యాత జంతర్ మంతర్ ఇక ఏ మాత్రం నిరసన ప్రదర్శనలకు వేదిక కాదని దిల్లీ పోలీసులు వెల్లడించారు. ఈ మేరకు జంతర్ మంతర్‌ను డీనోటిఫై చేస్తూ ప్రకటన విడుదల

మిగతా 2లో..

ఫార్ములా ఈ- కార్ రేసు..

## నిందితుల జాబితా నుంచి నా పేరు తొలగించండి

నాంపల్లి ఏసీబీ కోర్టులో కేటీఆర్ డిశ్చార్జ్ పిటిషన్

2 లో..

## ఏసీబీ వలలో అవినీతి తిమింగలం

- రూ.20 లక్షల లంచం తీసుకుంటూ చిక్కిన తహసీల్దార్, సర్వేయర్
- భూమి సర్వే రిపోర్టు కోసం భారీ డిమాండ్..
- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు
- అబ్దుల్లాపూర్‌మెట్‌లో కలకలం
- ఇద్దరు అధికారులు అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు



వివరాలు లోపలి పేజీల్లో..

## మణిపూర్ బాధితుల కోసం గళమెత్తిన ఎంపీపై ..

### విమెన్ అట్రాసిటీ కేసు

విచారణ తీరుపై బిమోల్ అకోయిజమ్ అభ్యంతరాలు

- మేలో విద్యార్థినుల ఫిర్యాదులు.. అక్టోబర్‌లో ఉద్యోగం నుంచి తొలగింపు
- చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ ఫిర్యాదుతో ఎఫ్ఐఆర్.. ఫిర్యాదు వెనుక ప్రక్రియపై ప్రశ్నలు



న్యూఢిల్లీ(జనంసాక్షి):మణిపూర్‌లో మహిళలపై జరిగిన హింసను పార్లమెంటులో ప్రస్తావించి కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కాంగ్రెస్ ఎంపీ డాక్టర్ ఆంగోంచా బిమోల్ అకోయిజమ్ ఇప్పుడు జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో తనపై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలతో వివాదంలో చిక్కుకున్నారు. అయితే, ఆరోపణలు వచ్చిన తీరు, విశ్వవిద్యాలయ అంతర్గత విచారణలో అనుసరించిన విధానం, అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేసిన పరిణామాలపై ఆయన అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. తన వాదనలను పరిగణనలోకి తీసుకోకుండా తనపై చర్యలు తీసుకున్నారని ఆయన ఆరోపిస్తున్నారు. విద్యార్థినుల ఫిర్యాదులు 2026 మేలో జేఎన్‌యూ అంతర్గత కమిటీకి అందినట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. మే మొదటి వారంలో జరిగిన మౌఖిక పరీక్షల

మిగతా 2లో..



## ఆర్థిక శాస్త్రంలో ఇద్దరికి నోబెల్ పురస్కారం

స్వీడన్(జనంసాక్షి): ఆర్థిక శాస్త్రంలో ప్రతిష్ఠాత్మక నోబెల్ పురస్కారాన్ని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ప్రకటించింది. 2026 సంవత్సరానికి గానూ ఇద్దరికి దీనిని అందించనుంది. 'స్థూల ఆర్థిక స్థిరీకరణకు సూక్ష్మ ఆర్థిక పునాదులు' అంశంపై అమెరికాకు చెందిన రాబర్ట్ ఇ.హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్‌లు ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. వైద్యవిభాగంతో మొదలైన నోబెల్ పురస్కారాల ప్రకటన ముగిసింది. కాలిఫోర్నియాకు చెందిన

మిగతా 2లో..

## త్వరలోనే కరువు మండలాల ప్రకటన

ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా రబీ సీజన్‌లో రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ వరి సాగు చేయవద్దు : ఉపముఖ్యమంత్రి భట్టి



హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణా రాష్ట్ర రైతాంగానికి రైతు నేస్తం కార్యక్రమం ద్వారా ప్రభుత్వం కీలక సూచనలు చేసింది. ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల రైతులతో రైతు వేదికల ద్వారా వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడిన మంత్రులు రైతులకు పలు కీలక సూచనలు చేశారు. ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా రబీ సీజన్‌లో రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ వరి సాగు చేయవద్దని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో రైతు

మిగతా 2లో..

## సౌదీలోని దమ్మామ్ ఎయిర్‌పోర్టుపై హూతీల భీకరదాడి



రియాద్‌లోని కింగ్ ఖలీద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై కూడా మరోసారి దాడి .. వ్యక్తి మృతి

రియాద్(జనంసాక్షి):సౌదీ అరేబియాలోని దమ్మామ్‌లోని కింగ్ ఫహాద్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుపై ఆదివారం అర్ధరాత్రి హూతీ రెబల్స్ క్షిపణులతో విరుచుకుపడ్డారు. దమ్మామ్‌లో జరిగిన దాడిలో నష్టం వివరాలు ఇంకా

మిగతా 2లో..

## ఆర్థిక శాస్త్రంలో ఇద్దరికి నోబెల్ పురస్కారం

ఆర్థిక శాస్త్రంలో ప్రతిష్ఠాత్మక నోబెల్ పురస్కారాన్ని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ప్రకటించింది. 2026 సంవత్సరానికి గానూ ఇద్దరికి దీనిని అందించనుంది. 'స్థూల ఆర్థిక స్థిరీకరణకు సూక్ష్మ ఆర్థిక పునాదులు' అంశంపై అమెరికాకు చెందిన రాబర్ట్ ఇ.హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్‌లు ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. వైద్యవిభాగంతో మొదలైన నోబెల్ పురస్కారాల ప్రకటన నేటితో ముగిసింది. కాలిఫోర్నియాకు చెందిన రాబర్ట్ ఇ. హాల్.. 1967లో మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. మసాచుసెట్స్‌కు చెందిన వుడ్‌ఫోర్డ్ సైతం ఎమ్ఐటీ నుంచి 1983లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. కొలంబియా విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా ఉన్నారు. ఈ ఇద్దరు అభివృద్ధి చేసిన కొత్త ఆర్థిక నమూనాల ఆధారంగా.. సరైన సమయంలో తీసుకునే ఆర్థిక, ద్రవ్య విధాన చర్యలు ఆర్థిక వ్యవస్థలోని హెచ్చుతగ్గులను తగ్గించగలవని నిరూపితమయ్యాయి.

## సౌదీలోని దమ్మామ్ ఎయిర్‌పోర్టుపై హూతీల భీకరదాడి

తెలియాల్సి ఉంది. మరోవైపు రియాద్‌లోని కింగ్ ఖలీద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై కూడా రెండో విడత దాడి చేశారు. ఈ దాడిలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. దమ్మామ్ విమానాశ్రయం రియాద్‌కు 410 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇది అరేబియన్ గల్ఫ్ తీరంలో కీలక పారిశ్రామిక నగరం. దీనికి తోడు ఇక్కడి ఎయిర్‌పోర్టు కీలక ఏవియేషన్ హబ్. సౌదీ అరేబియా ఎయిర్‌పోర్టులకు ప్రయాణికులు, విమానాలు వెళ్లొద్దని హూతీలు హెచ్చరికలు జారీ చేశారు. తమపై సౌదీ దాడులు నిలిపివేసే వరకు తాము వెనక్కి తగ్గమన్నారు. సౌదీకి మరింత భయానక పరిస్థితి రానుందని పేర్కొన్నారు.సౌదీ–హూతీలు చర్చలతోనే సమస్యలు పరిష్కరించుకోవాలని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ పేర్కొన్నారు. తమకు పొరుగుదేశాలతో యుద్ధాలు చేయాలన్న కోరికలేదని పేర్కొన్నారు. హూతీలు పూర్తిగా స్వతంత్ర వైఖరితోనే పనిచేస్తున్నారన్నారు. సౌదీపై దాడులకు ఇరాన్ ప్రోత్సహించిందన్న వాదనలు వస్తున్న నేపథ్యంలో అరాగ్చీ స్పందించారు.రియాద్ ఎయిర్‌పోర్ట్‌పై దాడిని తుర్కియే తీవ్రంగా ఖండించింది. ఇవి అంతర్జాతీయ చట్టాలకు పూర్తిగా వ్యతిరేకమని పేర్కొంది. వీటిని తక్షణమే నిలిపేయాలని డిమాండ్ చేసింది. సౌదీకి తాము పూర్తిగా అండగా నిలుస్తామని ప్రకటించింది. సౌదీకి అత్యవసరమైతే తప్ప తమ దేశ ప్రజలు వెళ్లొద్దని యూకే ట్రావెల్ అడ్వైజరీ జారీ చేసింది. ముఖ్యంగా జెడ్డా, దమ్మామ్, మదీనా ఎయిర్‌పోర్టులకు వెళ్లే విషయంలో అప్రమత్తంగా ఉండాలని పేర్కొంది.

## ఆర్థిక శాస్త్రంలో ఇద్దరికి నోబెల్ పురస్కారం

రాబర్ట్ ఇ. హాల్.. 1967లో మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. మసాచుసెట్స్‌కు చెందిన వుడ్‌ఫోర్డ్ సైతం ఎమ్ఐటీ నుంచి 1983లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. కొలంబియా విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా ఉన్నారు. ఈ ఇద్దరు అభివృద్ధి చేసిన కొత్త ఆర్థిక నమూనాల ఆధారంగా.. సరైన సమయంలో తీసుకునే ఆర్థిక, ద్రవ్య విధాన చర్యలు ఆర్థిక వ్యవస్థలోని హెచ్చుతగ్గులను తగ్గించగలవని నిరూపితమయ్యాయి.

## బీరు ఫ్యాక్టరీలపై ఉన్న ప్రేమ.. కోట్ల మంది ప్రజలపై లేదు: హరీశ్



హైదరాబాద్(జనంసాక్షి): సీఎం రేవంత్‌రెడ్డి వైఫల్యం వల్లే రాష్ట్రంలో విద్యుత్ కోతలు ఏర్పడ్డాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కారణంగా రైతులు ఇబ్బందిపడుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో హరీశ్ మీడియాతో మాట్లాడారు.“రైతుల కంటే ముఖ్యమైన అంశం ప్రభుత్వానికి ఏమి ఉంటుంది..? దేవాదుల, కల్వకుర్తిలో నీళ్లు లిఫ్ట్ చేసి ఉంటే కరవే ఉండేది కాదు. ఎల్‌నినో ఉందని ముందే తెలిసినా.. నీళ్లు లిఫ్ట్ చేసి పెట్టుకోలేదు. సింగూరు ప్రాజెక్టుకు మరమ్మతులు చేస్తామని 29 టీఎంసీలు ఖాళీ చేశారు. పనులు చేయకుండా ప్రాజెక్టును వదిలేశారు. హైదరాబాద్, రంగారెడ్డి, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు తాగునీరు ఎలా? కోట్ల మందికి తాగునీరిచ్చే ఈ ప్రాజక్టు పట్ల ఎందుకు నిర్లక్ష్యంగా ఉన్నారు? ప్రస్తుతం సింగూరు ప్రాజెక్టులో 3 టీఎంసీలే ఉన్నా.. బీరు ఫ్యాక్టరీలకు నీళ్లిస్తున్నారు. బీరు ఫ్యాక్టరీలపై ఉన్న ప్రేమ.. కోట్ల మంది ప్రజలపై లేదు. లిక్కర్ కంపెనీలకు నీటి కొరత రావొద్దని ఆబ్కారీ మంత్రి చెబుతున్నారు. తాగునీటిని బీరు కంపెనీలకు ఇస్తోన్న మిమ్మల్ని ఏం చేయాలి” అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

# మార్చ్ ఫర్ డెమోక్రసీ

ఈ పరిణామాల నేపథ్యంలో ఒకింత ఉద్రిక్త వాతావరణం నెలకొంది.మరోవైపు, సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో కాంగ్రెస్ పిటిషన్ దాఖలు చేసింది. రాహుల్ గాంధీ ర్యాలీలోనే ఆగిపోవడంతో న్యాయస్థానానికి రాలేకపోయారు. దీంతో ఆయన తరఫున న్యాయబృందమే పిటిషన్ దాఖలు చేసింది.అంతకుముందు, 'ఓట్ల చోరీ' అంశాన్ని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌వద్ద లేవనెత్తాలని ఇండియా కూటమి నిర్ణయించింది. ఇందుకు సంబంధించి విజ్ఞాపన పత్రం సమర్పించేందుకు తమకు సమయం ఇవ్వాలని సీజేఐని అభ్యర్థించింది. అయితే, ఇందుకు సీజేఐ తిరస్కరించారు. న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్న అంశాన్ని విపక్షాలతో చర్చిస్తే.. అది చట్టవిరుద్ధమే అవుతుందని జస్టిస్ సూర్యకాంత్ విపక్షాలకు లేఖ రాశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండును మరింత బలంగా వినిపించేందుకు కాంగ్రెస్ పార్టీ సోమవారం సుప్రీం కోర్టు వరకూ భారీ ర్యాలీకి తలపెట్టింది. ఈ నేపథ్యంలో ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రత్యేక మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రానికి పలు ప్రశ్నలు సంధించారు. నిరసనల వేళ దిల్లీని ఎందుకు జైలుగా మార్చారని ప్రశ్నించారు. 'ఓట్ల చోరీ' అంశాన్ని లేవనెత్తేందుకు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అపాయింట్‌మెంట్ కోరినా అనుమతి లభించని విషయాన్ని ఆయన ప్రస్తావించారు. సీజేఐని ఎవరు నిర్దేశిస్తున్నారని అడిగారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నుంచి తనకు సందేశాలు వస్తున్నాయని రాహుల్ ఈ సందర్భంగా తెలిపారు. “ఆయన ఎంత ఒత్తిడిలో పనిచేస్తున్నారో మేం అర్థం చేసుకోగలం. ఇకనైనా అప్రూవర్‌గా మారి రాజీనామా చేయండి. అదే మీరు దేశానికి చేసే నిజమైన సేవ. అప్పుడు మేం క్షమిస్తాం” అని కాంగ్రెస్ ఎంపీ పేర్కొన్నారు. “భాజపాకు దేశ ప్రజల్లో 12 ఏళ్లుగా వ్యతిరేకత ఉంది. ఇప్పుడది ఒక స్పష్టమైన రూపం దాల్చుతోంది. కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళనల వేళ దిల్లీలో ఒక భయానక వాతావరణాన్ని సృష్టించారు. నగర రోడ్లపై దాదాపు 30వేల మంది పోలీసులను మోహరించారు. దేశ రాజధానికి రాకుండా అడ్డుకుంటున్నారు. మొత్తం దిల్లీని కోటగా, జైలుగా మార్చేయాల్సిన అవసరం ఏమొచ్చింది? ఆర్ఎస్ఎస్ గూండాలకు ఉన్న స్వేచ్ఛ.. యువతకు ఎందుకు లేదు? మహిళలపై భాజపా, ఆర్ఎస్ఎస్ గూండాలు దాడులు చేస్తున్నారు. ప్రస్తుత పరిణామాలతో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని మాకు తెలుసు. ఆయన రాజీనామా చేయాల్సిందే. అప్పటివరకు మేం వదిలిపెట్టబోం” అని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. “దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని.. భారత ప్రధాన న్యాయమూర్తికి చెప్పాలని భావించాం. ఎన్నికల్లో జరుగుతున్న అక్రమాలను సీజేఐ దృష్టికి తీసుకెళ్లాలనుకున్నాం. అందుకోసమే ఆయన అపాయింట్‌మెంట్ కోరాం. కానీ, మా విజ్ఞప్తిని సీజేఐ తిరస్కరించారు. సుప్రీం కోర్టులో పిటిషన్ వేసుకోవాలని అన్నారు. అందుకే నేడు అత్యున్నత న్యాయస్థానం వరకు ర్యాలీగా వెళుతున్నాం. జ్ఞానేశ్ కుమార్‌పై సుప్రీంలో పిటిషన్ వేస్తాం” అని రాహుల్ వెల్లడించారు.“ప్రస్తుతం ప్రజలు, ప్రతిపక్షాలన్నీ ఒకవైపు ఉంటే.. మోదీ, అమిత్ షా, అజిత్ ఢోబాల్, జ్ఞానేశ్ కుమార్, మోహన్ భాగవత్ మరోవైపు ఉన్నారు. వారు ప్రజాస్వామ్యాన్ని చంపేస్తున్నారు. మోదీకి నేను చెప్పేది ఒక్కటే.. మీ ప్రభుత్వంలోని 200 మంది అధికారులు మాతో టచ్‌లో ఉన్నారు. ఇది మోదీ–రాహుల్ మధ్య జరిగే యుద్ధం కాదు. దేశ యువత భవిష్యత్తు, రాజ్యాంగాన్ని రక్షించడం కోసం జరుగుతున్న పోరాటం. ఎన్నికల వ్యవస్థ ప్రక్షాళన జరిగే వరకు మా పోరాటం కొనసాగుతుంది. ఆ ఐదుగురు నేరగాళ్లు న్యాయవిచారణ ఎదుర్కొనే వరకు వదిలిపెట్టేది లేదు” అని రాహుల్ స్పష్టం చేశారు.

## జ్ఞానేశ్ దిగిపోయే వరకు ఆందోళన ఆగదు

ఇప్పుడు ఇక, దేశమంతా జంతర్‌మంతర్‌గా మారుతుంది” అని సీజేపీ కన్వీనర్ సౌరవ్ దాస్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.ఈ జంతర్ మంతర్‌ను మొగల్ చక్రవర్తి మహమ్మద్ షా పాలనా కాలంలో రాజ్‌పుత్ పాలకుడు మహారాజా సవాయి జయ్‌సింగ్–2 1731లో నిర్మించారు. తొలుత దిల్లీలో ప్రధాన నిరసనలు ఇండియా గేట్ సమీపంలోని బోట్ క్లబ్ మైదానంలో జరిగేవి. 1993 నాటికి దిల్లీలో నిరసనలు నిర్వహించే అధికారిక వేదికగా జంతర్ మంతర్ రోడ్ గుర్తింపు పొందింది. దీంతో అప్పటి నుంచి ఇది ప్రధాన ధర్నా వేదికగా మారింది. ఇటీవల సీజేపీ ఆందోళనలకు ఇది వేదికైన సంగతి తెలిసిందే.

## ఫారం-6పై ఎటువంటి తీర్పు వెలువరించలేదు

చేసిన ప్రకటనని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం తప్పుబట్టింది. చట్టబద్ధమైన నిబంధనలు సవరించకుండా ఫారం–6 లో ఎన్నికల సంఘం మార్పులు చేసిందని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టుకు వెల్లడించారు. అంతటితో ఆగకుండా అందరినీ నమ్మించేందుకు ఆ ఫారాన్ని సుప్రీంకోర్టు ఆమోదించినట్లు సెప్టెంబరు 26న తప్పుడు ప్రకటన జారీ చేసిందని ఆరోపించారు. ఓటర్ల నమోదు ప్రక్రియలో ఈసీ ఏకపక్ష నిర్ణయాలపై చర్యలకు ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై విచారణ జరిపిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పై వ్యాఖ్యలు చేసింది.

## నిరసనలకు జంతర్‌మంతర్ ఇక వేదిక కాదు..

- డీనోటిఫై చేసిన దిల్లీ పోలీసులు
- ఇక, దేశమంతా జంతర్‌మంతర్
- కేంద్రం నిర్ణయంపై సీజేపీ అభ్యంతరం

చేశారు.జంతర్ మంతర్‌కు బదులుగా మరో మూడు ప్రత్యామ్నాయ ప్రాంతాలను సూచించారు. రామ్‌లీలా గ్రౌండ్, బురారీ గ్రౌండ్, సీబీడీ గ్రౌండ్‌ను నిరసన వేదికలుగా వినియోగించుకోవచ్చని పోలీసులు వెల్లడించారు. “ఆందోళనలు, ధర్నాల కోసం ప్రత్యామ్నాయ వేదికలను పరిశీలించేందుకు ఇటీవల కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఓ కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ సిఫార్సుల మేరకు జంతర్ మంతర్‌ను నిరసనల వేదికగా డీనోటిఫై చేస్తున్నాం. కొత్త వేదికల వద్ద నిరసన ప్రదర్శనలు నిర్వహించడానికి విధి విధానాలను త్వరలోనే జారీ చేస్తాం” అని దిల్లీ పోలీసు కమిషనర్ అనురాగ్ కుమార్ తమ ప్రకటనలో వెల్లడించారు.

## మణిపూర్ బాధితుల కోసం గళమెత్తిన ఎంపీపై విమెన్ అట్రాసిటీ కేసు

సందర్భంగా అనుచిత వ్యాఖ్యలు చేశారన్నది ఫిర్యాదుల్లోని ప్రధాన ఆరోపణగా పేర్కొంటు న్నారు. మొత్తం 11 మంది విద్యార్థినులు ఫిర్యాదు చేసినట్లు కొన్ని కథనాలు వెల్లడించాయి. ఈ ఆరోపణలను అకోయిజమ్ ఖండిస్తున్నారు. ఆరోపణలు చేసిన విద్యార్థినుల వాదనలతో పాటు, తన వివరణను, తన తరఫు సాక్షుల వాంగ్మూలాలను కూడా సమగ్రంగా పరిశీలించాల్సి ఉందన్నది ఆయన అభ్యంతరం. విశ్వవిద్యాలయ అంతర్గత కమిటీ విచారణ అనంతరం అక్టోబర్ 9న అకోయిజమ్‌ను ఉద్యోగం నుంచి తొలగిస్తూ జేఎన్‌యూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, విచారణ ప్రక్రియలో తనకు సహకరించే అవకాశం ఇవ్వలేదన్న విశ్వవిద్యాలయ వాదనను ఆయన తోసిపుచ్చారు. తన తరఫు సాక్షులు 2026 ఆగస్టు 14న వాంగ్మూలాలు ఇచ్చారని, విచారణ కమిటీ నుంచి వచ్చిన 43 ఈ–మెయిళ్లకు తాను సమాధానాలు ఇచ్చానని ఆయన వెల్లడించారు. తన వివరణను, సాక్షుల వాంగ్మూలాలను పరిగణనలోకి తీసుకోలేదని ఆరోపించారు. ఈ అంశాలపై విశ్వవిద్యాలయ యాజమాన్యం, ఎంపీ వాదనలు పరస్పరం భిన్నంగా ఉన్నాయి.ఇదిలా ఉండగా, అక్టోబర్ 11న జేఎన్‌యూ ప్రధాన భద్రతాధికారి చేసిన ఫిర్యాదు ఆధారంగా ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్లు 75, 75(1)(తి), 75(1)(తిల), 79 కింద కేసు నమోదైనట్లు పోలీసు వర్గాలను ఉటంకిస్తూ వార్తా కథనాలు పేర్కొన్నాయి. విద్యార్థినుల ఫిర్యాదులు మేలో విశ్వవిద్యాలయ అంతర్గత కమిటీకి అందినట్లు చెబుతుండగా, పోలీసులకు ఫిర్యాదు అక్టోబర్ 11న అందింది. ఈ రెండు దశల మధ్య జరిగిన ప్రక్రియ, ప్రధాన భద్రతాధికారి ఫిర్యాదులో పొందుపరిచిన వివరాలు, దాని ఆధారాలు ఏమిటన్న అంశాలు ప్రజలకు స్పష్టంగా తెలియాల్సిన అవసరం ఉంది.ప్రధాన భద్రతాధికారి ఫిర్యాదు చేయడం ఒక్కటే ఆరోపణలు నిజమని నిర్ధారించదు. అదే సమయంలో, ఫిర్యాదు ఆలస్యంగా నమోదైందనే కారణంతో ఆరోపణలు నిరాధారమని కూడా తేల్చలేం. విద్యార్థినుల అసలు ఫిర్యాదులు, అంతర్గత కమిటీ నివేదిక, సాక్షుల వాంగ్మూలాలు, పోలీసులకు సమర్పించిన పత్రాలు పరిశీలించినప్పుడే ఈ వ్యవహారంలోని వాస్తవాలు స్పష్టమవుతాయి. ఫిర్యాదు చేసిన అధికారి ఏ ఆధారాలను పోలీసులకు అందించారు? విశ్వవిద్యాలయ అంతర్గత విచారణలోని ఏ అంశాలను ఎఫ్ఐఆర్‌కు ఆధారంగా తీసుకున్నారు? ఎంపీ అభ్యంతరాలకు విశ్వవిద్యాలయ యాజమాన్యం ఏమి సమాధానం చెబుతోంది? అనే ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది.అకోయిజమ్ తనపై జరిగిన చర్యలను అన్యాయంగా అభివర్ణిస్తూ, విశ్వవిద్యాలయ ఉపకులపతి తన విచారణ సహకారానికి సంబంధించిన వివరాలపై తప్పుడు ప్రకటనలు చేశారని ఆరోపించారు. ఈ వ్యవహారాన్ని న్యాయపరంగా ఎదుర్కొంటానని కూడా తెలిపారు. ఆయన చేసిన ఆరోపణలపై విశ్వవిద్యాలయ యాజమాన్యం వాదనను, అందుబాటులో ఉన్న విచారణ రికార్డులను కూడా పరిశీలించడం అవసరం. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి తన వాదనను వినిపించే హక్కును కాపాడుతూనే, ఫిర్యాదుదారుల ఆరోపణలను నిష్పక్షపాతంగా విచారించడం న్యాయవ్యవస్థ బాధ్యత.మణిపూర్‌లో మహిళలపై హింసకు వ్యతిరేకంగా పార్లమెంటులో మాట్లాడిన ఎంపీ ఇప్పుడు మహిళల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఎదుర్కొంటుండటం రాజకీయంగా చర్చకు దారితీసింది. అయితే, ఆయన పార్లమెంటులో లేవనెత్తిన అంశాలకు, ప్రస్తుత కేసుకు మధ్య సంబంధం ఉందని నిర్ధారించే ఆధారాలు ఇప్పటివరకు బహిర్గతం కాలేదు. రాజకీయ విమర్శలకు అతీతంగా, ఈ కేసులోని వాస్తవాలు, విచారణ విధానం, చట్టపరమైన ప్రక్రియ పారదర్శకంగా వెలుగులోకి రావడం అవసరం. ఆరోపణలను తుది తీర్పుగా పరిగణించకుండా, సంబంధిత పత్రాలు, సాక్ష్యాలు, ఇరుపక్షాల వాదనల ఆధారంగా న్యాయం జరగాలి.

### ఇ-కామర్స్ డెలివరీ సర్వీస్‌లపై 5% జీఎస్టీ..

## పుకార్లే..

కేంద్రం క్లారిటీ!

ఇ–కామర్స్ డెలివరీ సేవలపై కేంద్ర ప్రభుత్వం 5 శాతం జీఎస్టీ విధించిందని సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్న ప్రచారాన్ని కేంద్రం ఖండించింది (ఈజీఇఃబి ఇఃఫ్రవఇఃఎ). అవన్నీ తప్పుడు కథనాలని, అవాస్తవాలను నమ్మవద్దని కోరింది. ఇ–కామర్స్ సర్వీస్‌లపై కొత్తగా ఎలాంటి జీఎస్టీని విధించలేదని స్పష్టం చేసింది. ఈ మేరకు పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం ఎక్స్ వేదికగా స్పందించింది. ఫుడ్ డెలివరీ యాప్‌లు వంటి ఇ–కామర్స్ డెలివరీ సేవలపై జీఎస్టీ కౌన్సిల్ కొత్తగా ఎలాంటి పన్నులను తీసుకురాలేదని కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ మండలి స్పష్టం చేసింది. ఈ సేవలపై గతంలో 18 శాతం జీఎస్టీ విధించగా.. 57వ జీఎస్టీ కౌన్సిల్‌లో 5 శాతానికి తగ్గించినట్లు తెలిపింది. ఇది కొత్తగా విధించిన పన్ను కాదని, ఇప్పటికే ఉన్న పన్ను రేటును తగ్గించడమని పేర్కొంది. ఇ–కామర్స్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా అందించే అన్ని డెలివరీ సేవలకు ఇకపై 5 శాతం జీఎస్టీ వర్తిస్తుందని స్పష్టం చేసింది. తప్పుడు కథనాలను విశ్వసించేముందు అధికారిక సమాచారాన్ని తనిఖీ చేసుకోవాలని సూచించింది. అవాస్తవాలను ఇతరులకు షేర్ చేయొద్దని కోరింది.

### ఎస్ఐఆర్ పేరుతో ఓట్-చోరీకి

# మోడీ, షా, జ్ఞానేష్ కుట్ర

జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల నాయకత్వంలో ఈ పోరాటం కొనసాగుతోందని తెలిపారు. బ్రిటిష్ పాలన నుంచి దేశానికి స్వేచ్ఛ, స్వపరిపాలన కల్పించేందుకు ఆనాడు కాంగ్రెస్ నాయకులు పోరాడారని, ఇప్పుడు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాపాడుకునేందుకు పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని సీఎం తెలిపారు. ఓటు బచావో.. దేశ్ బచావో ఆందోళనలో భాగంగా ఢిల్లీ తెలంగాణ భవన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఆనాడు స్వాతంత్ర్యం కోసం 'సైమన్ గో బ్యాక్' ఉద్యమం సాగిందని, ఇప్పుడు ఓటు హక్కును కాపాడుకునేందుకు 'జ్ఞానేశ్ గో బ్యాక్', 'ఎస్ఐఆర్ గో బ్యాక్' నినాదాలతో ఉద్యమించాల్సిన అవసరం వచ్చిందని సీఎం అన్నారు. భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను ముందుపెట్టి, ఓటర్ల జాబితా సవరణ పేరుతో ప్రజల ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని సీఎం ఆరోపించారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో లాలా లజపతిరాయ్, భగత్‌సింగ్, మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ వంటి నాయకుల త్యాగాలు చిరస్మరణీయమని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. 'సైమన్ గో బ్యాక్' ఉద్యమ సమయంలో లాలా లజపతిరాయ్ లాఠీచార్జిలో తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఎందరో నాయకుల త్యాగాలు, పోరాటాల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని పేర్కొన్నారు. అయితే, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం దేశ ప్రజలకు ఓటు అనే శక్తిమంతమైన ఆయుధాన్ని అందించిందన్నారు. రాజరిక, కుటుంబ పాలనలకు ముగింపు పలికి ప్రజల చేతిలో అధికారం పెట్టడంలో ఓటు హక్కు కీలక పాత్ర పోషించిందని సీఎం తెలిపారు. పేదలు, దళితులు, గిరిజనులు సహా అన్ని వర్గాల ప్రజలకు ఓటు హక్కు కల్పించడం ద్వారా అంబేద్కర్ సమానత్వానికి బాటలు వేశారని సీఎం కొనియాడారు. గతంలో ఓటు హక్కు కల్పించేందుకు ఎస్ఐఆర్‌గతంలోనూ ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ జరిగిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. 1950లో జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానిగా ఉన్న సమయంలో ఈ ప్రక్రియ ద్వారా ఓటు హక్కు లేని వారికి ఓటు హక్కు కల్పించారని సీఎం గుర్తు చేశారు. దేశ విభజన సమయంలో ప్రజలు ఎక్కడ స్థిరపడ్డారు? ఎవరు ఏ ప్రాంతానికి వెళ్లారు? అనే వివరాలను గుర్తించాల్సిన అవసరం కూడా అప్పట్లో ఏర్పడిందని పేర్కొన్నారు. తర్వాత ఇందిరాగాంధీ, అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వాల కాలంలోనూ ఎస్ఐఆర్ ప్రక్రియ జరిగిందని గుర్తు చేశారు. అయితే, గతంలో ఓటర్ల జాబితాలో పేర్లు లేని అర్హులైన వారిని చేర్చడంపైనే ప్రధానంగా దృష్టి పెట్టేవారని అన్నారు. ఇప్పుడు మోదీ, అమిత్ షాల పాలనలో మాత్రం ఇప్పటికే ఓటు హక్కు ఉన్నవారి పేర్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని సీఎం మండిపడ్డారు. గతంలో ఈ ప్రక్రియను ప్రజలకు మేలు చేసే చర్యగా చూశారని, ప్రస్తుత ప్రభుత్వం మాత్రం దాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. తమ అధికారానికి అడ్డుగా ఉన్న రాజకీయ ప్రత్యర్థులను దెబ్బతీసేందుకు కేంద్ర ప్రభుత్వం గతంలో ఈడీ, సీబీఐ, ఆదాయపు పన్ను శాఖ, నార్కోటిక్స్ విభాగం వంటి సంస్థలను



ఉపయోగించుకుందని, ఇప్పుడు వాటితో రాజకీయ ప్రత్యర్థులను ఎదుర్కోవడం కష్టమవుతోందనే ఉద్దేశంతో ఎస్ఐఆర్‌ను తెరపైకి తెచ్చారని సీఎం విమర్శించారు. ఈసీఐ ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను ముందుపెట్టి మోదీ ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని నడిపిస్తోందని ఆరోపించారు. ఎన్నికల సంఘం స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా పనిచేయాల్సిన రాజ్యాంగబద్ధ సంస్థ అని అన్నారు. అలాంటి సంస్థను రాజకీయ అవసరాలకు ఉపయోగించుకోవడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని సీఎం హితవు పలికారు. ఎన్నికల సంఘం విశ్వసనీయత దెబ్బతింటే ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పోతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. × పారదర్శకత కోసమే నాడు ఎన్నికల సంఘంలో మార్పులుగతంలో ఎన్నికల సంఘం ఒక్క కమిషనర్ నేతృత్వంలో పనిచేసేదని, అయితే, ఈ సంస్థలో మరింత పారదర్శకత తీసుకువచ్చేందుకు ప్రధాన మంత్రిగా పి.వి.నరసింహారావు ఉన్న సమయంలో ముగ్గురు కమిషనర్ల విధానాన్ని తీసుకొచ్చారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. గతంలో ఎన్నికల కమిషనర్ల నియామకంలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇచ్చేవారని తెలిపారు. ప్రధానమంత్రి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ప్రధాన ప్రతిపక్ష నేత భాగస్వామ్యంతో నియామక ప్రక్రియ సాగేదన్నారు. మోదీ ప్రభుత్వం 2023లో ఈ విధానాన్ని మార్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. కమిషనర్ల నియామక ప్రక్రియలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్థానంలో కేంద్ర హోంమంత్రిని చేర్చారని ఆరోపించారు. నిర్ణయాలను తమకు అనుకూలంగా తీసుకునేందుకే ఈ మార్పులు చేశారని సీఎం మండిపడ్డారు.

# త్వరలోనే కరువు మండలాల ప్రకటన

నేస్తం కార్యక్రమంలో భాగంగా ఆయన, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సహా అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా రైతు వేదికల్లోని రైతులు, అధికారులతో మాట్లాడారు. జిల్లా కలెక్టర్లు, స్థానిక ప్రజా ప్రతినిధులు, రైతులు ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు.ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావం వల్ల ఈ ఏడాది వర్షపాతం తగ్గి నీటి లభ్యత గణనీయంగా తగ్గుతుందని హెచ్చరించారు. కాబట్టి నీటిని పొదుపుగా వినియోగించాలని, బిం దు సేద్యం ద్వారా పామ్ తోటలు, కూరగాయలు వంటి స్వల్ప కాలిక పంటలను సాగు చేయాలని సూచించారు. ప్రత్యామ్నాయ పంటలను సాగు చేస్తే మంచిదని సలహా ఇచ్చారు.వరి వంటి నీటి అవసరం ఎక్కువైన పంటలు సాగు చేస్తే తాగునీటి సమస్య తీవ్రమవుతుందన్నారు. జలసిరి కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతలు, నీటి కుంటలు, బోర్వెల్స్ రీఛార్జ్ వంటి పనులు చేపట్టి జలవనరులను కాపాడుకోవాలని కోరారు. రాష్ట్రంలో 315 మండలాల్లో వర్షపాతం తక్కువగా నమోదైందని, త్వరలోనే కరువు మండలాలను ప్రకటిస్తామని చెప్పారు. వచ్చే వర్షాకాలం నాటికి తాగునీటి సమస్యలు రాకుండా ఇప్పటి నుంచే నీటిని జాగ్రత్తగా వాడాలని సూచించారు.వ్యవసాయానికి విద్యుత్ సరఫరాపై సరైన ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. భూగర్భ జల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు గ్రౌండ్ వాటర్ లెవెల్ నివేదికలు అందించాలని ఆదేశించారు. ప్రజా సంక్షేమం కోసం అవసరమైన చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. రైతులు ఆందోళన చెందవద్దని అన్నారు. రైతులు ప్రభుత్వ సల హాలు పాటించి, నీటిని పొదుపుగా వినియోగిస్తే కష్టకాలం సులభంగా దాటవచ్చని ఆయన అన్నారు.

**HYDERABAD DISASTER RESPONSE &ASSET PROTECTION AGENCY**
Office of the Commissioner
(HYDRAA), 7th floor,Buddha Bhavan, Ranigunj, Hyderabad.
**Publication of Notice for Quotation**
DEPARTMENT:MUNICIPAL ADMINISTRATION DEPARTMENT – TELANGANA COMMISSIONER HYDRAA.

| S.No | Notice No. | Name of Work | Bid details |
|---|---|---|---|
| 1 | 01/COMM/HY-DRAA/2026-27, Dt:12.10.2026 | Inviting Sealed quotations for Procurement of Rescue Equipment, Tools & Machinery for Trucks of the O/o Commissioner, HYDRAA. | Quotation Submission Start Date & Time: 13.10.2026 at 11:00 AM Quotation Submission Closing Date & Time: 16.10.2026 at 5:00 PM |

The agencies / contractor / bidders shall submit the quotations in the Sealed Cover addressing in the name of Commissioner, HYDRAA, 7thFloor, Buddha Bhavan, Ranigunj, Secunderabad – 500003 and the shall submit the Sealed Quotation on their Letter Head at the specified address before the date: 16.10.2026 @ 5.00 PM.
Details are available on https://hydraa.telangana.gov.in/
Contact Person:-Additional Commissioner (Admin), HYDRAA
Mobile No. –040-29880748.
**Sd/- COMMISSIONER, HYDRAA**

## నిందితుల జాబితా నుంచి నా పేరు తొలగించండి

హైదరాబాద్ (జనంసాక్షి): నాంపల్లి ఏసీబీ కోర్టులో బీఆర్ఎస్ కార్యనిర్వా హక అధ్య క్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ డిశ్చార్జ్ పిటి షన్ దాఖలు చేశారు. ఫార్ములా ఈ– కార్ రేసు కేసులో నిందితుల జాబితా నుంచి తన పేరు తొలగించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ఏసీబీని న్యాయస్థానం ఆదేశించింది. డిశ్చార్జ్ పిటిషన్‌పై ఈనెల 30న విచారణ చేపడతామని పేర్కొంది. ఈ కేసులో కేటీఆర్ ఏ1గా ఉన్న సంగతి తెలిసిందే.

## విపక్షాలతో సమావేశం అధికార విభజన సూత్రానికి విరుద్ధం

న్యూఢిల్లీ(జనంసాక్షి):'ఓట్ల చోరీ' అంశంపై వినతి పత్రం సమర్పించేందుకు సోమవారం సమయం ఇవ్వాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌ను కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్ష నేతలు కోరగా.. అందుకు ఆయన నిరాకరించారు. ఈ విషయంపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ స్పందించారు. ఇండియా కూటమి నుంచి తనకు వచ్చిన అభ్యర్థనపై కాంగ్రెస్ నేతలు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీకి మెయిల్‌లో లేఖ పంపినట్లు వెల్లడించారు. సీఈసీ విషయంలో వారు లేవనెత్తాలనుకున్న సమస్యలపై ఇప్పటికే సుప్రీంకోర్టులో విచారణ పెండింగ్‌లో ఉందన్నారు. ఒక విషయంపై పిటిషన్ పరిశీలనలో ఉన్నప్పుడు దాని గురించి ఇతరులతో చర్చించడం.. రాజ్యాంగం ప్రకారం 'అధికార విభజన' సూత్రానికి, న్యాయపరమైన ఔచిత్యానికి విరుద్ధమని సీజేఐ అన్నారు. అంతేగాక, ఇండియా కూటమి నేతలు తమ లేఖలో ప్రస్తావించిన అంశాలను పరిష్కరించడానికి భారత రాజ్యాంగం ప్రకారం సుప్రీం కోర్టుకు ఎటువంటి పాలనాపరమైన అధికారాలు లేవని సీజేఐ స్పష్టం చేశారు. అందువల్లే వారి అభ్యర్థనను నిరాకరించినట్లు తెలిపారు. అయితే, రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద ఉన్న అధికార పరిధిని వినియోగించుకుంటూ.. భారత పౌరులపై ప్రభావం చూపే విషయాల్లోని ప్రధానాంశాలను పరిశీలించాల్సిన బాధ్యత తమకు ఉందన్నారు. ప్రతిపక్ష నేతలు తమ డిమాండ్లకు సంబంధించి న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేయాలని సూచించారు. సుప్రీం కోర్టు తలుపులు ఎల్లప్పుడూ అందరి కోసం తెరిచే ఉంటాయన్నారు. అంతేగానీ, సుప్రీంకోర్టును రాజకీయాల్లోకి లాగాలని చూడొద్దని ప్రతిపక్షాలను హెచ్చరించారు. ఎన్‌హెచ్‌ఆర్‌సీ సమావేశంలో 'నీరు–జీవన అమృతం' అనే అంశంపై మాట్లాడుతూ.. కలుషిత జలాల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సీజేఐ ఆందోళన వ్యక్తం చేశారు. దానివల్ల ప్రజల ఆరోగ్యాలకు భారీ ముప్పు పొంచి ఉందన్నారు. పౌరుల రాజ్యాంగ హక్కులను నెరవేర్చడానికి వారికి స్వచ్ఛమైన నీటి లభ్యత అత్యవసరమన్నారు. ప్రజలకు మంచి నీరు అందేలా నిర్వహణ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించారు. అదే సమయంలో ప్రజల రాజ్యాంగ హక్కులు ఉల్లంఘనకు గురైనప్పుడు న్యాయస్థానాలు జోక్యం చేసుకోవాలని పిలుపునిచ్చారు. తమకు వచ్చే ఫిర్యాదులపై మానవ హక్కుల కమిషన్లు విచారణ జరిపి, ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు.

# కానిస్టేబుల్‌పై దాడి చేసిన వ్యక్తికి రిమాండ్

- పరకాల సబ్-జైలుకు నిందితుడు గణేష్ తరలింపు



**చిట్యాల, అక్టోబర్ 12(జనం సాక్షి):** విధి నిర్వహణలో ఉన్న బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడిన నిందితుడు తుముల గణేష్‌ను అరెస్ట్ చేసి కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు చిట్యాల ఎస్సై పోచంపల్లి సతీష్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం... చిట్యాల సెంటర్‌లో ఘర్షణ జరుగుతోందని '112' ద్వారా సమాచారం అందడంతో, బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ మారబోయిన మహేష్ (పీసీ 4486) అక్కడికి చేరుకుని గొడవను ఆపేందుకు యత్నించారు. ఆ సమయంలో తుముల గణేష్ అనే వ్యక్తి కానిస్టేబుల్‌తో దురుసుగా ప్రవర్తిస్తూ, విధులకు ఆటంకం కలిగించి దాడికి పాల్పడ్డాడు. పోలీసులు గణేష్‌ను అదుపులోకి తీసుకుని రెండో అదనపు జ్యుడీషియల్ కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి దిలీప్ నాయక్ నిందితుడికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. దీంతో నిందితుడిని పరకాల సబ్–జైలుకు తరలించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం పనిచేసే పోలీసులపై దాడులకు దిగినా, విధులకు ఆటంకం కలిగించినా చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

# లారీ ఢీకొని 27 గొర్రెలు మృతి

- బాధిత కుటుంబానికి నష్టపరిహారం అందించాలి
- బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య డిమాండ్



**తాండూర్, అక్టోబర్ 12(జనం సాక్షి) :** లారీ ఢీకొని గొర్రెలు మృతి చెందిన ఘటనలో బాధిత గొర్రెల కాపరి కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య డిమాండ్ చేశారు. తాండూర్ మండలం రెచిని గ్రామానికి చెందిన గొర్రెల కాపరి బీరయ్యకు చెందిన 27 గొర్రెలు లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య సోమవారం బాధిత గొర్రెల కాపరి బీరయ్యను పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును, నష్టపోయిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ.. గొర్రెల మృతితో బీరయ్య కుటుంబం తీవ్రంగా నష్టపోయిందని, జీవనాధారం కోల్పోయి వీధిన పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా, తగిన నష్టపరిహారం అందేలా సంబంధిత అధికారులతో మాట్లాడి హామీ ఇస్తానని ఆయన భరోసా ఇచ్చారు. ప్రభుత్వం స్పందించి బీరయ్యను ఆర్థికంగా ఆదుకోవాలని ఆయన కోరారు.

# సెలవులైనా వదలని ప్రైవేటు పాఠశాలలు

- దసరా, బతుకమ్మ సెలవుల్లోనూ ప్రైవేట్ పాఠశాలల ఇష్టారాజ్యం!
- నిబంధనలు బేఖాతర్.. అధికారుల పర్యవేక్షణ కరువు



**నర్సంపేట, అక్టోబర్ 12 (జనంజసాక్షి) :** నర్సంపేట పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలలు దసరా, బతుకమ్మ సెలవుల సమయంలో నిబంధనలను బేఖాతర్ చేస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సెలవు రోజుల్లోనూ ఉపాధ్యాయులు, విద్యార్థులకు పాఠశాలల యాజమాన్యాలు ఇబ్బందులు కలిగిస్తున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపంతో కొన్ని పాఠశాలలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న పాఠశాలలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యాశాఖ అధికారి బిక్షపతిని వివరణ కోరగా వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.

# అర్ధరాత్రి ఇళ్ల కూల్చివేతపై కలెక్టర్‌కు ఫిర్యాదు

- తాడిచర్ల సర్పంచ్ బండి స్వామి ఆధ్వర్యంలో ధర్నా
- న్యాయం చేయాలని డిమాండ్



**భూపాలపల్లి, అక్టోబర్ 12 (జనంసాక్షి ):** తాడిచర్ల పరిధిలోని శాత్రాజ్‌పల్లి బ్లాక్–2 సింగరేణి బొగ్గు గని ప్రాంతంలో ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా అర్ధరాత్రి ఇళ్లను కూల్చివేశారని బాధితులు సోమవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మకు ఫిర్యాదు చేశారు. తాడిచర్ల సర్పంచ్ బండి స్వామి ఆధ్వర్యంలో కలెక్టరేట్‌కు చేరుకున్న బాధితులు వినతిపత్రం అందజేసి, అనంతరం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.

### అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకున్నాం

బంగారం కుదువపెట్టి, అప్పులు చేసి రూ.4 నుంచి 5 లక్షలు ఖర్చు చేసి నిర్మించుకున్న ఇళ్లను అర్ధరాత్రి కూల్చివేయడం అమానవీయమని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ నిర్మాణాల పేరుతో నోటీసులు ఇవ్వకుండా ఇళ్లను కూల్చివేయడానికి ఏ చట్టం అనుమతిస్తుందని ప్రశ్నించారు. తమకు న్యాయం చేయకుంటే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ఘటనపై మంత్రి శ్రీధర్‌బాబు స్పందించాలని డిమాండ్ చేశారు.

### మాజీ ఎమ్మెల్యేకు బాధితుల గోడు

కలెక్టరేట్‌కు వచ్చిన మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి బాధితులు తమ సమస్యలను వివరించి న్యాయం చేయాలని కోరారు. స్పందించిన ఆయన కలెక్టర్ రాహుల్ శర్మతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. బాధితుల నుంచి కలెక్టర్ వినతిపత్రాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్–2 ప్రాంత బాధితులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# టాస్క్‌లో ఉచిత శిక్షణ ప్రారంభించిన జిల్లా కలెక్టర్

- యువత ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకొని ఉద్యోగాలు సాధించాలి : జిల్లా కలెక్టర్



కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 12(జనంసాక్షి): ఆసిఫాబాద్‌లోని టాస్క్ ప్రాంతీయ కేంద్రంలో ఉచిత బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమాశిక్షణ కార్యక్రమాన్ని సోమవార ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, యువత శిక్షణను సద్వినియోగం చేసుకొని నైపుణ్యాలను పెంపొందించుకుని మంచి ఉద్యోగాలు సాధించాలని సూచించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరై, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, వృత్తిపరమైన సామర్థ్యాలను అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టాస్క్ ప్రాంతీయ కేంద్రం మేనేజర్ రాకేష్, డీ డీ ఏం జి. సాయికుమార్ పాల్గొన్నారు.

# అజాంనగర్ రైతు అశోక్ మృతదేహం లభ్యం

- వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగలకు బలైనట్లు అనుమానాలు..
- నిందితులుగా అనుమానిస్తున్న వారి విచారణతో బయటపడిన ఆచూకీ..
- యామన్‌పల్లి సమీపంలోని దట్టమైన అడవిలో కుళ్లిపోయిన స్థితిలో మృతదేహం గుర్తింపు..





**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం యామన్‌పల్లి శివారులో నాలుగు రోజుల క్రితం అదృశ్యమైన భూపాలపల్లి మండలం అజాంనగర్ గ్రామానికి చెందిన జడల అశోక్ (35) ఘటన విషాదాంతమైంది. అశోక్ మృతదేహం సోమవారం యామన్‌పల్లి సమీపంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో లభ్యమైంది. వేటగాళ్లు అడవిలో అమర్చిన విద్యుత్ తీగలకు బలై ఉంటాడనే అనుమానాల నేపథ్యంలో ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. అశోక్ అదృశ్యంపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించగా, వారు వెల్లడించిన సమాచారంతో మృతదేహం ఆచూకీ బయటపడినట్లు తెలిసింది. యామన్‌పల్లి గ్రామానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలోని మేదరికొంప ప్రాంతంలో, దట్టమైన చెట్లు, పొదల మధ్య మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. నాలుగు రోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడినప్పటికీ.. అశోక్ మరణానికి దారితీసిన పరిస్థితులు, ఘటనలో ఎవరెవరి పాత్ర ఉందన్న అంశాలపై పూర్తిస్థాయి స్పష్టత రావాల్సి ఉంది.

అజంనగర్‌కు చెందిన జడల అశోక్ అదృశ్యమైనప్పటి నుంచి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అడవిలోకి వెళ్లిన అశోక్ ఏమయ్యాడు? ఎక్కడికి వెళ్లాడు? అతడికి ఏం జరిగింది? అన్న ప్రశ్నలు మిస్టరీగా మారాయి. మృతదేహం కోసం కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆందోళనకు దిగడంతో ఘటన మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ క్రమంలో కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించారు. విచారణలో లభించిన సమాచారం ఆధారంగా అటవీ ప్రాంతంలో గాలింపు చేపట్టి మృతదేహాన్ని గుర్తించినట్లు తెలిసింది. అయితే అనుమానితులు వెల్లడించిన వివరాలు, ఘటనలో వారి పాత్రపై పోలీసులు అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది.

నాలుగు రోజులుగా అటవీ ప్రాంతంలోనే ఉండటంతో అశోక్ మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో లభించినట్లు సమాచారం. యామన్‌పల్లి సమీపంలోని మేదరికొంప ప్రాంతం దట్టమైన అడవితో ఉండటంతో మృతదేహం గుర్తింపు, ఆచూకీ కనుగొనడం పోలీసులకు సవాలుగా మారింది. వేటగాళ్లు వన్యప్రాణుల కోసం అమర్చిన విద్యుత్ తీగలే అశోక్ మృతికి కారణమై ఉంటాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే అతడు విద్యుత్ తీగలకు తగిలి మరణించాడా? మరణించిన తర్వాత మృతదేహాన్ని అక్కడే వదిలేశారా? ఘటన వెనుక మరేదైనా కారణం ఉందా? అన్న విషయాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది.

అశోక్ అదృశ్యం, మృతదేహం ఆచూకీ తెలియకపోవడాన్ని పోలీసులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, కాటారం సీఐ నాగార్జునరావుతో పాటు మహాముత్తారం, కాటారం, మహాదేవ పూర్ ఎస్సైలు సమన్వయంతో గాలింపు చర్యలు చేపట్టారు. అటవీ ప్రాంతంలో విస్తృతంగా అన్వేషణ కొనసాగిస్తూ అనుమానితులను విచారించారు. చివరకు వారి నుంచి లభించిన సమాచారం ఆధారంగా మృతదేహాన్ని గుర్తించడంతో కీలక ముందడుగు పడింది. అయితే మృతదేహం లభ్యమైన ప్రాంతంలో లభించే ఆధారాలు, అనుమానితుల విచారణ, ఇతర పరిస్థితుల ఆధారంగా ఘటనకు సంబంధించిన వాస్తవాలను పోలీసులు నిర్ధారించాల్సి ఉంది.

### మిస్టరీకి తెర.. అసలు కారణాలపై ఉత్కంఠ!

నాలుగు రోజులుగా అశోక్ ఆచూకీ కోసం ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యులకు మృతదేహం లభ్యమైందన్న వార్త తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. అశోక్ అదృశ్యానికి సంబంధించి మృతదేహం ఎక్కడ ఉందన్న ప్రశ్నకు సమాధానం లభించినా, అతడి మరణానికి అసలు కారణమేంటన్నది ఇంకా తేలాల్సి ఉంది. వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగల వ్యవహారంలో ఎవరి పాత్ర ఉంది? అశోక్ మరణించిన పరిస్థితులేమిటి? ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు విచారణలో బయటపడతాయా? అన్న అంశాలపై ఉత్కంఠ నెలకొంది. పోలీసుల అధికారిక ప్రకటన, దర్యాప్తులో వెల్లడయ్యే వివరాలతోనే ఈ ఘటనపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# 142.8 కిలోల ఎండు గంజాయి స్వాధీనం

- వీటి విలు రూ.71.40 లక్షలు
- ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్ట్
- రెండు కార్లు సీజ్
- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 12 (జనం సాక్షి):** సంగారెడ్డి జిల్లాలో గంజాయి అక్రమ రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. కంది ఎక్స్ రోడ్డు వద్ద సోమవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ.71.40 లక్షల విలువైన 142.8 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఒడిశా రాష్ట్రానికి చెందిన ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితులను అరెస్ట్ చేసి, గంజాయి రవాణాకు ఉపయోగించిన రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఆదేశాల మేరకు ఎస్–నాబ్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రావు, సంగారెడ్డి రూరల్ సీఐ నయీముద్దీన్, ఎస్సై మధుసూదన్‌రెడ్డి, సీసీఎస్ ఎస్సై శ్రీకాంత్, సంగారెడ్డి పట్టణ ఎస్సై వెంకటేశం సిబ్బందితో కలిసి నమ్మదగిన సమాచారం మేరకు తనిఖీలు చేపట్టారు. పటాన్‌చెరు నుంచి సంగారెడ్డి వైపు వస్తున్న రెండు కార్లను తనిఖీ చేయగా, ఒక కారులో 35 ప్యాకెట్లలో తరలిస్తున్న గంజాయి బయటపడింది. ఈ ఘటనపై సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నంబరు 588/2026 నమోదు చేసి, నిందితులు రోషన్ కర్జీ (26), బిబుధ రాజ్హా (22)లను అరెస్ట్ చేసి న్యాయస్థానం ఆదేశాల మేరకు తరలించారు. జిల్లాలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ సాగు, రవాణా, విక్రయాలపై నిరంతరం నిఘా కొనసాగిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఉంటే ఎస్–నాబ్ నంబరు 8712656777కు తెలియజేయాలని, సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించిన పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.




# హైకోర్టు సర్వే ఆర్డర్లున్నా ఆగని నిర్మాణాలు

- కట్టడాలు ఆపాలంటూ హైడ్రాకు విన్నపాలు
- హైడ్రా ప్రజావాణికి 56 ఫిర్యాదులు

**హైదరాబాద్, అక్టోబర్ 12 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం ఇంజాపూర్ విలేజ్ సర్వే నంబరు 126లో 74.16 ఎకరాలప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిని కాపాడాలంటూ రెవెన్యూ అధికారులకు లేఖలు రాయడమే కాదు.. హైకోర్టుకు కూడా అక్కడి స్థానికులు ఆశ్రయించారు. మొత్తం సర్వే చేసి ఆ భూమి వివరాలు తెలపాలని రెవెన్యూ అధికారులను హైకోర్టు ఆదేశించింది. సర్వే జరగదు.. నిర్మాణాలు ఆగవు అనేట్టు అక్కడ కబ్జాలు జరుగుతున్నాయని స్థానికులు హైడ్రా ప్రజావాణిలో వాపోయారు. పెద్ద గోదాములు నిర్మించి భూమిని తమ ఆధీనంలోకి కబ్జాదారులు తీసుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. హైకోర్టు ఆర్డర్ ప్రకారం సర్వే చేసి.. ప్రభుత్వ భూమిని కాపాడాలంటూ హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. తుర్కయాంజల్ తొర్రూరు డివిజన్ ఇంజాపూర్ విలేజ్‌లోని పార్కుకోసం కేటాయించిన 1200ల గజాల స్థలాన్ని ప్లాట్లుగా చేసి విక్రయించేస్తున్నారని అక్కడి స్థానికులు పిర్యాదు చేశారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం కుంట్లూరులోని జయప్రకాష్‌నగర్ మంజీరా కాలనీలో కూడా 577 గజాల పార్కును కబ్జా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇలా సోమవారం హైడ్రా ప్రజావాణికి మొత్తం 56 ఫిర్యాదులందాయి. వీటిని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించి.. వెనువెంటనే పరిష్కరించాలని హైడ్రా అధికారులను ఆదేశించారు.

# భూముల రీ సర్వేకు ప్రతి మండలానికి 2 బృందాలను ఏర్పాటు చేయాలి

- ల్యాండ్ రెవెన్యూ చీఫ్ కమిషనర్ లోకేష్




**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 12(జనంసాక్షి ):** భూముల రీ సర్వేకు ప్రతి మండలం నుండి డిప్యూటీ తహసిల్దార్ గిర్ధావార్,సీనియర్ అసిస్టెంట్ ఆధ్వర్యంలో సర్వేయర్లతో కూడిన 2 బృందాలను ఏర్పాటు చేయాలని చీఫ్ కమిషనర్ ల్యాండ్ రెవెన్యూ సి సి ఎల్ ఎ లోకేష్ అన్నారు. సోమవారం హైదరాబాద్ లోని సి సి ఎల్ ఎ కార్యాలయం నుండి ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు అదనపు కలెక్టర్లు సర్వే ల్యాండ్ రికార్డు అధికారులతో జూన్ మీటింగ్ ద్వారా వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ కమిషనర్ ల్యాండ్ సర్వే మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి మండలం నుండి భూముల రీ సర్వే కొరకు నాయబ్ తహసిల్దార్, గిర్ధావార్,సీనియర్ అసిస్టెంట్ స్థాయిలో 2 బృందాలను ఏర్పాటు చేసి ప్రతి బృందంలో సర్వేయర్, లైసెన్సుడ్ సర్వేయర్ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సర్వే చేసే విధానం, యంత్రాల వినియోగంపై నాయ తహసిల్దార్ నుండి జూనియర్ అసిస్టెంట్ వరకు అవగాహన కలిగి ఉండేలా మాస్టర్ ట్రైనర్లతో శిక్షణ ఇవ్వాలని తెలిపారు. సర్వేను డి జి పి ఎస్, రోవర్స్ లలో చేపట్టాలని, 22 ఏ భూములపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. భూభారతిలో సవరణల కొరకు వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని, భూభారతి లోని నూతన విధానం, పోర్టల్ లోని అంశాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. జాతీయ రహదారుల నిర్మాణంలో భూసేకరణ వేగవంతం చేయాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ హర్ష చౌదరి, సర్వే ల్యాండ్ రికార్డ్ ఎ.డి. వినయ్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మండలం నుండి రీ సర్వే కొరకు 2 బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఇప్పటికే రెవెన్యూ సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో రీ సర్వేకు ఉపయోగించే రోవర్లు 13 ఉన్నాయని, జిల్లాలో భూభారతి దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేసి, 22 ఏ నిషేధిత భూముల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో అవినీతి తిమింగలం

- రూ.20 లక్షల లంచం తీసుకుంటూ చిక్కిన తహసీల్దార్, సర్వేయర్
- భూమి సర్వే రిపోర్టు కోసం భారీ డిమాండ్..
- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు
- అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో కలకలం
- ఇద్దరు అధికారులు అరెస్ట్, రిమాండ్ కు తరలింపు



**రంగారెడ్డి , అక్టోబర్ 12 (జనం సాక్షి):** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి తిమింగలాలు ఏసీబీ అధికారులకు చిక్కాయి. హెచ్‌ఎండీఏ నిబంధనల ప్రకారం భూమిని సర్వే చేసి జాయింట్ ఇన్‌స్పెక్షన్ సర్వే రిపోర్టు ఇచ్చేందుకు భారీగా లంచం డిమాండ్ చేసిన తహసీల్దార్. మండల సర్వేయర్‌ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. దాంతో మరోసారి రంగారెడ్డి జిల్లాలో కలకలం చోటు చేసుకుంది.

### రూ.30 లక్షల నుంచి బేరం కుదిరి...

బాధిత ఫిర్యాదుదారునికి సంబంధించిన భూమిని సర్వే చేసి నివేదిక ఇవ్వడానికి అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ బి. సుదర్శన్ రెడ్డి, మండల సర్వేయర్ బతుక శ్రీనివాసులు ఏకంగా రూ.30 లక్షలు లంచం డిమాండ్ చేశారు. బాధితుడు బ్రతిమలాడగా చివరకు ఆ మొత్తాన్ని రూ.20 లక్షలకు కుదుర్చుకున్నారు. ఈ వ్యవహారంపై బాధితుడు అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించడంతో వారు పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగారు.

### ఏసీబీ సోదాలు.. పట్టుబడిన వైనం..

తహసీల్దార్ ఆదేశాల మేరకు ఫిర్యాదుదారుడి నుండి రూ. 20 లక్షల లంచం మొత్తాన్ని తీసుకుంటుండగా మండల సర్వేయర్ బతుక శ్రీనివాసులును ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. సర్వేయర్ వద్ద ఉన్న లంచం సొమ్మును స్వాధీనం చేసుకుని, రసాయన పరీక్ష నిర్వహించగా ఆయన చేతివేళ్లకు పాజిటివ్ నిర్ధారణ అయింది. ఈ మొత్తం తతంగాన్ని తహసీల్దార్ బి. సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకే నడిపినట్లు ఏసీబీ విచారణలో స్పష్టమైంది. లంచం కేసులో అదుపులోకి తీసుకున్న తహసీల్దార్ బి. సుదర్శన్ రెడ్డి, మండల సర్వేయర్ బతుక శ్రీనివాసులును నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నట్లు వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి మరింత దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ప్రజలు భయపడకుండా ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని అధికారులు కోరారు.

# కిరాయి పోలీసులా?
# దేశ్ ఖత్రే మే హై!

సంపాదకీయం

ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం నేరం కాదు, ప్రశ్నించడం దేశద్రోహం కాదు. రాజ్యాంగం కల్పించిన హక్కులను వినియోగించుకుంటున్న పౌరుల మధ్యకు పోలీసు దుస్తులు, లాఠీలతో నిండిన ప్రైవేట్ వాహనం రావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా ఢిల్లీలో నిరసనలు జరుగుతున్న సమయంలో ఈ వ్యవహారం వెలుగులోకి రావడం మరిన్ని అనుమానాలకు తావిస్తోంది. జర్నలిస్టులు కోరినా ఆ వాహనాన్ని పోలీసులు తనిఖీ చేయలేదన్న ఆరోపణలు నిజమైతే, అది సాధారణ నిర్లక్ష్యం కాదు. చట్టాన్ని కాపాడాల్సిన వ్యవస్థే ప్రశ్నార్థకంగా మారిన పరిస్థితి.

***సామాన్యుడి వాహనాన్ని ఆపి పత్రాలు అడిగే పోలీసులు, పోలీసు దుస్తులు, లాఠీలతో నిండిన వాహనాన్ని ఎందుకు తనిఖీ చేయలేదు? అందులో ఎవరున్నారు? ఆ దుస్తులు ఎవరి కోసం తీసుకొచ్చారు? వాటి వెనుక ఎవరున్నారు? ఈ ప్రశ్నలకు సమాధానాలు చెప్పాల్సిన బాధ్యత ఢిల్లీ పోలీసులపై ఉంది. చట్టం ముందు అందరూ సమానమని చెప్పే వ్యవస్థ లో, అనుమానాస్పద పరిస్థితుల్లో అధికారుల మౌనం ప్రజల్లో అనుమానాలను మరింత పెంచుతుంది.***

శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్, కాంగ్రెస్ నేత పవన్ ఖేరా వంటి ప్రతిపక్ష నాయకులు ఈ వ్యవహారంపై తీవ్ర ఆరోపణలు చేశారు. గుర్తింపు లేని వ్యక్తులను పోలీసుల వేషంలో రంగంలోకి దించేందుకు ఈ దుస్తులు, లాఠీలు తెచ్చారన్నది వారి అనుమానం. ఈ ఆరోపణలు ఇంకా నిరూపితం కాలేదు. అయితే వాటిని రాజకీయ ఆరోపణలుగా కొట్టిపారేయడం ద్వారా బాధ్యత నుంచి తప్పించుకోలేరు. వాహనం ఎవరిది, అందులోని వ్యక్తులెవరు, పోలీసు దుస్తులు ఎందుకు తరలించారు అనే అంశాలపై నిష్పాక్షిక విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలి.

పోలీసు దుస్తులు వేసుకున్నంత మాత్రాన ఎవరూ చట్టానికి ప్రతినిధులు కాలేరు. చేతిలో లాఠీ ఉన్నంత మాత్రాన అధికారమూ రాదు. లిలి నిరసనకారులను అదుపు చేయాల్సి వస్తే చట్టబద్ధమైన అధికారాలు కలిగిన పోలీసులు, కనిపించే గుర్తింపుతో, జవాబుదారీతనంతో వ్యవహరించాలి. ఒకవేళ గుర్తింపు లేని వ్యక్తులను పోలీసుల వేషంలో పౌరులను భయపెట్టేందుకు ఉపయోగించినట్టు తేలితే, అది శాంతిభద్రతల పరిరక్షణ కాదు; ప్రజాస్వామ్య హక్కులపై తీవ్రమైన దాడి. అలాంటి చర్యలకు పాల్పడినవారితోపాటు, వాటి వెనుక ఉన్నవారిని కూడా చట్టం ముందు నిలబెట్టాలి.

ఎన్నికల సంఘం విశ్వసనీయతపై దేశవ్యాప్తంగా ప్రశ్నలు తలెత్తుతున్న సమయంలో నిరసనకారుల భద్రత, వారి హక్కులు మరింత కీలకమవుతాయి. ఎన్నికల ప్రక్రియపై సందేహాలు వ్యక్తమైతే సమాధానాలు చెప్పాలి. ప్రజలు నిరసన తెలిపితే చట్టబద్ధంగా వ్యవహరించాలి. విమర్శలకు వాస్తవాలతో జవాబివ్వాలి. అంతేతప్ప ప్రశ్నించే గొంతులను భయపెట్టే పరిస్థితులు ఏర్పడితే ప్రజాస్వామ్య సంస్థలపై ప్రజల నమ్మకం దెబ్బతింటుంది. ఎన్నికల సంఘం, పోలీసు వ్యవస్థ వంటి కీలక సంస్థలు రాజకీయ వివాదాల నీడలో కాకుండా, తమ పారదర్శకతతో ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలి.

ప్రజాస్వామ్యానికి ముప్పు ఎప్పుడూ బయటి శత్రువుల నుంచే రావాల్సిన అవసరం లేదు. రాజ్యాంగ విలువలను విస్మరించినప్పుడు, అధికార దుర్వినియోగాన్ని ప్రశ్నించనప్పుడు, చట్టం అమలులో వివక్ష కనిపించినప్పుడు కూడా ప్రజాస్వామ్యం బలహీనపడుతుంది. నిరసనకారులను శత్రువులుగా చూడటం, ప్రభుత్వాన్ని ప్రశ్నించడాన్ని దేశ వ్యతిరేక చర్యగా చిత్రించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. దేశం అంటే ప్రభుత్వం మాత్రమే కాదు; ప్రజలు, వారి హక్కులు, స్వేచ్ఛలు, రాజ్యాంగ సంస్థలు కలిపిందే దేశం.

'దేశ్ ఖత్రే మే హై' అని నినదించడం సులభం. కానీ దేశానికి నిజమైన ప్రమాదం ఏమిటి? రాజ్యాంగం ఇచ్చిన హక్కులతో ప్రశ్నించే పౌరులా? లేక చట్టబద్ధతపై అనుమానాలు రేకెత్తించే పరిస్థితులను నివృత్తి చేయని అధికార వ్యవస్థలా? దేశభక్తి అంటే అధికారాన్ని ప్రశ్నించకుండా మౌనంగా ఉండటం కాదు. రాజ్యాంగాన్ని, చట్టపాలనను, పౌరుల హక్కులను కాపాడటమే నిజమైన దేశభక్తి. దేశ భద్రత పేరుతో ప్రజల స్వేచ్ఛను బలహీనపరిచే ప్రయత్నం జరిగితే, దాన్ని ప్రశ్నించడం ప్రతి ప్రజాస్వామ్యవాది బాధ్యత.

ఢిల్లీ పోలీసులు తక్షణమే స్వతంత్ర, నిష్పాక్షిక విచారణ జరిపి వాహనం, అందులోని వ్యక్తులు, పోలీసు దుస్తుల వెనుక ఉన్న వాస్తవాలను బహిర్గతం చేయాలి. వీడియో దృశ్యాలను భద్రపరచి, బాధ్యులను గుర్తించి, విచారణ ఫలితాలను ప్రజలకు వెల్లడించాలి. తప్పు జరిగితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. తప్పు జరగలేదని తేలితే ఆ విషయాన్ని ఆధారాలతో నిరూపించాలి. మౌనం సమస్యను పరిష్కరించదు; పారదర్శకత మాత్రమే అనుమానాలను తొలగిస్తుంది.

దేశాన్ని కాపాడేది అధికారుల మౌనం కాదు–రాజ్యాంగం, చట్టపాలన, జవాబుదారీ తనం. **'హిందూ ఖత్రే మే హై'** అని నినదించే ముందు, ప్రజాస్వామ్యానికి ముప్పు ఎక్కడి నుంచి వస్తోందో అధికారంలో ఉన్నవారు ఆత్మపరిశీలన చేసుకోవాలి. ప్రజలను రక్షించాల్సిన వ్యవస్థలే ప్రజల్లో భయాన్ని, అనుమానాలను సృష్టించే పరిస్థితి రాకూడదు. ఎందుకంటే ప్రమాదంలో పడేది ఒక నిరసన కాదు, ఒక రాజకీయ పార్టీ కాదు – ప్రజాస్వామ్యంపై ప్రజలకున్న నమ్మకం.

# థియేటర్ వేదిక నుంచి ఉద్యమ రణరంగం వరకు.. నేహా బోరా

***ఒక చేతిలో నాటక స్క్రిప్టు.. మరో చేతిలో పుస్తకం.. కండ్ల ముందు సమాజం.. చుట్టూ కనిపించే అన్యాయాల మీద ప్రశ్నలు! ఆ ప్రశ్నలకు జవాబులు వెతుక్కుంటూ సాగిన ప్రయాణం చివరికి ఉద్యమం వైపు తీసుకుపోతుంది. నేహా బోరా ప్రయాణాన్ని అట్లా చూస్తే.. అది థియేటర్ వేదిక నుంచి ఉద్యమ రణరంగం దాకా వచ్చిన ఒక యువతి కథ మాత్రమే కాదు. తన చుట్టూ జరుగుతున్న అన్యాయాలను చూసి ఊరుకోకుండా.. "ఇదేందిలా?" అని ప్రశ్నిస్తున్న ఒక తరం కథ కూడా!***

2026 నాటికి 29 ఏళ్ల నేహా బోరా జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో థియేటర్ అండ్ పెర్ఫార్మెన్స్ స్టడీస్‌లో పీహెచ్‌డీ చేస్తున్నది. ఢిల్లీ విశ్వవిద్యాలయం, అంబేద్కర్ విశ్వవిద్యాలయాల్లో చదువుకున్నది. ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఐసా) జాతీయ అధ్యక్షురాలిగా బాధ్యతలు నిర్వహిస్తున్నది. చదువు, నాటకం, విద్యార్థుల సమస్యలు, నిరుద్యోగం, పరీక్షల వ్యవస్థ, ఓటు హక్కు.. ఇలా ఒక్కో అడుగు వేస్తున్నకొద్దీ ఆమె ప్రశ్నల పరిధి విస్తరిస్తూ వచ్చింది.

### పుస్తకాలు తెరిచిన కొత్త ప్రపంచం

నేహా పుట్టినిల్లు ఉత్తరాఖండ్‌లోని ఖతిమా. తండ్రి సైన్యంలో పనిచేయడంతో చిన్నతనం నుంచి కుటుంబం ఒకే చోట స్థిరంగా ఉండలేదు. తండ్రి పోస్టింగ్ ఎక్కడుంటే అక్కడికి కుటుంబం వెళ్లాల్సి వచ్చేది. పదో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు ఉత్తర బెంగాల్‌లో చదువుకున్నది. అక్కడి సామాజిక, సాంస్కృతిక వాతావరణం తన ఆలోచనలపై ప్రభావం చూపిందని నేహా చెబుతుంది. చదువుతో పాటు పుస్తకాలు ఆమె ప్రపంచాన్ని మరింత విస్తృతం చేశాయి. చారు మజుందార్ రచనలు పరిచయమయ్యాయి. పాబ్లో నెరుడా కవిత్వం చదివింది. అరుంధతీ రాయ్ రచనలు కూడా ఆమెను ప్రభావితం చేశాయి. మొదట తన చుట్టూ ఉన్న కుడిపక్ష భావజాలానికి దగ్గరగా ఉన్నప్పటికీ.. చదువుతున్నకొద్దీ ఆలోచనలు మారాయి. సమాజాన్ని చూసే చూపు మారింది. ప్రశ్నించే పద్ధతి మారింది. మన చుట్టూ కనిపించే అసమానతలు సహజమైనవేనా? కొందరికే అవకాశాలు ఎందుకు దక్కుతున్నాయి? మరికొందరికి ఎందుకు దక్కడం లేదు? ఇలాంటి ప్రశ్నలకు జవాబులు వెతుక్కునే క్రమంలో ఆమె ఎడమ భావజాలం వైపు అడుగులు వేసింది. అయితే నేహా రాజకీయాల్లోకి ఒక్కసారిగా దూకిన మనిషి కాదు. ఆమెకు మొదట పరిచయమైన వేదిక థియేటర్.

### స్టేజీ మీద పాత్ర నుంచి సమాజంలో ప్రశ్న వరకు

ఢిల్లీలో సామాజిక సమస్యలను ముందుకు తెచ్చే నాటకాలతో నేహా పనిచేసింది. నాటకం అంటే స్టేజీ మీద నిలబడి సంభాషణలు చెప్పడం మాత్రమే కాదని, మనుషుల జీవితాలను అర్థం చేసుకోవడానికి అదొక మార్గమని ఆమె అనుభవంలో తెలుసుకున్నది. థియేటర్ మనిషిని మరో మనిషి జీవితానికి దగ్గర చేస్తుంది. మనకు ఎదురుకాని కష్టాలను కూడా అర్థం చేసుకునే చూపునిస్తుంది. ఒకరి బాధను మరొకరు అనుభూతి చెందేలా చేస్తుంది. సమాజంలో కనిపించకుండా పోతున్న మనుషుల జీవితాలను వెలుగులోకి తీసుకొస్తుంది. ఆ అనుభవమే నేహాను విద్యార్థుల సమస్యల దగ్గరకు తీసుకెళ్లింది. విశ్వవిద్యాలయాల్లో ఫీజుల పెరుగుదల, స్కాలర్‌షిప్‌ల సమస్యలు, చదువుకునే అవకాశాల్లో అసమానతలు, క్యాంపస్‌లలో సామాజిక వివక్ష, విద్యార్థుల హక్కులు.. ఒక్కో సమస్యను పరిశీలిస్తున్నకొద్దీ ఆమె రాజకీయ అవగాహన పెరిగింది. చదువు కొందరికే దక్కే సౌకర్యం కాకూడదని, పేద కుటుంబాల పిల్లలకూ సమాన అవకాశాలు ఉండాలని ఆమె వాదించింది. విద్యార్థుల సమస్యల నుంచి విద్యా విధానం దాకా.. అక్కడి నుంచి నిరుద్యోగం దాకా.. చివరికి దేశ రాజకీయాలు, ప్రజాస్వామ్య హక్కుల దాకా ఆమె ప్రశ్నలు విస్తరించాయి. థియేటర్ ఆమెకు మనుషుల బతుకులను అర్థం చేసుకోవడం నేర్పితే.. పుస్తకాలు సమాజాన్ని చదవడం నేర్పాయి. విద్యార్థి ఉద్యమం ఆ ఆలోచనలకు కార్యరూపం ఇచ్చింది.

### ఒకే ఇంట్లో భిన్న రాజకీయాలు

నేహా రాజకీయ ప్రయాణంలో కుటుంబ నేపథ్యం కూడా ఆసక్తికరమైన అంశం. ఆమె కుటుంబంలో బీజేపీకి మద్దతు ఇచ్చేవాళ్లు ఉన్నారు. నేహా మాత్రం వామపక్ష రాజకీయాల వైపు వెళ్లింది. ఒకే ఇంట్లో భిన్న రాజకీయ అభిప్రాయాలు ఉండటం ఆమెకు కొత్త కాదు. ఆమె జంతర్ మంతర్ దగ్గర నిరాహార దీక్ష చేస్తున్నప్పుడు తల్లి అక్కడికి వచ్చి కూతురిని చూసింది. ఉద్యమం సాగుతున్న తీరును దగ్గరగా గమనించింది. రాజకీయ అభిప్రాయాలు వేరైనా కుటుంబ బంధాలు కొనసాగవచ్చని ఈ అనుభవం చెబుతుంది. మన అభిప్రాయాన్ని మనం నమ్మవచ్చు. ఎదుటివారి అభిప్రాయంతో విభేదించవచ్చు. కానీ రాజకీయ విభేదాల కారణంగా మనిషిని మనిషిగా చూడటం మానేయాల్సిన అవసరం లేదు. ప్రజాస్వామ్యం నేర్పే ముఖ్యమైన పాఠాల్లో ఇదొకటి.

### 23 రోజుల నిరాహార దీక్ష.. దేశవ్యాప్తంగా చర్చ

2026 జూలైలో నేహా బోరా పేరు దేశవ్యాప్తంగా వినిపించింది. పోటీ పరీక్షల్లో అవకతవకలు, పేపర్ లీకుల ఆరోపణలు, పరీక్షల నిర్వహణలో లోపాలు, ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న యువత నిరాశ.. ఈ సమస్యలపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సాగిన ఆందోళనలో ఆమె కీలక పాత్ర పోషించింది. చదువుకోడానికి ఏళ్ల తరబడి కష్టపడిన విద్యార్థులకు పరీక్షల వ్యవస్థ మీదే నమ్మకం పోతే పరిస్థితి ఏమిటి? పరీక్ష రాసిన తర్వాత ఫలితాల కోసం ఎదురుచూస్తున్న సమయంలో పేపర్ లీక్ వార్త వస్తే వారి భవిష్యత్తు ఏమవుతుంది? ఉద్యోగం కోసం నిరంతరం పోటీ పడుతున్న యువతకు ప్రభుత్వ వ్యవస్థ జవాబుదారీగా ఉండాల్సిన అవసరం లేదా? ఈ ప్రశ్నలు ఆందోళనకు కేంద్రబిందువయ్యాయి. ఐసా నాయకులు నేహా బోరా, మనీష్ కుమార్, అమీన్ అమితోజ్ తదితరులు నిరాహార దీక్షలో పాల్గొన్నారు. లడఖ్ హక్కుల కోసం పోరాడుతున్న సోనం వాంగ్‌చుక్ కూడా అదే ఆందోళన ప్రాంగణంలో నిరసన చేపట్టారు.



విద్యార్థుల నిరసన, సోనం వాంగ్‌చుక్ ఆందోళన ఒకే వేదికపై సాగినప్పటికీ, వారి డిమాండ్లు వేర్వేరు అంశాలకు సంబంధించినవి. విద్యా వ్యవస్థలో జవాబుదారీతనం, పరీక్షల నిర్వహణలో పారదర్శకత, విద్యార్థుల సమస్యల పరిష్కారం వంటి డిమాండ్లతో సాగిన నిరాహార దీక్ష 23 రోజుల పాటు కొనసాగింది. జూలై 20న నేహా, మనీష్, అమీన్ తమ దీక్షను విరమించారు. ప్రతిపక్ష ఎంపీలు, సామాజిక కార్యకర్తలు, ప్రజాప్రముఖులు చేసిన విజ్ఞప్తి అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. నిరాహార దీక్ష అంటే తిండి మానేయడం మాత్రమే కాదు. తమ సమస్యలను పట్టించుకోవాలని, తమ మాట వినాలని పాలక వ్యవస్థపై ఒత్తిడి తీసుకొచ్చే నిరసన రూపం. అయితే దీక్ష చేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? విద్యార్థులు తమ సమస్యల పరిష్కారం కోసం ఇంతటి కఠినమైన మార్గాన్ని ఎందుకు ఎంచుకున్నారు? ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతకాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. జూలై 25న కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. రాష్ట్రపతి ఆ రాజీనామాను ఆమోదించా రు. విద్యాశాఖ బాధ్యతలను ప్రహ్లాద్ జోషికి అప్పగించారు. విద్యార్థుల ఆందోళనల మధ్య ఈ పరిణామం చోటుచేసుకుంది. అయితే ఈ రాజీనామాకు ఒక్క నిరాహార దీక్షనే కారణంగా పేర్కొనడం కంటే.. పరీక్షల చుట్టూ పేరుకుపోయిన వివాదాలు, విద్యార్థుల నిరసనలు, రాజకీయ ఒత్తిళ్లు, ప్రభుత్వంపై పెరిగిన జవాబుదారీతనం డిమాండ్లను కలిపి చూడటం సముచితం. నేహా మాత్రం అక్కడితో ఆగలేదు. ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన కేసులు, అరెస్టులు, పోలీసు చర్యల గురించి తెలుసుకోవడానికి బీహార్‌కు వెళ్లింది. ఉద్యమంలో పాల్గొన్నవారిని మధ్యలో వదిలేయకూడదని ఆమె భావించింది. చదువు, పరీక్షలు, ఉద్యోగాల కోసం పోరాడుతున్న విద్యార్థుల గొంతు వినిపించాలన్నది ఆమె ప్రధాన వాదనగా కొనసాగింది.

### సిరా చల్లితే ప్రశ్నలు ఆగిపోతాయా?

ఆగస్టు 7న జార్ఖండ్ రాజధాని రాంచీలో మరో ఘటన జరిగింది. జేపీఎస్సీ, జేఎస్ఎస్సీ పరీక్షలకు సంబంధించిన అక్రమాల ఆరోపణలపై సాగుతున్న ఆందోళనల్లో పాల్గొన్న సమయంలో నేహాపై ఓ వ్యక్తి సిరా చల్లినట్లు వార్తలు వచ్చాయి. ఆ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు నివేదికలు పేర్కొన్నాయి. ఒకరి మీద సిరా చల్లినంత మాత్రాన ఆందోళన ఆగిపోతుందా? గొంతెత్తిన వారిని అవమానించినంత మాత్రాన ప్రశ్నలు మాయమవుతాయా? వ్యక్తులపై దాడులు చేయడం కంటే వారు లేవనెత్తుతున్న సమస్యలకు సమాధానాలు చెప్పడం ముఖ్యం. ప్రభుత్వ ఉద్యోగాల కోసం యువత ఏళ్ల తరబడి సిద్ధమవుతున్నది. కుటుంబాలు తమ ఆదాయంలో పెద్ద భాగాన్ని పిల్లల చదువుల కోసం ఖర్చు చేస్తున్నాయి. పరీక్షల నిర్వహణలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలు వచ్చినప్పుడు వాటిపై పారదర్శకమైన విచారణ జరిపి, బాధ్యులను గుర్తించి, అభ్యర్థులకు న్యాయం చేయాలి. నిరసన తెలిపేవారిని అవమానించడం లేదా వారి గొంతును అణచివేయడం సమస్యకు పరిష్కారం కాదు.

### పరీక్ష నుంచి ఓటు హక్కు దాకా

అక్టోబర్ 2న ఢిల్లీలో ఓటరు జాబితాల సవరణ, ప్రత్యేక సమగ్ర పునఃపరిశీలన ప్రక్రియకు సంబంధించిన అంశాలపై జరిగిన నిరసనల్లో నేహా మళ్లీ ముందువరుసలో కనిపించింది. ఓటరు జాబితాల విషయంలో పారదర్శకత, ఓటు హక్కు పరిరక్షణ, ఎన్నికల వ్యవస్థ జవాబుదారీతనం వంటి అంశాలు ఈ ఆందోళనల్లో ప్రాధాన్యం పొందాయి. అక్టోబర్ 10న కూడా ఢిల్లీలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా పునఃపరిశీలన ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ నిరసనలు జరిగాయి. జంతర్ మంతర్ వద్ద భారీ భద్రతా ఏర్పాట్లు, బారికేడ్ల కారణంగా అక్కడికి చేరుకోలేకపోయిన ఆందోళనకారులు ఢిల్లీలోని ఇతర ప్రాంతాల్లో నిరసనలు చేపట్టారు. నేహా బోరాతో పాటు పలువురు విద్యార్థి నాయకులు, సామాజిక కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఓటరు జాబితాల నుంచి భారీ సంఖ్యలో పేర్లు తొలగించారనే ఆరోపణలు నిరసనకారులు చేశారు. ఈ ఆరోపణలను ఎన్నికల సంఘం అంగీకరించలేదు. కాబట్టి ఆరోపణలను నిర్ధారిత వాస్తవాలుగా కాకుండా, పారదర్శకతపై సాగుతున్న రాజకీయ, ప్రజాస్వామ్య వివాదంలో భాగంగా చూడాలి. అయితే ఇక్కడ ఒక ప్రాథమిక ప్రశ్న ఉంది. ఓటరు జాబితాలో పేరు ఉండటం కేవలం అధికారిక రికార్డులో ఒక నమోదు మాత్రమే కాదు. పౌరుడు తన ఓటు హక్కును వినియోగించుకోవడానికి అది కీలకం. పేరు లేకపోతే ఓటు వేసే అవకాశం కోల్పోయే ప్రమాదం ఉంటుంది. అందుకే పేర్ల చేర్పులు, తొలగింపులు, అభ్యంతరాల పరిష్కారం, పునఃపరిశీలన వంటి ప్రక్రియలు పారదర్శకంగా సాగాలి. అర్హులైన ఓటర్లకు తమ హక్కును కాపాడుకునే అవకాశం ఉండాలి. ఇక్కడికొచ్చేసరికి నేహా రాజకీయ ప్రయాణంలో ప్రశ్నల పరిధి మరింత విస్తరించింది. మొదట విద్యార్థులు "పరీక్ష ఎలా జరుగుతుంది?" అని అడిగారు. తర్వాత "ఉద్యోగం ఎప్పుడు వస్తుంది?" అని ప్రశ్నించారు. ఇప్పుడు "నా ఓటు హక్కు సంగతేంటి?" అని అడుగుతున్నారు. విద్య, ఉపాధి, ప్రజాస్వామ్య హక్కులు వేర్వేరు అంశాలుగా కనిపించినా.. పౌరుడి జీవితంలో అవన్నీ ఒకదానితో మరొకటి ముడిపడి ఉంటాయి.

### ఒక తరం అడుగుతున్న ప్రశ్నలు

ఈ తరం పరీక్ష రాస్తుంది. ఫలితం కోసం కండ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తుంది. ఉద్యోగం కోసం ఏళ్ల తరబడి చదువుకుంటుంది. ఫీజులు కడుతుంది. స్కాలర్‌షిప్ కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతుంది. పరీక్ష రాసినంక పేపర్ లీక్ అయిందన్న వార్త వస్తే మళ్లీ మొదటి నుంచి మొదలుపెట్టాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. ఉద్యోగాల కోసం పోటీ పడుతుంటే ఖాళీల సంఖ్యపై నిరాశ ఎదురవుతుంది. ఈ కష్టాలన్నింటి మధ్య విద్యార్థులు తమను తాము ప్రశ్నించుకుంటారు. "నా తప్పేంటి?" అని అడుగుతారు. ఆ తర్వాత ఆ ప్రశ్న వ్యక్తిగత పరిధిని దాటి సామాజిక ప్రశ్నగా మారుతుంది. "మనకే ఎందుకిట్లా?" అని ఆలోచించడం మొదలవుతుంది. అక్కడే వ్యక్తిగత అసంతృప్తి సామూహిక చర్చగా మారుతుంది. సమస్య తన ఒక్కడిదే కాదని, తనతో పాటు లక్షలాది మంది విద్యార్థులు, నిరుద్యోగులు ఇలాంటి ఇబ్బందులనే ఎదుర్కొంటున్నారని యువత గుర్తిస్తుంది. తమ సమస్యలకు పరిష్కారం కోసం సంఘటితంగా గొంతెత్తాల్సిన అవసరాన్ని అర్థం చేసుకుంటుంది. నేహా బోరా ఈ చర్చలో ముందుకొచ్చిన యువ నాయకురాలిగా కనిపిస్తున్నది. ఆమె రాజకీయాలతో అందరూ ఏకీభవించాల్సిన అవసరం లేదు. ఆమెను విమర్శించే హక్కు కూడా ఎవరికైనా ఉంటుంది. అదే ప్రజాస్వామ్య స్వభావం. కానీ రాజకీయంగా విభేదిస్తున్నామనే కారణంతో ఆమె లేవనెత్తుతున్న సమస్యలను వినకుండా ఉండటం మాత్రం వేరే విషయం. ఒక విద్యార్థి నాయకురాలు ఏం మాట్లాడుతున్నదన్నదే కాదు.. ఆమె మాటలకు స్పందించే పరిస్థితులు ఎందుకు ఏర్పడుతున్నాయన్నది కూడా ముఖ్యమే. పరీక్షల నిర్వహణపై ఎందుకు అనుమానాలు వస్తున్నాయి? చదువుకున్న యువతకు ఉపాధి ఎందుకు అందడం లేదు? విశ్వవిద్యాలయాల్లో సామాజిక వివక్షపై ఎందుకు ఆందోళనలు జరుగుతున్నాయి? ఓటరు జాబితాల పారదర్శకత గురించి ఎందుకు ప్రశ్నలు తలెత్తుతున్నాయి? ఈ ప్రశ్నలను విస్మరిస్తే సమస్యలు పరిష్కారం కావు.

### థియేటర్ నుంచి ఉద్యమం దాకా

నేహా ప్రయాణంలో థియేటర్‌కు ప్రత్యేకమైన స్థానం ఉంది. థియేటర్ ఆమెకు మనుషుల జీవితాలను దగ్గరగా చూడటం నేర్పింది. పుస్తకాలు సమాజాన్ని చదవడం నేర్పాయి. విశ్వవిద్యాలయం ప్రశ్నించడం నేర్పింది. విద్యార్థి ఉద్యమం ఆ ప్రశ్నలను సామూహిక గొంతుగా మార్చింది. అందుకే ఆమె కథలో స్టేజీ నుంచి జంతర్ మంతర్ దాకా ఉన్న దూరం కేవలం కిలోమీటర్ల దూరం కాదు. అది వ్యక్తిగత అనుభవం నుంచి సామూహిక ప్రశ్న దాకా సాగిన ప్రయాణం. థియేటర్ వేదిక మీద ఒక పాత్రకు గొంతునిస్తుంది. ఉద్యమం సమాజంలో వినిపించని గొంతులను ముందుకు తీసుకొస్తుంది. నాటకంలో ఒక పాత్ర అన్యాయాన్ని ప్రశ్నిస్తే.. ఉద్యమంలో ఆ ప్రశ్న వందల గొంతులుగా మారుతుంది. నేహా చేతిలో ఒకప్పుడు నాటక స్క్రిప్టు ఉండేది. ఇప్పుడు ఆమె చేతిలో ప్లకార్డు ఉంది. అప్పుడు స్టేజీ మీద పాత్రకు జీవం పోసింది. ఇప్పుడు సమాజంలో తనకు కనిపిస్తున్న సమస్యలపై ప్రశ్నలు వేస్తున్నది. ఈ ప్రయాణం ఎటు దారి తీస్తుంది? భవిష్యత్తులో ఎలాంటి రాజకీయ రూపం తీసుకుంటుంది? ఆమె ఉద్యమం ఎలాంటి మార్పులకు దోహదపడుతుంది? ఈ ప్రశ్నలకు ఇప్పుడే జవాబులు చెప్పలేం. కాలమే వాటికి సమాధానాలు చెబుతుంది. కానీ ఒక విషయం స్పష్టంగా కనిపిస్తున్నది. పరీక్షల గురించి అడుగుతున్న యువత ఉద్యోగాల గురించి ప్రశ్నిస్తున్నది. ఉద్యోగాల నుంచి విద్యా విధానం గురించి ఆలోచిస్తున్నది. విద్య నుంచి ప్రభుత్వ బాధ్యత గురించి నిలదీస్తున్నది. అక్కడి నుంచి తమ ప్రజాస్వామ్య హక్కుల గురించి గొంతెత్తుతున్నది. నేహా బోరా ప్రయాణాన్ని అర్థం చేసుకోవాలంటే ఆమెతో ఏకీభవించాల్సిన అవసరం లేదు. ఆమె అడుగుతున్న ప్రశ్నలను వినాలి. ఆమె రాజకీయాలతో విభేదించేవాళ్లు తమ అభిప్రాయాలను చెప్పవచ్చు. ఆమెతో కలిసి నడిచేవాళ్లు తమ కారణాలను వివరించవచ్చు. కానీ యువత ఎందుకు ఇంతగా ప్రశ్నిస్తున్నదో మాత్రం పట్టించుకోవాలి. ఎందుకంటే ఈ ప్రశ్నలు ఒక్క నేహావి కావు. చదువుకుంటున్న, ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న, ఫీజుల కోసం తిప్పలు పడుతున్న, పోటీ పరీక్షల కోసం ఏళ్ల తరబడి కష్టపడుతున్న, తమ ఓటు హక్కు గురించి ఆలోచిస్తున్న ఒక పెద్ద తరం ప్రశ్నలు ఇవి.

థియేటర్ ఆమెకు మనిషిని చూడటం నేర్పింది. సాహిత్యం సమాజాన్ని చదవడం నేర్పింది. చదువు ప్రశ్నించడం నేర్పింది. ఉద్యమం ఆ ప్రశ్నను కలిసికట్టుగా వినిపించడం నేర్పింది. నాటక వేదిక మీద మొదలైన ప్రశ్న.. వీధుల్లోకి వచ్చింది. వీధుల్లో మొదలైన గొంతు.. ప్రజాస్వామ్య హక్కుల దాకా విస్తరించింది. ఆ గొంతు రేపు ఎటు దారి తీస్తుందో కాలమే చెబుతుంది. కానీ ఒకటి మాత్రం నిజం.. ప్రశ్నించడం మాత్రం ఆగలేదు!

**మామిండ్ల రమేష్ రాజా**
7893230218

# సమాచార హక్కు చట్టం – సామాన్యుడి చేతిలో వజ్రాయుధం!

ప్రజాస్వామ్యంలో పౌరుడే నిజమైన పాలకుడని రాజ్యాంగ స్ఫూర్తి చెబుతోంది. ప్రజల కోసం, ప్రజల చేత, ప్రజల ద్వారా ఏర్పడే ప్రభుత్వాలు ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలి. కానీ ఆచరణలో దశాబ్దాలపాటు ప్రభుత్వ కార్యాలయాల్లోని దస్త్రాలు, ప్రజాధనం ఖర్చు చేసే విధానాలు, సంక్షేమ పథకాల అమలు తీరు అనేక సందర్భాల్లో గోప్యత అనే చీకటి తెర వెనుక ఉండిపోయాయి. ప్రభుత్వ కార్యాలయంలో చిన్న పని కావాలన్నా అధికారుల చుట్టూ తిరగడం, రోజుల తరబడి వేచి చూడడం, కొన్నిసార్లు అవినీతి, లంచగొండితనాన్ని ఎదుర్కోవడం సామాన్య ప్రజలకు నిత్య అనుభవాలుగా మారాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలకే తెలియాల్సిన ప్రభుత్వ సమాచారాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో రూపుదిద్దుకున్న చారిత్రక చట్టమే సమాచార హక్కు చట్టం-2005. భారతదేశంలో ఈ చట్టం 2005 జూన్ 15న రాష్ట్రపతి ఆమోదం పొందగా, 2005 అక్టోబర్ 12 నుంచి దేశవ్యాప్తంగా పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చింది. ఈ చట్టం పాలనలో పారదర్శకతను పెంపొందించడంతోపాటు ప్రభుత్వ అధికారులను జవాబుదారీగా నిలబెట్టే శక్తివంతమైన ప్రజాస్వామ్య సాధనంగా నిలిచింది.

### పది రూపాయల దరఖాస్తుతో ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు!

ఒకప్పుడు ప్రభుత్వ కార్యాలయాల్లోని ఫైళ్లను చూడడం, నిధుల వినియోగం గురించి తెలుసుకోవడం, ఒక పథకానికి సంబంధించిన లబ్ధిదారుల ఎంపిక వివరాలను పొందడం సామాన్యులకు అంత సులభమైన విషయం కాదు. కానీ సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత పరిస్థితుల్లో గణనీయమైన మార్పు వచ్చింది. ఈ చట్టంలోని నిబంధనల ప్రకారం పౌరులు ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థలు, చట్ట పరిధిలోకి వచ్చే ప్రభుత్వాధీన సంస్థల వద్ద ఉన్న సమాచారాన్ని కోరవచ్చు. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన అనేక దరఖాస్తుల్లో సాధారణంగా రూ.10 ఫీజు వర్తిస్తుంది. అయితే రాష్ట్ర ప్రభుత్వాల ఫీజులు, చెల్లింపు విధానాలు ఆయా రాష్ట్రాల నిబంధనల ప్రకారం మారవచ్చు. తెలంగాణలో దరఖాస్తు చేసుకునే వారు సంబంధిత రాష్ట్ర నియమాలను పరిశీలించాలి. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారికి చట్ట నిబంధనల ప్రకారం దరఖాస్తు ఫీజు మినహాయింపు ఉంటుంది. నిర్దేశిత గడువులో సమాచారం అందించకపోవడం, సరైన కారణం లేకుండా నిరాకరించడం వంటి సందర్భాల్లో చట్టం అప్పీళ్లకు, బాధ్యులైన అధికారులపై జరిమానా విధించడానికి అవకాశం కల్పిస్తోంది.

### 30 రోజుల్లో సమాచారం.. అత్యవసర సందర్భాల్లో 48 గంటలు!

సమాచార హక్కు చట్టం ప్రకారం సాధారణంగా దరఖాస్తు అందిన తేదీ నుంచి 30 రోజుల్లోగా సమాచారం అందించాలి. ఒక వ్యక్తి జీవితం లేదా వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన సమాచారం కోరినప్పుడు 48 గంటల్లోగా అందించాల్సి ఉంటుంది. దరఖాస్తును తప్పనిసరిగా మరో ప్రజా సమాచార అధికారికి బదిలీ చేయాల్సిన సందర్భాల్లో చట్టం నిర్దేశించిన ప్రత్యేక గడువులు వర్తిస్తాయి. సమాచారం అందించడంలో ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం వహించడం, తప్పుడు లేదా అసంపూర్ణ సమాచారం ఇవ్వడం, చట్టబద్ధమైన కారణం లేకుండా దరఖాస్తును తిరస్కరించడం వంటి పరిస్థితుల్లో సంబంధిత సమాచార కమిషన్ విచారణ అనంతరం బాధ్యుడైన ప్రజా సమాచార అధికారిపై రోజుకు రూ.250 చొప్పున, గరిష్ఠంగా రూ.25,000 వరకు జరిమానా విధించవచ్చు. అవసరమైన సందర్భాల్లో శాఖాపరమైన చర్యలకు సిఫారసు చేసే అవకాశమూ ఉంది. ఈ నిబంధనలు అధికారులకు ప్రజల పట్ల ఉన్న బాధ్యతను గుర్తుచేస్తూ, పాలనా వ్యవస్థలో జవాబుదారీతనాన్ని పెంచుతున్నాయి.

### గ్రామస్థాయి నుంచి ప్రభుత్వ శాఖల వరకు అవినీతిపై ప్రశ్నలు!

గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులకు సంబంధించిన హాజరు పట్టికలు, చెల్లింపుల వివరాలు, రేషన్ దుకాణాలకు కేటాయించిన సరుకులు, గ్రామపంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, రహదారుల నిర్మాణానికి కేటాయించిన నిధులు, ప్రభుత్వ పాఠశాలలకు అందిన నిధులు, సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితాలు వంటి అనేక అంశాలపై సమాచార హక్కు ద్వారా వివరాలు తెలుసుకునే అవకాశం ఏర్పడింది. ఎక్కడ పని జరిగింది? ఎంత నిధి మంజూరైంది? ఎంత ఖర్చు చేశారు? ఎవరు కాంట్రాక్టు పొందారు? పనుల నాణ్యతను ఎలా పరిశీలించారు? అర్హులైన లబ్ధిదారులను ఏ ప్రాతిపదికన ఎంపిక చేశారు? వంటి ప్రశ్నలకు సంబంధిత రికార్డుల ఆధారంగా సమాధానాలు కోరవచ్చు. ప్రభుత్వ నిధులు ప్రజల పన్నుల రూపంలో సమకూరుతున్నందున వాటి వినియోగంపై ప్రజలకు ఆసక్తి, పర్యవేక్షణ హక్కు ఉండటం ప్రజాస్వామ్యానికి అత్యంత కీలకం. సమాచార హక్కు ద్వారా రికార్డులు వెలుగులోకి వస్తే అక్రమాలను గుర్తించడం, అవకతవకలపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయడం, అవసరమైతే న్యాయపరమైన చర్యలు తీసుకోవడం సులభమవుతుంది. అయితే సమాచారాన్ని పొందడం ఒక దశ మాత్రమే. అక్రమాలు బయటపడిన తర్వాత వాటిపై సంబంధిత శాఖలు విచారణ జరిపి చర్యలు తీసుకోవడం కూడా అంతే ముఖ్యం.

### పేదవాడి చేతిలో న్యాయానికి మార్గం!

ఒక గ్రామంలో కూలిపని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించే రామయ్యకు ప్రభుత్వం మంజూరు చేసిన గృహ పథకంలో ఇల్లు లభించలేదని అనుకుందాం. తనకంటే ఆర్థికంగా మెరుగైన స్థితిలో ఉన్న కొందరి పేర్లు లబ్ధిదారుల జాబితాలో ఉన్నాయని, తన పేరును ఎందుకు తొలగించారో అధికారులు చెప్పడం లేదని అతను ఆవేదన చెందాడు. ఎన్నిసార్లు కార్యాలయానికి వెళ్లినా స్పష్టమైన సమాధానం లభించలేదు. చివరకు ఒక యువకుడు అతనికి సమాచార హక్కు చట్టం గురించి వివరించాడు.

రామయ్య సంబంధిత ప్రజా సమాచార అధికారికి దరఖాస్తు సమర్పించి, తన గ్రామానికి మంజూరైన ఇళ్ల సంఖ్య, లబ్ధిదారుల ఎంపికకు అనుసరించిన ప్రమాణాలు, ఆమోదించిన జాబితా, తన దరఖాస్తు స్థితి, తనకు ఇల్లు మంజూరు చేయకపోవడానికి సంబంధించిన రికార్డుల్లో ఉన్న కారణాలు వంటి వివరాలను కోరాడు. చట్టబద్ధమైన గడువులో సమాచారం అందకపోతే మొదటి అప్పీలు చేసుకునే అవకాశం కూడా అతనికి ఉంది. ఈ విధంగా రామయ్యకు తన సమస్యకు సంబంధించిన అధికారిక వివరాలు తెలుసుకునే




మార్గం ఏర్పడింది.

ఈ ఉదాహరణ సమాచార హక్కు చట్టం అందించే ప్రజాస్వామ్య శక్తిని వివరిస్తుంది. అయితే సమాచార దరఖాస్తు సమర్పించినంత మాత్రాన ఇల్లు స్వయంచాలకంగా మంజూరు అవుతుందని భావించకూడదు. సమాచారం ఆధారంగా అర్హతను నిరూపించుకోవడం, ఎంపికలో అక్రమాలు జరిగితే ఫిర్యాదు చేయడం, సంబంధిత అధికారుల నుంచి న్యాయం కోరడం ద్వారా సమస్య పరిష్కారానికి మార్గం సుగమమవుతుంది. పేదవాడికి తన హక్కులను తెలుసుకునే అవకాశం కల్పించడమే ఈ చట్టం అందించే అసలైన బలం.

### చట్టం ముందు సవాళ్లు.. ప్రజల ముందు బాధ్యతలు!

సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చి రెండు దశాబ్దాలు దాటినప్పటికీ దాని అమలులో అనేక సవాళ్లు కొనసాగుతున్నాయి. కొన్ని కార్యాలయాల్లో దరఖాస్తులకు సమయానికి సమాధానాలు అందకపోవడం, అసంపూర్ణ సమాచారం ఇవ్వడం, దరఖాస్తుదారులను అనవసరంగా తిప్పించడం, అప్పీళ్ల పరిష్కారంలో జాప్యం జరగడం వంటి సమస్యలు కనిపిస్తున్నాయి.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

మిగితా తరువాయి సంచికలో..

# రూ.20 లక్షల కోసం చిన్నారి హత్య

- కౌకూర్ విల్లా ఆర్కిడ్స్‌లో ఘటన
- మాజీ సెక్యూరిటీ గార్డు అరెస్టు
- 24 గంటల్లో కేసును ఛేదించిన పోలీసులు

**అల్వాల్, అక్టోబరు 12 (జనంసాక్షి) :** సాయంత్రం సరదాగా సైకిల్ తొక్కేందుకు వెళ్లిన ఐదేళ్ల చిన్నారి.. తిరిగి ఇంటికి వస్తుందని ఎదురుచూసిన తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగిల్చింది. కిడ్నాప్ చేసి రూ.20 లక్షలు వసూలు చేయాలనే ఉద్దేశంతో చిన్నారిని హత్య చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ సెక్యూరిటీ గార్డును పోలీసులు అరెస్టు చేశారు. కౌకూర్‌లోని విల్లా ఆర్కిడ్స్ గేటెడ్ కమ్యూనిటీలో జరిగిన ఈ ఘటనలో చిన్నారి మృతదేహాన్ని క్లబ్‌హౌస్ సెల్లార్‌లోని నీటి సంపులో గుర్తించారు. అదృశ్యంపై ఫిర్యాదు అందిన 24 గంటల్లోనే కేసును ఛేదించినట్లు మల్కాజిగిరి పోలీసులు వెల్లడించారు.






### అదృశ్యంపై ఫిర్యాదు

పోలీసుల పత్రికా ప్రకటన ప్రకారం.. విల్లా ఆర్కిడ్స్‌లో నివసించే మిల్టన్ ఫెర్నాండెస్ మోసెస్ (44) తన ఐదేళ్ల కుమార్తె ఆరేలియా అలియాస్ మోను కనిపించడం లేదని అక్టోబరు 10న బొల్లారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పీపీ-2 చదువుతున్న చిన్నారి ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల సమయంలో క్లబ్‌హౌస్ గేమ్స్ జోన్‌లో సైకిల్ తొక్కేందుకు వెళ్లి రాత్రి 7 గంటలకల్లా ఇంటికి తిరిగి వచ్చేది. ఘటన జరిగిన రోజు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి చిన్నారి తన వద్ద ఉందని, విడిచిపెట్టాలంటే రూ.20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో బొల్లారం పోలీసులు క్రైమ్ నంబర్ 243/2026గా భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 140(2) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చిన్నారి ఆచూకీ కోసం మల్కాజిగిరి జోన్, స్పెషల్ ఆపరేషన్స్ టీమ్ (ఎస్‌వోటీ), క్రైమ్స్, స్పెషల్ బ్రాంచ్ సిబ్బందితో పది ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. అనుమానిత మొబైల్ నంబర్, కాల్ వివరాలు, సీసీటీవీ దృశ్యాల ఆధారంగా గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో క్లబ్‌హౌస్ సెల్లార్‌లోని నీటి సంపులో చిన్నారి మృతదేహాన్ని గుర్తించారు.

### మాజీ సెక్యూరిటీ గార్డు అరెస్టు

విల్లా ఆర్కిడ్స్‌లో సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 6 వరకు సెక్యూరిటీ గార్డుగా పనిచేసిన బీహార్‌లోని నలందా జిల్లాకు చెందిన విక్రమ్ కుమార్‌పై పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. అతడి ఉద్యోగ, నివాస వివరాలు, గత నేపథ్యంపై విచారణ చేపట్టారు. అక్టోబరు 11న సాయంత్రం 4.30 గంటలకు అతడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. చిన్నారిని కిడ్నాప్ చేసి రూ.20 లక్షలు డిమాండ్ చేయాలని ముందుగానే పథకం వేసుకున్నట్లు, అనంతరం ఆమెను హత్య చేసి మృతదేహాన్ని నీటి సంపులో దాచినట్లు విచారణలో వెల్లడైందని పోలీసులు పేర్కొన్నారు. దర్యాప్తును త్వరగా పూర్తి చేసి ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారణ జరిగేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

### నివాస సముదాయాల్లో భద్రతపై అప్రమత్తత

గేటెడ్ కమ్యూనిటీల్లో ప్రవేశ నియంత్రణ, సెక్యూరిటీ సిబ్బంది ఉన్నంత మాత్రాన సంపూర్ణ భద్రతకు హామీ ఉండదని పోలీసులు సూచించారు. గృహ సహాయకులు, డ్రైవర్లు, సెక్యూరిటీ గార్డులు, వాచ్‌మెన్‌లను నియమించుకునే ముందు వారి గుర్తింపు, నివాస చిరునామా, ఉద్యోగ వివరాలను పరిశీలించాలని, వర్తించే నిబంధనల ప్రకారం పోలీసు ధ్రువీకరణ చేయించుకోవాలని కోరారు.

## వెట్టిచాకిరీ నిర్మూలనపై విస్తృత అవగాహన కల్పించాలి

- 'స్వేచ్ఛా రథం' ప్రచార వాహనాన్ని ప్రారంభించిన కలెక్టర్



**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 12 (జనం సాక్షి) :** వెట్టిచాకిరీ నిర్మూలన, కార్మికుల హక్కుల పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 'స్వేచ్ఛా రథం' ప్రచార వాహనాన్ని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వెట్టిచాకిరీకి గురవుతున్నచేయండి కార్మికులను గుర్తించి, వారికి విముక్తి కల్పించడంతో పాటు తగిన పునరావాసం అందించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయం, ఇటుక బట్టీలు, ఆక్వాకల్చర్, గనులు, క్వారీల వంటి అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల పరిస్థితులను పరిశీలిస్తూ, వెట్టిచాకిరీ బాధితులను గుర్తించడంలో సంబంధిత శాఖల అధికారులు చురుగ్గా వ్యవహరించాలని పేర్కొన్నారు. 'స్వేచ్ఛా రథం' జిల్లావ్యాప్తంగా పర్యటిస్తూ వెట్టిచాకిరీ నిర్మూలన, కార్మికుల హక్కులు, కార్మికులపై జరిగే దోపిడీని అరికట్టే మార్గాలపై ప్రజలకు అవగాహన కల్పించనుంది. సమాచార, విద్య, ప్రచార సామగ్రి ద్వారా కార్మికులకు చట్టపరమైన హక్కులు, ప్రభుత్వ రక్షణ వ్యవస్థలపై చైతన్యం కల్పించనున్నారు. వెట్టిచాకిరీ లేదా కార్మికుల దోపిడీకి సంబంధించిన సమాచారం అందించేందుకు, సహాయం పొందేందుకు టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 080-69434343 ను సంప్రదించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో ఈ ప్రచార కార్యక్రమం కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సాయి శివానీ,కార్మిక శాఖ ఇంచార్జి అసిస్టెంట్ కమిషనర్ మహమ్మద్ అల్తాఫ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి జరీనా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రూ.2 కోట్లతో బీరప్పగడ్డ గౌడ శ్మశానవాటిక అభివృద్ధి

**ఉప్పల్, అక్టోబర్ 12 (జనం సాక్షి) :** ఉప్పల్‌లోని బీరప్పగడ్డ గౌడ శ్మశాన వాటిక అభివృద్ధికి రూ.2 కోట్ల నిధులు మంజూరైనట్లు ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. శ్మశాన వాటికను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన నిధులు కేటాయించాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిని కలిసి కోరినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా నిధుల కేటాయింపుపై కమిషనర్ సానుకూలంగా స్పందించడంతో ఉప్పల్ గౌడ సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఉప్పల్‌కు చెందిన గౌడ కులస్తులు, సంఘం ప్రతినిధులతో కలిసి మందుముల పరమేశ్వర్ రెడ్డి ఎంఎంసీ కార్యాలయంలో కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిని కలిశారు. బీరప్పగడ్డలోని గౌడ శ్మశాన వాటికలో అవసరమైన అభివృద్ధి పనులను వివరించి, వాటిని పూర్తి స్థాయిలో చేపట్టేందుకు నిధులు కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన కమిషనర్ రూ.2 కోట్ల నిధుల మంజూరుకు చర్యలు తీసుకున్నట్లు నాయకులు తెలిపారు. సకాలంలో టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి, అభివృద్ధి పనులు ప్రారంభించేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.



### గతంలో మంజూరైన రూ.48 లక్షలు సరిపోవని విజ్ఞప్తి

బీరప్పగడ్డ గౌడ శ్మశాన వాటిక అభివృద్ధికి గతంలో రూ.48 లక్షల నిధులు మంజూరైనప్పటికీ, పూర్తి స్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఆ నిధులు సరిపోవని మందుముల పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. శ్మశాన వాటికను అవసరమైన మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేయాలంటే మరిన్ని నిధులు అవసరమని భావించి, ఈ విషయాన్ని ఎంఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు. ఈ నేపథ్యంలోనే రూ.2 కోట్ల నిధుల కేటాయింపునకు కృషి చేసినట్లు తెలిపారు.

### గౌడ సంఘం ప్రతినిధుల కృతజ్ఞతలు

బీరప్పగడ్డ గౌడ శ్మశాన వాటిక అభివృద్ధికి రూ.2 కోట్ల నిధుల కేటాయింపునకు చొరవ తీసుకున్న మందుముల పరమేశ్వర్ రెడ్డికి, సానుకూలంగా స్పందించిన ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డికి ఉప్పల్ గౌడ సంఘం ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. నిధుల కేటాయింపుతో శ్మశాన వాటిక అభివృద్ధికి మార్గం సుగమమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బజారు జగన్నాథ్ గౌడ్, వర్కాల మదన్ గౌడ్, బజారు నవీన్ గౌడ్, బింగి జగదీష్ గౌడ్, బుత్కూరి మదన్ గౌడ్, బింగి బుచ్చి గౌడ్, వంశీ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల భద్రత సంక్షేమం పోలీసు లక్ష్యం

- వికారాబాద్ ఎస్పీ స్నేహ మేహ్రా

**వికారాబాద్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 12 (జనం సాక్షి) :** వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఈ రోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, పాల్గొని, వివిధ సమస్యల పరిష్కారం కోసం జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన ప్రజలతో నేరుగా మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలను, ఫిర్యాదులను ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను విని, వారి సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తమ ఇబ్బందులను ఎలాంటి సంకోచం లేకుండా తెలియజేసేందుకు అవకాశం కల్పిస్తూ, ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు పోలీస్ శాఖ ద్వారా సత్వర సేవలు అందించడం, వారి సమస్యలను నేరుగా తెలుసుకోవడం, ఫిర్యాదుల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవడం ప్రజావాణి కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఈ సందర్భంగా తెలియజేశారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ కార్యాలయానికి వచ్చినప్పుడు వారి ఫిర్యాదులను బాధ్యతాయుతంగా స్వీకరించి, చట్టపరిధిలో తగిన పరిష్కారం అందించేందుకు పోలీస్ శాఖ కృషి చేస్తుందని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారం కోసం పోలీస్ శాఖను సంప్రదించవచ్చని, ప్రజల భద్రత, సంక్షేమం కోసం వికారాబాద్ జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, తెలియజేశారు.

### దుర్గామాత ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి



వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఆదేశాల మేరకు జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో దుర్గామాత విగ్రహాల నిర్వాహకులతో పోలీస్ అధికారులు సమావేశాలు నిర్వహించి, ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మండపాల వద్ద భద్రతా చర్యలు తప్పనిసరిగా పాటించాలని, పగలు, రాత్రి వేళల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిమజ్జన ఊరేగింపుల్లో డీజే సౌండ్ సిస్టమ్‌ల వినియోగం నిషేధమని స్పష్టం చేశారు. ఖచ్చితంగా ఆన్‌లైన్ నమోదు పూర్తి చేయాలనీ, పోలీసుల సూచనలు, భద్రతా మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని తెలిపారు. దుర్గామాత ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, తెలిపారు. ప్రజలందరూ పోలీస్ శాఖకు సహకరించి, శాంతిభద్రతల పరిరక్షణలో భాగస్వాములై ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సంతోషకరమైన వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు.

## ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో పేదలకు అన్యాయం

- అర్హులైన నిరుపేదలకు న్యాయం చేయాలి
- ఎంపీడీవో కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ సర్పంచుల ధర్నా

**ఉప్పునుంతల, అక్టోబర్ 12 (జనంసాక్షి) :** ఉప్పునుంతల మండలంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అర్హులైన నిరుపేదలకు అన్యాయం జరుగుతోందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొత్త రవీందర్ రావు, జిల్లా సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి రామ్ భీష్మ ఆరోపించారు. అర్హులైన పేదలను పక్కనపెట్టి, భూములు, ఇళ్లు ఉన్నవారికి ఇళ్లు కేటాయిస్తున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో సోమవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ సర్పంచులు ధర్నా నిర్వహించి, ఎంపీడీవో వరుణ్ తేజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో గ్రామ సర్పంచులకు కనీస సమాచారం ఇవ్వకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు సిఫారసు చేసిన వారికే ఇళ్లు కేటాయిస్తున్నారనే విమర్శలు ఉన్నాయని పేర్కొన్నారు. నిజమైన నిరుపేదలకు న్యాయం జరగాలంటే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. సర్పంచుల ఎన్నికలకు ముందే ఇందిరమ్మ ఇళ్ల



కమిటీలను ఏర్పాటు చేయడంతో వాటిలో సర్పంచులకు తగిన ప్రాతినిధ్యం లేకుండా పోయిందని వారు పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న కమిటీలను పునఃపరిశీలించి, గ్రామపంచాయతీల భాగస్వామ్యంతో అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలని కోరారు. గ్రామస్థాయిలో అర్హతలను పరిశీలించి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎంపిక చేపట్టినప్పుడే నిజమైన పేదలకు న్యాయం జరుగుతుందని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ప్రభుత్వ మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని, అర్హతల ఆధారంగానే లబ్ధిదారులను ఎంపిక చేయాలని అధికారులను కోరారు. ఎంపిక ప్రక్రియలో అక్రమాలు జరిగినట్లు తేలితే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని, అర్హులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దాపూర్ సర్పంచ్ సాయిబాబు, లక్ష్మాపూర్ సర్పంచ్ గోపాల్, వెల్టూరు సర్పంచ్ వెంకటేష్, లత్తిపూర్ సర్పంచ్ మోత్యా నాయక్, ప్యూర్ తండా సర్పంచ్ మోత్యా, సుమన్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, బాలస్వామి, రమేష్, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ ఫ్రీ జంక్షన్‌గా కుత్బుల్లాపూర్ చౌరస్తా తీర్చిదిద్దండి

- ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 12 (జనం సాక్షి) :** కుత్బుల్లాపూర్ చౌరస్తాను ప్రజలు అనేక ట్రాఫిక్ సమస్యలతో సతమతమవుతున్నారని కుత్బుల్లాపూర్ పరిధిలోని అన్ని ప్రధాన రహదారులు కూడలిలో ప్రజల ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా అధికారులు త్వరితగతిన పనులు చేపట్టి కుత్బుల్లాపూర్ చౌరస్తాను. ట్రాఫిక్ రహిత చౌరస్తాగా తీర్చిదిద్దాలని నియోజకవర్గ ఎమ్మెల్యే కేపీ వివేకానంద తెలిపారు. సోమవారం కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో పింకేష్ కుమార్, తో పాటు పలు శాఖల అధికారులతో ఎమ్మెల్యే ఏపీ వివేకానంద ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, రోడ్ల విస్తరణ, సీఎంసీలో విలీనమైన



శివారు మున్సిపాలిటీల్లో పారిశుద్ధ నిర్వహణ, అస్తవ్యస్థంగా ఉన్న భూగర్భ డ్రైనేజీ నిర్వహణ వంటి అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఉప కమీషనర్ శంకర్ సింగ్, వివిధ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'మీ సురక్ష - గృహ సహాయకుల ధ్రువీకరణ కార్యక్రమం', 'నేను సైతం 2.0--సీసీటీవీ నిఘా కార్యక్రమం'లో రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్లు, అపార్ట్‌మెంట్ సంఘాలు, నివాసితులు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఘటన జరిగిన కాలనీలోనూ అవగాహన సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. కేసు ఛేదనలో కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందికి రివార్డులు అందజేయనున్నట్లు మల్కాజిగిరి పోలీసు కమిషనరేట్ వెల్లడించింది.

# ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతన బకాయిలు చెల్లించాలి

**ముషీరాబాద్, అక్టోబర్ 12 (జనం సాక్షి) :** ఔట్సోర్సింగ్ విధానంలో ఉద్యోగులకు జీవితాలు తక్కువగా ఉండడం, ఉద్యోగ భద్రత లేకపోవడం నెల నెల జీతాలు సరిగా చెల్లించలేకపోవడం వలన ఆ ఉద్యోగుల కు వారి కుటుంబ పోషణ భారం పెరిగిందని పిల్లల ఫీజులు ఇంటి అద్దె చెల్లించలేక ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారనీ రాజ్యసభ సభ్యులు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య ఉద్ఘట్టించారు. ప్రభుత్వం వెంటనే రాష్ట్రంలోని 26 మైనార్టీ గురుకులాల్లో పని చేసే 30000 మంది ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, వారి ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలనీ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్ ఇంద్ర పార్క్ వద్ద గల ధర్నాచౌక్లో మైనార్టీ గురుకుల నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎండి హుస్సేన్ షరీఫ్, అబ్దుల్లాల అధ్యక్షతన మైనార్టీ గురుకులలో పనిచేసే ఔట్సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ మహా ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య హాజరై మద్దతు తెలిపి మాట్లాడారు ప్రభుత్వ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించకుండా అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. నాన్ టీచింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఈఎస్ఐ, ఈపీఎఫ్ సౌకర్యాలు పునరుద్ధరించాలని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్



ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరారు. వరుసగా 240 రోజులు పని చేస్తున్న తాత్కాలిక ఉద్యోగులను పర్మిట్ చేయాలని సుప్రీంకోర్టు తీర్పు వచ్చిందని, ఈ తీర్పు ప్రకారం రాష్ట్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో పనిచేసే ఔట్సోర్సింగ్ ఉద్యోగాలను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. గచ్చిబౌలి, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, కొండాపూర్, మాదాపూర్ తదితర ప్రాంతాల్లో అపార్ట్మెంట్లో కుటుంబాలు వారు ఇంటి పనులకు పెట్టుకునే వ్యక్తి కుటుంబ నిర్వహణ పనులు తదితర పనులకు వెళ్లే వారికి నెలకు 25000 నుంచి 30 వేల వరకు జీతం ఇస్తున్నారని పైగా పని తక్కువ జీతాలు ఎక్కువ వస్తున్నాయని కానీ ప్రభుత్వ గురుకుల పాఠశాలలో, హాస్టల్, ప్రభుత్వ ఆఫీసుల్లో పని చేసే వారికి పని భారం ఎక్కువ జీతం తక్కువ అని విమర్శించారు. అత్త ఎక్కువ 15 వేల జీతం పైగా నెల నెల జీతం రాదని ఐదారు నెలకు ఒకసారి జీతం చెల్లిస్తారని అందుకే చాలా మంది ప్రభుత్వం ఉద్యోగాలు వదిలి ప్రైవేట్ ఉద్యోగాలకు వెళ్లిపోతున్నారని అన్నారు. కాబట్టి జీతాలు 30 వేలకు పెంచాలని కోరారు. పక్క రాష్ట్రాలైన తమిళనాడు, కేరళ, ఒరిస్సా, రాజస్థాన్, పంజాబ్, కర్ణాటకలో లక్షలాది తాత్కాలిక ఉద్యోగాలను పర్మనెంట్ చేశారని, మన రాష్ట్రంలో కూడా ఇదే పద్ధతిలో పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్రంలోని 72 ప్రభుత్వ శాఖలలో, 65 ప్రభుత్వ రంగ సంస్థలలో పనిచేసే నాలుగు లక్షల 90 వేల మంది ఔట్సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరారు. అవుట్సోర్సింగ్ కాంటాక్ట్ విధానం వల్ల ఎగ్జిక్యూటివ్ వ్యవస్థ బలహీనపడుతుందన్నారు. ఈ విధానం వల్ల జవాబు దారితనం, బాధ్యత, అంకితభావం ఉద్యోగులలో ఉండదని అందుకే కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరారు. పర్మనెంట్ చేసే వరకు ఉద్యమం కొనసాగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ గురుకుల నాన్ టీచింగ్ ఉద్యోగులు, మొరాజ్, మంగ, జయమ్మ, అనంతయ్య, అల్లం యాదయ్య, సి. రాజేందర్, నీలం వెంకటేష్, దొడ్డిపల్లి రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

## జపాన్‌లో ఉద్యోగాలకు తెలంగాణ యువతకు శిక్షణ

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ జి.వివేక్ వెంకటస్వామి




**హైదరాబాద్ సిటీ, అక్టోబర్ 12 (జనం సాక్షి) :** జపాన్‌లోని అంతర్జాతీయ ఉద్యోగావకాశాలను తెలంగాణ యువత అందిపుచ్చుకునేలా నైపుణ్య శిక్షణ అందిస్తామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ జి.వివేక్ వెంకటస్వామి తెలిపారు. వచ్చే ఐదేళ్లలో 45 లక్షల మందికి శిక్షణ అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. హైదరాబాద్ హైటెక్ సిటీలోని సైబర్ గార్డెన్స్‌లో నారా జపాన్ హబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన హైదరాబాద్ జపాన్ ఫెస్టివల్ 2026కు 10 వేలకు పైగా ప్రజలు హాజరయ్యారు. ప్రస్తుతం తెలంగాణలో 169 జపాన్ కంపెనీలు పని చేస్తున్నాయని, మరిన్ని సంస్థలు పెట్టుబడులు పెట్టాలని మంత్రి కోరారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ(టామ్ కామ్) ద్వారా 16 దేశాల్లో 14,500కు పైగా ఉద్యోగావకాశాలు కల్పించినట్లు తెలిపారు. తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ ఐటీ, ఫార్మా, బయోటెక్నాలజీ, అధునాతన తయారీ రంగాల్లో జపాన్‌తో సహకారానికి విస్తృత అవకాశాలున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో హిరోషిమా ప్రిఫెక్చర్ అసెంబ్లీ చైర్మన్ తకాషి నకమోటో, జపాన్ కాన్సుల్ జనరల్ మునియో తకహాషి, హిరోషిమా వైస్ గవర్నర్ తోరు యోషిమత్సు, మియోషి నగర డిప్యూటీ మేయర్ తెరువో యమజాకి, జె.క్లెయిర్ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కజుకి తకానో, హైదరాబాద్ జపనీస్ అసోసియేషన్ అధ్యక్షుడు హెచ్.ఫురుటా, కిటోలిట్ రోబోటిక్స్ వ్యవస్థాపకుడు కశ్యప్ వరుణ్, నారా జపాన్ హబ్ వ్యవస్థాపకుడు డాక్టర్ బి.రామ భద్ర, సహ వ్యవస్థాపకుడు బి.నాగనాథ్ పాల్గొన్నారు. మియోషి పప్పెట్ షో, ఇకెబానా పుష్పాలంకరణ, జపనీస్ భాషా ప్రసంగ పోటీ, ఇండో - జపాన్ ఇన్నోవేషన్ హ్యాకథాన్ అవార్డులు, అనిమే, కాస్ ప్లే ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
13 అక్టోబర్ 2026

# కరెంట్ సరఫరాలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- ఎకరాకు రూ.30వేల పరిహారం ఇవ్వాలి
- ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి
- రైతులతో సబ్ స్టేషన్ ముందు భారీ ధర్నా, రాస్తారోకో



**శివ్వంపేట, అక్టోబర్ 12 (జనంసాక్షి) :** ఎల్‌నీనో వల్ల ఏర్పడ్డ కరువు కాదని, కాంగ్రెస్ తీసుకువచ్చిన కరువు అని మాజీ మంత్రి ఎమ్మెల్యే సునిత లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. సోమవారం శివ్వంపేట మండలం చండి గ్రామ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద విద్యుత్ కోతలను నిరసిస్తూ రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు రమణగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి హాజరై రైతులు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి తూప్రాన్ నర్సాపూర్ ప్రధాన రోడ్డు పై రాస్తారోకో నిర్వహించారు. అంతకుముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంటలకు నిరంతర కరెంట్ సరఫరా చేయడంలో కాంగ్రెస్ సర్కారు పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో విద్యుత్ కోతలతో పంటలకు నీరందించలేని అసమర్థ ప్రభుత్వం కాంగ్రెస్ అని ఆమె మండిపడ్డారు. అధికారంలోకి రాకముందు 6 గ్యారంటీలు ప్రజలకు ఆశ చూపి అధికారంలోకి వచ్చాక ప్రజలను రైతులను నిలువునా మోసం చేసిందన్నారు. 24 గంటల విద్యుత్ ఇస్తామని కనీసం 12 గంటల విద్యుత్ అందించకపోవడం బాధాకరమని, ఏ గ్రామానికి వెళ్లిన రైతులు పంటలు ఎండిపోతున్నాయని కన్నీరు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టలేకపోవడం వల్లే ఈ దుస్థితి వచ్చిందని, కాళేశ్వరం ప్రాజెక్ట్ నీటిని వాడుకుంటే భూగర్భజలాలు తగ్గేవి కాదన్నారు. మార్పు మార్పు అంటే అన్ని వర్గాల ప్రజలు కన్నీరు పెట్టడమే నా అని ఆమె ప్రశ్నించారు. సబ్ స్టేషన్ లాగ్ బూక్ పరిశీలిస్తే తాము ధర్నా చేస్తున్నామని విషయం తెలుసుకొని ఉదయం 8 గంటలకు విద్యుత్ ఇచ్చారని, నిన్న మొన్నటి వరకు ఎందుకు ఇవ్వలేదని విద్యుత్ అధికారులను ప్రశ్నించారు. తాము ధర్నా చేస్తేనే విద్యుత్ ఇస్తాం అంటే రైతుల కోసం రోజు ధర్నా చేయడానికి సిద్ధంగా ఉన్నామని అధికారులకు సునీత తేల్చి చెప్పారు. కెసిఆర్ ఉన్నప్పుడు రైతులను 24 గంటల విద్యుత్ ఇచ్చి ఆదుకుంటే ఇప్పటి పాలకులకు ఎందుకు చేతకావడం లేదని ప్రశ్నించారు. నేడు రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మీటింగ్ ఏర్పాటు చేస్తే రైతులకు ఉన్న కోపాన్ని గుర్తించిన ప్రభుత్వం మీటింగ్ ను రద్దు చేసుకునే పరిస్థితి వచ్చిందని ఎమ్మెల్యే అన్నారు. వానకాలం ఎండిపోయిన పంటలకు ఎకరాకు రూ.30వేల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అధికారంలో ఉండి అన్ని మేమే చేస్తున్నామని గొప్పలు చెప్పుకోవడం కాదని కాంగ్రెస్ నాయకులు గ్రౌండ్లో రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలపై ముందుకు రాకపోవడం సిగ్గుచేటన్నారు. ఈ కష్టకాలంలో రైతులకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు మీకు అండగా నిలబడతారని, ఏ రైతు కూడా ధైర్యం కోల్పోవద్దని రైతులకు సూచించారు. ఇప్పటికైనా రైతులపట్ల ప్రేమ ఉంటే రైతుల పంటలు కాపాడాలనుకుంటే వెంటనే కనీసం 12 గంటలైనా నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే రాస్తా రోకో చేశారు. వద్దురా నాయనా.. కాంగ్రెస్ పాలన అంటూ పలు నినాదాలు చేశారు. అనంతరం ఆందోళన చేస్తున్న ఎమ్మెల్యే, నాయకులను పోలీసులు విరమింప చేశారు.

**ఎమ్మెల్యేకు గోడు వినిపించిన మహిళా రైతులు..**

చండి గ్రామం వద్ద విద్యుత్ కోతలను నిరసిస్తూ రాస్తారోకో చేస్తున్న సమయంలో మండలంలోని రత్నాపూర్ గ్రామానికి చెందిన 100 కేవీ ట్రాన్స్ ఫార్మర్ తూప్రాన్ కు మరమ్మత్తుల కోసం మహిళా రైతులు ట్రాక్టర్లో తరలిస్తున్నారు. ఎమ్మెల్యే వారి దగ్గరకు వెళ్లి ఏమైందని పలకరించగా నెలరోజుల్లో మూడుసార్లు కాలిపోయింది, ఇప్పుడు మళ్లీ చెడిపోవడంతో మరమ్మత్తులకు వెళ్తున్నామని రైతులు ఆవేదనతో తెలిపారు. ఇదేం ప్రభుత్వమో ఏమో కరెంట్ రాక పొలాలు ఎండిపోతున్నాయని, మా పరిస్థితి ఎవరికి చెప్పుకోవాలని ఆవేదన చెందారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి వెంటనే రిపేర్ చేపిస్తాం అని, ధైర్యంగా ఉండాలని వారికి భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సింగాయపల్లి గోపి, సర్పంచ్లు నారాయణరావు, బేగరి నర్సయ్య, ప్రవీణ్ గౌడ్, వెంకటేశ్వర్, కొమురయ్య, రాజు, అశోక్, యాదాగౌడ్, కృష్ణారావు, రాజశేఖర్, నాగేశ్వర్ రావు, రాజేందర్ నాయక్, శ్రీనివాస్ గుప్తా, నాయకులు జీన్నారం మహిపాల్ రెడ్డి, తాటి పవన్ గుప్తా, రంగపల్లి సత్యం, రేణుకుమార్, మగ్రి మహేందర్రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ప్రభాకర్రెడ్డి, బోళ్ల ఆంజనేయులు తదితరులు పెద్ద సంఖ్యలో ఉన్నారు.

## తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

- నీటి లభ్యత ఆధారంగా ఆరుతడి పంటల సాగుకు
- ప్రాధాన్యం ఇవ్వాలి
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 12 (జనం సాక్షి) :** ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గిన నేపథ్యంలో జిల్లాలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. యాసంగి 2026--27 సీజన్లో నీటి లభ్యత, భూగర్భ జలాల పరిస్థితులను బట్టి రైతులు తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. రైతు నేస్తం వీడియో సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ పెసలు, మినుములు, శనగ, కుసుమ వంటి ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. ఇంకుడు గుంతలు, నీటి కుంటలు, బోరు బావుల పునరుద్ధరణ ద్వారా వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించాలని సూచించారు. రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ఇప్పటి నుంచే కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు పంటల ఎంపిక, సాగు పద్ధతులపై అవగాహన కల్పించాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పాండు, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, ఉద్యాన శాఖ అధికారి సోమేశ్వర్, పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ వసంతకుమారి, జిల్లా సహకార అధికారి కిరణ్ కుమార్, డీఆర్డీఏ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలను అరికట్టడం అందరి బాధ్యత

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి దీప కాసరగడ్డ
- కాశీంనగర్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు
- బాల్య వివాహాల నిర్మూలనకు గ్రామస్తుల ప్రతిజ్ఞ




**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 12 (జనంసాక్షి) :** బాల్య వివాహాలను అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీమతి దీప కాసరగడ్డ అన్నారు. సోమవారం వనపర్తి జిల్లాలోని కాశీంనగర్ గ్రామంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహ నిషేధ చట్టం - 2006 ప్రకారం 18 సంవత్సరాలు నిండని బాలికలకు, 21 సంవత్సరాలు నిండని బాలురకు వివాహాలు చేయడం చట్టవిరుద్ధమని తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా బాల్య వివాహాలు జరిపించినా, ప్రోత్సహించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాలబాలికలకు విద్య ఎంతో ముఖ్యమని, 6 నుంచి 14 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఉచిత నిర్బంధ విద్య అందుబాటులో ఉందని పేర్కొన్నారు. అలాగే 14 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను ఆమె తనిఖీ చేశారు. జిల్లా కళా సాంస్కృతిక బృందం సభ్యులు తమ పాటల ద్వారా బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించి ప్రజల్లో అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నిర్మూలనపై గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. జిల్లా బాల్య వివాహ నిషేధిత అధికారి మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణకు, బాల్య వివాహాల సమాచారాన్ని తెలియజేయడానికి చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098ను సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల నిర్మూలనకు గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ డి. కృష్ణయ్య, డీసీపీఓ రాంబాబు, జిల్లా సాంస్కృతిక కళా బృందం సభ్యులు, పోలీసు సిబ్బంది, గ్రామ సర్పంచ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# విద్యుత్ కోతలతో రైతాంగం ఆగమాగం

- రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం



**చిన్నశంకరంపేట, అక్టోబర్ 12 (జనం సాక్షి) :** మండల కేంద్రంలో విద్యుత్ కోతలను నిరసిస్తూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సోమవారం భారీ ధర్నా నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షులు పోగుల రాజు నేతృత్వంలో నాయకులు, కార్యకర్తలు చిన్న శంకరంపేట - మెదక్ ప్రధాన రహదారిపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను రోడ్డుపైనే దగ్ధం చేసి తమ నిరసనను తెలియజేశారు. మహిళా రైతులు సైతం ధర్నా, రాస్తారోకోలో పాల్గొని ఎండుతున్న పంటలు కరెంటు కోతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు, ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్, మాజీ అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, మండల అధ్యక్షులు పోగుల రాజు, మహిళా రైతులు మాట్లాడుతూ కరెంటు కొలతలతో పూర్తిగా పంట ఎండిపోయి అప్పుల పాలు అవుతున్నామని ఉచిత బస్సు ఎవరికోసం పెట్టారని మహిళలకు ఉచిత బస్సు పేరిట ప్రజలను అనేక రకాలుగా మోసం చేస్తున్న ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలని, పంట చేతికి వచ్చే సమయంలో విద్యుత్ కొరతతో పంటలు ఎండిపోవడం జరుగుతుందని దీంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని మహిళ రైతుల ఆవేదన వ్యక్తం చేశారు, కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధపు హామీలతో గద్దెనెక్కిందని మండిపడ్డారు. ప్రస్తుతం గ్రామాల్లో కరెంటు కోతలు విపరీతంగా పెరిగిపోయాయని, ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు చేతికి వచ్చే తరుణంలో నీళ్లు లేక ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను ఆదుకునేందుకు కనీసం రాబోయే 15 రోజుల పాటు నిరంతర, నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా పథకానికి ఇన్సూరెన్స్ ఎందుకు చెల్లించలేదని తెలంగాణ రాష్ట్రంలో రైతుల పక్షాన ఇన్సూరెన్స్ డబ్బులు చెల్లిస్తే పంట నష్ట పరిహారం వచ్చేదని, విద్యుత్ కోతలతో పంటలు ఎండు ముఖం పడ్డాయని వాపోయారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఆకుల రాజు, నాయకులు మల్లారెడ్డి, నరేందర్ రెడ్డి, దశరథ్, స్వామి, సక్రు నాయక్, రంజిత్ రెడ్డి, నాయిని ప్రసాద్, నాగరాజు, రాజు, ప్రసాద్, సురేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతను అవమానిస్తే సహించేది లేదు

- రైతును అవమానించిన తహసిల్దార్
- సస్పెన్షన్‌తో సరిపెట్టొద్దు.. కఠిన చర్యలు తీసుకోవాలి
- రైతుల పట్ల అధికారుల తీరు మారాలి
- మంజీరా రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు పృథ్వీరాజ్



**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 12 (జనం సాక్షి) :** ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తూ అన్నదాతలను అవమానిస్తే సహించేది లేదని మంజీరా రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు తుమ్మలపల్లి పృథ్వీరాజ్ హెచ్చరించారు. సోమవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో రైతులతో కలిసి పృథ్వీరాజ్ మాట్లాడారు. గజ్వేల్ మండల రెవెన్యూ కార్యాలయంలో శాంతం రాజు అలియాస్ యేసు పట్ల జరిగిన ఘటనను మంజీరా రైతు సమాఖ్య తీవ్రంగా ఖండిస్తుందన్నారు. అన్నదాతను అవమానించిన మండల రెవెన్యూ అధికారిని సస్పెండ్ చేసినందుకు జిల్లా కలెక్టర్‌ను సమాఖ్య ప్రతినిధులు అభినందించారు. ఎండనకా వాననకా కష్టపడి పంటలు పండించి దేశ ప్రజల ఆకలి తీర్చే రైతులను అవమానించడం బాధాకరమని అన్నారు. రైతుల శ్రమను, ఆత్మగౌరవాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని, రైతుల పట్ల మర్యాదగా వ్యవహరించడం ప్రభుత్వ అధికారుల బాధ్యత అని స్పష్టం చేశారు. రైతులను అవమానించే ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులను అవమానించినట్లు విచారణలో తేలితే, కేవలం సస్పెన్షన్‌తో సరిపెట్టకుండా నిబంధనల ప్రకారం ఉద్యోగం నుంచి తొలగించే స్థాయిలో చర్యలు తీసుకోవాలని కోరారు. రైతు దేశానికి వెన్నెముక అని, అన్నదాత ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రైతుల హక్కులు, ఆత్మగౌరవం, సంక్షేమం కోసం మంజీరా రైతు సమాఖ్య ఎల్లప్పుడూ రైతుల పక్షాన నిలుస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో సమాఖ్య అధ్యక్షుడు టి. పృథ్వీరాజు, ఉపాధ్యక్షుడు సంగిశెట్టి, సభ్యులు ధనంజయ, గోవురాజు, గౌలిశ్వర్, కె. విఠల్, గణపతి, కాశీనాథ్, శేఖర్ పాల్గొన్నారు.

# జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసే వరకు పోరాటం కొనసాగిస్తాం

- ఓటు చోరీతో ప్రజాస్వామ్యానికి ముప్పు
- జగ్గారెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ




**సంగారెడ్డి, అక్టోబర్ 12 (జనం సాక్షి) :** దేశ ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వీధుల్లోకి వచ్చి పోరాటం చేస్తున్నారని, ఆయన పోరాటానికి మద్దతుగా కాంగ్రెస్ కార్యకర్తలతో పాటు దేశ ప్రజలందరూ ఉద్యమంలో భాగస్వాములు కావాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ ఢిల్లీ రోడ్లపై ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడుతుంటే, మనం ఇళ్లలో కూర్చోవడం సమంజసం కాదని అన్నారు. రాహుల్ గాంధీకి మద్దతుగా సోమవారం సంగారెడ్డి పట్టణంలో జగ్గారెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మాట్లాడుతూ నేను ఢిల్లీకి వెళ్లగలిగినప్పటికీ, రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి సంగారెడ్డి నుంచే సంఘీభావం తెలియజేయాలనే ఉద్దేశంతో స్థానికంగా ర్యాలీ నిర్వహించినట్లు జగ్గారెడ్డి వివరించారు. రాహుల్ గాంధీ ప్రజల హక్కుల కోసం పోరాడుతుంటే, ఆయనకు మద్దతుగా కాంగ్రెస్ శ్రేణులు కూడా క్షేత్రస్థాయిలో ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. అధినేత పోరాటానికి కార్యకర్తలు అండగా నిలవాలని, ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు.

**డిమాండ్ నెరవేరే వరకు పోరాటం కొనసాగిస్తాం**

కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసే వరకు పోరాటాన్ని ఆపబోనని రాహుల్ గాంధీ ప్రకటించారని జగ్గారెడ్డి తెలిపారు. ఆ డిమాండ్ నెరవేరే వరకు సంగారెడ్డిలోనూ తన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ నిరసనకు మద్దతుగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నిరంతరం ప్రజల మధ్య ఉండాలని సూచించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు కాపాడటం లక్ష్యంగా రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి ప్రతి ఒక్కరూ మద్దతు తెలపాలని జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలాపూర్‌లో రీ సర్వే పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్

- రీ సర్వేపై సంతృప్తి వ్యక్తం చేసిన గ్రామస్తులు



**ఉప్పునుంతల, అక్టోబర్ 12 (జనంసాక్షి) :** ఉప్పునుంతల మండల పరిధిలోని తిరుమలాపూర్ గ్రామంలో జరుగుతున్న భూ రీ సర్వే పనులను నాగర్‌కర్నూల్ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సలోని చాప్రా శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రీ సర్వే పనుల పురోగతిని సమీక్షించి, గ్రామస్తులతో నేరుగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామ పటాన్ని మండల సర్వేయర్, లైసెన్సు సర్వేయర్లు అదనపు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం రైతులతో ముఖాముఖిగా మాట్లాడిన ఆమె రీ సర్వే ప్రక్రియలో ఏవైనా సమస్యలు, అభ్యంతరాలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. రీ సర్వే పనులు సంతృప్తికరంగా జరుగుతున్నాయని గ్రామస్తులు తెలపడంతో అధికారులు హర్షం వ్యక్తం చేశారు. రీ సర్వేలో ఏవైనా తేడాలు, సమస్యలు గుర్తిస్తే వెంటనే పరిష్కరించాలని, రైతులకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ సర్వేయర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప్పునుంతల తహసీల్దార్ అద్దంకి సునీత, రెవెన్యూ సిబ్బంది, గ్రామ సర్పంచ్, మండల సర్వేయర్, లైసెన్సు సర్వేయర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలి

- సీఈసీ రాజీనామా చేయాలి
- కోహెడలో ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ నిరసన



**కోహెడ, అక్టోబర్ 12 (జనంసాక్షి) :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను తక్షణమే రద్దు చేయాలని,అలాగే ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కోహెడ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఎఐఎస్ఎఫ్-- ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో, 2023 చట్టం నంబర్ 51ను కూడా రద్దు చేయాలని నాయకులు కోరారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, సర్ పేరుతో పేదలు, దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు, వలస కూలీలు, శ్రామిక ప్రజల ఓట్లను జాబితా నుంచి తొలగించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఇది ఓటు హక్కుపై ప్రత్యక్ష దాడి అని పేర్కొన్నవారు, పాలకవర్గాలు తమ అధికారాన్ని కాపాడుకోవడానికి రాజ్యాంగ సంస్థలను పావులుగా వాడుకుంటున్నాయని విమర్శించారు. 2023 చట్టం 51 ద్వారా ఎన్నికల కమిషనర్ల నియామకంలో సుప్రీంకోర్టు సూచించిన స్వతంత్ర యంత్రాంగాన్ని పక్కనపెట్టి, నియామకాలపై ప్రభుత్వానికే అధికారం కట్టబెట్టారని వారు మండిపడ్డారు. అధికార పార్టీకి అనుకూలమైన వారిని నియమించుకునే వ్యవస్థలో ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరిస్తుందని ప్రజలు ఎలా నమ్మగలరని ప్రశ్నించారు. ఈ చట్టాన్ని రద్దు చేసి, స్వతంత్ర నియామక వ్యవస్థను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సర్‌కు వ్యతిరేకంగా ఢిల్లీలో శాంతియుతంగా నిరస తెలుపుతున్న విద్యార్థులు, యువజనులు, ప్రజాసంఘాలపై పోలీసులు, కేంద్ర బలగాలు అణచివేత చర్యలకు పాల్పడ్డాయని నాయకులు తీవ్రంగా ఖండించారు. నిరసన తెలిపే హక్కు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని, లాఠీలతో, నిర్బంధాలతో ప్రజల గొంతు నొక్కాలని చూడటం ఫాసిస్టు పోకడ అని, ఇది ఎమర్జెన్సీ రోజులను గుర్తుచేస్తోందని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో నిరసనకారులపై దాడులు ఆపి, అక్రమ కేసులను ఎత్తివేయాలని, అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరూ జాబితా నుంచి తొలగించకూడదని కోరారు. ప్రజాస్వామ్య హక్కులను, నిరసన స్వేచ్ఛను కాపాడాలని కోరిన నాయకులు, ప్రజల ఓటు హక్కును కాపాడుకునే వరకు ఈ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ చిట్యాల శేఖర్, ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి కందుకూరి మహేష్, ఎఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి రాసూరి యుగేందర్, ఎఐవైఎఫ్ మండల అధ్యక్షులు వేల్పుల చంద్రశేఖర్, సామాజిక కార్యకర్త డాక్టర్ వెల్పుల శంకర్, కందుకూరి చిన్న మహేష్, ఎర్ర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పంటలకు 24 గంటల త్రీఫేజ్ కరెంట్ ఇవ్వాలి

- కౌటాల మండలంలో రైతుల నిరసన



కౌటాల అక్టోబర్ 12 (జనం సాక్షి) : పంటలకు 24 గంటల పాటు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ కౌటాల మండలంలోని వీర్దండి, గుండాయిపేట్, తాటిపల్లి గ్రామాలకు చెందిన రైతులు నిరసన వ్యక్తం చేశారు. వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని, సబ్ స్టేషన్ ముట్టడించి ధర్నా చేశారు.సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.వ్యవసాయ పనులకు విద్యుత్ ఎంతో కీలకమని, సరైన సమయంలో కరెంట్ అందకపోతే పంటలకు నీరు అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాల కారణంగా వ్యవసాయ పనులు సకాలంలో పూర్తికావడం లేదని పేర్కొన్నారు. పంటలను కాపాడుకోవడానికి రైతులు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని తెలిపారు.రైతుల విద్యుత్ కష్టాలు గుర్తించి, వ్యవసాయానికి 24 గంటల పాటు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యవసాయ రంగాన్ని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ నిరంతరంగా అందేలా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.వ్యసాయానికి రోజుకు 15గంటల త్రి ఫెస్ కరెంట్ అందించి సహకరిస్తామని విద్యుత్ శాఖ అధికారులు హామీ ఇవ్వడంతో నిరసన కార్యక్రమాన్ని ముగించారు.రైతులు పెద్ద ఎత్తున పాల్గొని నిరసన తెలిపారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

- నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ బ్యూరో, అక్టోబర్ 12 (జనంసాక్షి) : ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తుపై సంబంధిత శాఖల అధికారులు తక్షణమే స్పందించి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులను సమీక్షించి, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలకు సత్వర సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని ఆదేశించారు. ప్రజావాణిలో భాగంగా విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, భూ సమస్యలు తదితర అంశాలపై ప్రజలు తమ దరఖాస్తులను కలెక్టర్‌కు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అనాథ శరణాలయానికి వేలం సొమ్ము అప్పగింత



బెల్లంపల్లి, అక్టోబర్ 12, (జనంసాక్షి) : బెల్లంపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయక లడ్డూ వేలం పాట బుధవారం నిర్వహించారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ కు తెలంగాణ క్యాబినెట్ లో చోటు దక్కాలని, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులందరూ ఒకే తాటిపైకి వచ్చి బెల్లంపల్లి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరుకుంటూ, విఘ్నేశ్వరుని ఆశీస్సులు ఉండాలని, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన వినాయక చవితి నవరాత్రుల లడ్డూ వేలం పాటలో మాజీ కౌన్సిలర్, మాజీ కౌన్సిలర్ ఫోరం రాష్ట్ర చైర్మన్ భూక్యా రాము నాయక్ రూ.20,000 లకు లడ్డూను దక్కించుకున్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులందరూ ఒకే కుటుంబంగా కలిసి, ఎమ్మెల్యే వినోద్ వెన్నంటి ఉండేందుకు ముందుకు వచ్చిన ఈ శుభ సందర్భంగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదేశాల మేరకు, మున్సిపల్ చైర్మన్ దావా స్వాతి రమేష్, వైస్ చైర్మన్ రాగంశెట్టి సతీష్ సూచన మేరకు వేలం పాట ద్వారా వచ్చిన రూ.20,000 నగదును అమ్మ అనాథ ఆశ్రమానికి విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని మాజీ మున్సిపల్ చైర్మన్ సూరిబాబు, రాష్ట్ర నాయకులు చిలుముల శంకర్, మునుమందా రమేష్, పట్టణ అధ్యక్షులు బండి ప్రభాకర్, ఉపాధ్యక్షుడు శ్యామ్, మాజీ పట్టణ అధ్యక్షుడు కంకటి శ్రీనివాస్, మాజీ వైస్ చైర్మన్ శంకర్ సింగ్, సీనియర్ నాయకులు గెల్లి జయరామ్, అఫ్జల్, బండి రామ్, లక్ష్మణ్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి బ్యూరో (జనంసాక్షి): ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహిం చిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబం ధించిన వినతులను స్వీకరించారు. ఈ సంద ర్భంగా మొత్తం 67 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఎంతో ఆశతో ప్రజావాణిని ఆశ్రయి స్తున్నందున, వారి అర్జీల పట్ల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి అర్జీని వెంటనే సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్‌మెంట్ చేశామని, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ముఖ్యంగా, అర్జీల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేకుండా వారంలోగా చర్యలు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అర్జీలపై తీసుకున్న చర్యలు, పరిష్కార పురోగతికి సంబంధించిన వివరాలను తప్పనిసరిగా సంబంధిత పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. ప్రజావాణికి వచ్చే ప్రతి అర్జీకి అత్యంత ప్రాధాన్యతనివ్వాలని, అర్జీల పరిష్కారంలో జాప్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, ఆర్డీఓ హరికృష్ణతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# గంజాయి సాగుతో జీవితాలు నాశనం

- మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి
- జిల్లా ఎస్పీ నీతిక పంత్



జైనూర్, అక్టోబర్ 12 (జనంసాక్షి) : గంజాయి సాగు, విక్రయాల వల్ల ప్రజల జీవితాలు నాశనమవుతున్నాయని, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నీతిక పంత్ పిలుపునిచ్చారు. సోమవారం జైనూర్ మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో ఆసిఫాబాద్ సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ నీతిక పంత్ మాట్లాడుతూ.. గంజాయిని సాగు చేయడం, విక్రయించడం వల్ల సమాజానికి తీవ్ర నష్టం జరుగుతుందని అన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వ్యక్తుల జీవితాలను దెబ్బతీయడమే కాకుండా కుటుంబాలను కూడా ఇబ్బందులకు గురి చేస్తుందని పేర్కొన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. టోర్నమెంట్‌లో పాల్గొన్న 65 జట్ల క్రీడాకారులు తమ తమ గ్రామాల్లో మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్పీ కోరారు. క్రీడాకారులకు ప్రోత్సాహకంగా టీ షర్టులు, క్యాప్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాంకిడి సీఐ వేణుగోపాల్, జైనూర్ సీఐ రమేష్, జైనూర్ ఎస్సై రవికుమార్, కేరమెరి ఎస్సై కందూరి రాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఆధునిక పద్ధతిలో గొర్రెల పెంపకం!

- రూ.30 లక్షలతో ఏఆర్ షీప్ ఫామ్ నిర్మాణం..
- 18 ఏళ్ల అనుభవంతో వినూత్న ఆలోచనకు శ్రీకారం..
- నాలుగు ఎకరాల్లో పప్పుజాతి గడ్డి సాగు.. గొర్రెలకు పౌష్టికాహారం..





మహాదేవపూర్, అక్టోబర్ 12 (జనంసాక్షి): గ్రామీణ ప్రాంతాల్లో యాదవ కుటుంబాలకు తరతరాలుగా జీవనాధారంగా ఉన్న గొర్రెల పెంపకంలోనూ ఆధునిక పద్ధతులు అడుగుపెడుతున్నాయి. ఒకప్పుడు గొర్రెల మందలను గ్రామాల వెంట, అడవుల వెంట మేపుతూ జీవనం సాగించిన కాపరులు.. ప్రస్తుతం కూలీల కొరత, పెరుగుతున్న నిర్వహణ ఖర్చులు, గొర్రెల సంరక్షణలో ఎదురవుతున్న ఇబ్బందులతో ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. ఈ నేపథ్యంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం అంబటిపల్లి గ్రామానికి చెందిన యాదవ సోదరులు పన్నాల రాజు, చెట్టి అజిత్ వినూత్న ఆలోచనతో ముందడుగు వేశారు. సొంత భూమిలో సుమారు రూ.30 లక్షలతో ఏఆర్ షీప్ ఫామ్‌ను నిర్మించి ఆధునిక పద్ధతిలో గొర్రెల పెంపకాన్ని కొనసాగిస్తున్నారు. సంప్రదాయ వృత్తికి సాంకేతికతను జోడిస్తూ, కూలీల కొరతను అధిగమించడంతోపాటు గొర్రెల పెంపకాన్ని లాభసాటిగా మార్చుకునే దిశగా ప్రయత్నిస్తున్నారు.

**తరతరాలుగా అదే వృత్తి.. ఇప్పుడు ఆధునిక బాట!**

బేగులూరు గ్రామానికి చెందిన రాజు, అజిత్ కుటుంబంలో గొర్రెల పెంపకం తరతరాలుగా కొనసాగుతోంది. తమ తాతలు, తండ్రుల కాలం నుంచే ఈ వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నామని రాజు యాదవ్ తెలిపారు. గతంలో తమ కుటుంబం వద్ద సుమారు వెయ్యి గొర్రెలు ఉండేవని, తన తండ్రి వాటిని తీసుకొని వివిధ గ్రామాలకు వలస వెళ్తూ మేపేవారని గుర్తుచేశారు. ప్రస్తుతం వివిధ కారణాలతో గొర్రెల సంఖ్య తగ్గి సుమారు 200కు చేరిందని వివరించారు. గొర్రెల పెంపకంలో తనకు 18 ఏళ్ల అనుభవం ఉందని, డిగ్రీ పూర్తి చేసిన తాను, ఎంబీఏ చదివిన అజిత్ కలిసి ఈ వృత్తిని ఆధునిక పద్ధతిలో కొనసాగించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. గతంలో గొర్రెలను మేపేందుకు కూలీలు సులభంగా దొరికేవారని, ప్రస్తుతం అవసరమైన సమయంలో పనివాళ్లు అందుబాటులో లేకపోవడం ప్రధాన సమస్యగా మారిందని పేర్కొన్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా గొర్రెలను ఒకేచోట ఉంచి సంరక్షించేందుకు సొంత భూమిలో ఫామ్ నిర్మించినట్లు వెల్లడించారు.

**రూ.30 లక్షలతో విశాలమైన షెడ్ నిర్మాణం..**

గొర్రెల సంరక్షణకు అనువుగా 50 అడుగుల పొడవు, 30 అడుగుల వెడల్పుతో షెడ్డును నిర్మించినట్లు రాజు తెలిపారు. సుమారు 150 నుంచి 180 గొర్రెలు ఉండేలా దీనిని రూపొందించినట్లు వివరించారు. ప్రస్తుతం ఫామ్‌లో సుమారు 150 గొర్రెలతోపాటు 26 పొట్టేళ్లు, మరో నాలుగు పెద్ద సంతానోత్పత్తి పొట్టేళ్లు ఉన్నట్లు పేర్కొన్నారు. గొర్రెలను నిరంతరం మేపేందుకు బయటకు తీసుకెళ్లాల్సిన అవసరాన్ని తగ్గిస్తూ, వాటికి అవసరమైన మేత, నీరు, సంరక్షణ అందించేలా ఏర్పాట్లు చేసుకున్నారు.

**నాణ్యమైన సంతతి కోసం ప్రత్యేక పొట్టేళ్లు..**

గొర్రెల సంతానోత్పత్తిలో నాణ్యమైన పొట్టేళ్ల ఎంపిక కీలకమని రాజు వివరించారు. సంతానోత్పత్తి కోసం ప్రత్యేకంగా క్రాసింగ్ పర్పస్ పొట్టేళ్లను ఒక్కొక్కటి సుమారు రూ.50 వేల చొప్పున కొనుగోలు చేసినట్లు తెలిపారు. మందలో తగిన వయస్సు కలిగిన పొట్టేళ్లు ఉండటం వల్ల సంతానోత్పత్తి మెరుగుపడుతుందని పేర్కొన్నారు. సాధారణంగా ప్రతి రెండు నుంచి మూడు సంవత్సరాలకు ఒకసారి పొట్టేళ్లను మార్చడం ద్వారా సంతతి అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు.

**నాలుగు ఎకరాల్లో పప్పుజాతి గడ్డి సాగు..**

గొర్రెలకు నాణ్యమైన మేత అందించేందుకు ఫామ్ పరిధిలో నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ప్రత్యేకంగా గడ్డి సాగు చేపట్టారు. పప్పుజాతికి చెందిన వివిధ రకాల గడ్డి విత్తనాలను విత్తినట్లు రాజు తెలిపారు. ఈ పంటలు సుమారు 45 రోజుల్లో కోతకు వచ్చేలా సాగు చేస్తున్నట్లు వివరించారు. గొర్రెలకు రోజుకు సుమారు 1.5 నుంచి 2 కిలోల వరకు మేత అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పప్పుజాతి గడ్డిలో ప్రోటీన్లు సమృద్ధిగా ఉండటంతో గొర్రెల ఎదుగుదలకు, ఆరోగ్య పరిరక్షణకు తోడ్పడుతుందని తెలిపారు.

**సంప్రదాయ వృత్తికి ఆధునికత జోడింపు..**

కూలీల కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న గొర్రెల పెంపకందారులకు ఆధునిక ఫామ్ విధానం ప్రత్యామ్నాయంగా నిలుస్తుందని రాజు, అజిత్ భావిస్తున్నారు. సొంత భూమి, శాస్త్రీయ పద్ధతిలో మేత సాగు, నాణ్యమైన సంతానోత్పత్తి పొట్టేళ్ల ఎంపికతో గొర్రెల పెంపకాన్ని మరింత పద్ధతిగా నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నారు. సంప్రదాయ వృత్తిని వదులుకోకుండా కాలానుగుణంగా మార్పులు చేసుకుంటూ ముందుకు సాగుతున్న ఈ సోదరుల ప్రయత్నం గ్రామీణ యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.

# తాండూరులో పాస్టర్ కుటుంబంపై వరుస దాడులు

- రక్షణ కల్పించాలని ప్రెస్‌క్లబ్‌లో ఆవేదన



తాండూర్, అక్టోబర్ 12(జనం సాక్షి) : మంచిర్యాల జిల్లా తాండూరు మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో నివాసముంటున్న పాస్టర్ సంజీవరావు కుటుంబంపై కొంతమంది వ్యక్తులు వరుస దాడులకు పాల్పడుతూ ప్రాణభయానికి గురిచేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం తాండూర్ ఐబీ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్ విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా కిష్టంపేట గ్రామపంచాయతీ పరిధిలోని తాండూరు బస్టాండ్ ప్రాంతంలో చర్చి పాస్టర్‌గా సేవలందిస్తున్నట్లు ఆయన తెలిపారు. సర్వే నంబర్ 23లో ఉన్న 60 సెంట్ల భూమికి సంబంధించి పట్టా, అడంగల్, పహాణీ, గ్రామపంచాయతీ, భవన నిర్మాణ అనుమతులు, ఎన్‌ఓసీ వంటి అన్ని రకాల చట్టబద్ధమైన పత్రాలు తన వద్ద ఉన్నాయని స్పష్టం చేశారు. ఆ భూమిలోనే చర్చి, నివాస గృహాన్ని నిర్మించుకుని కుటుంబంతో కలిసి నివసిస్తూ, ఎన్‌జీఓ ద్వారా వివిధ సామాజిక సేవలు అందిస్తున్నట్లు చెప్పారు.

**వరుస దాడుల వివరాలు:**

– మొదటి దాడి (జూలై 8, 2026): అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో సుమారు 20 మంది యువకులు గడ్డపారలు, గొడ్డళ్లు, కత్తులతో చర్చి గేటును ధ్వంసం చేసి లోపలికి ప్రవేశించారు. చర్చిని, ఫర్నిచర్‌ను, బైక్‌ను పూర్తిగా ధ్వంసం చేయడంతో దాదాపు రూ. 3 లక్షల ఆస్తి నష్టం జరిగింది. దీనిపై పోలీసులు నామమాత్రపు కేసులు మాత్రమే నమోదు చేయడంతో నిందితులు మరింత రెచ్చిపోయారు.

– రెండో దాడి (అక్టోబర్ 2, 2026): మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో దాదాపు 10 మంది వ్యక్తులు కర్రలు, రాళ్లతో చర్చిలోకి చొరబడి, పునర్నిర్మించిన సిలువను, వస్తువులను ధ్వంసం చేశారు. దీనిపై పోలీసులు మళ్లీ ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

– మూడో ప్రయత్నం (అక్టోబర్ 9, 2026): మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో గతంలో ఎఫ్ఐఆర్ నమోదైన కొందరు వ్యక్తులు ట్రాక్టర్ తీసుకొని వచ్చి చర్చి భూమిని దున్నేందుకు ప్రయత్నించారు. ప్రశ్నించగా బెదిరింపులకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకోగా, స్థానిక అధికారులకు భూమి పత్రాలను చూపించడంతో నిందితులు వెనుదిరిగారు.మండల కేంద్రానికి సమీపంలో, ప్రధాన రహదారి పక్కనే ఇంతటి దౌర్జన్యం జరుగుతున్నా రక్షణ కరువైందని పాస్టర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాలను మంత్రులు, ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, డీసీపీ, ఏసీపీల దృష్టికి తీసుకెళ్లినా నిందితులపై కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్లే వారు మళ్లీ మళ్లీ దాడులకు తెగబడుతున్నారని ఆరోపించారు. తనకు ఎదిగిన ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని, ప్రతిరోజూ ప్రాణభయంతో బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నామని కన్నీటిపర్యంతమయ్యారు. తనకు గానీ, తన భార్యాబిడ్డలకు గానీ ఎలాంటి హాని జరిగినా.. అందుకు నేరగాళ్లతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పోలీసులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితులపై కఠిన చర్యలు తీసుకుని, తమ కుటుంబానికి పూర్తి భద్రత, న్యాయం కల్పించాలని అధికారులను, ప్రజాప్రతినిధులను పాస్టర్ సంజీవరావు హృదయపూర్వకంగా వేడుకున్నారు.



# విద్యార్థి దశలోనే ఆధ్యాత్మికతను పెంపొందించాలి

- ఏరియా జీఎం రాధాకృష్ణ

రామకృష్ణాపూర్, అక్టోబర్ 12(జనంసాక్షి): విద్యార్థి దశలోనే విద్యార్థులలో ఆధ్యాత్మికతను పెంపొందించాలని మందమర్రి ఏరియా జీఎం రాధాకృష్ణ అన్నారు. పట్టణంలోని శ్రీ సత్య సాయి ప్రశాంతి మందిరంలో భారతీయ సంస్కృతి ఆధ్యాత్మిక శిక్షణ శిబిరాన్ని సోమవారం ప్రారంభించి ఆయన మాట్లాడారు. విద్యార్థులు చెడు మార్గంలో వెళ్లకుండా ఇటువంటి శిక్షణ తరగతులు ఎంతగానో దోహదం చేస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతోపాటు పెద్దలను గౌరవించడం నేర్చుకోవాలని అలాగే క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆధ్యాత్మిక శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్న నిర్వాహకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డా.గొడిసెల సంధ్యారాణి-రాజారమేష్, శ్రీనివాసరావు, జోగుల నాగరాజు, కాంతారావు, గణేష్, హనుమంత్ రెడ్డి, సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

# గైర్హాజరవుతున్న అధికారులపై చర్యలెక్కడ?

- నడికూడ మండల ప్రజావాణికి పలుమార్లు పలు శాఖల అధికారుల గైర్హాజరు..
- ప్రజా సమస్యలపై నిర్లక్ష్యమెందుకు?
- గైర్హాజరైన అధికారులపై కలెక్టర్‌కు పలుమార్లు ఎంపీడీవో ఫిర్యాదు..
- అయినా మారని అధికారుల తీరు..
- ఫోటోలో పదిమంది హాజరు పేపర్ లో 17 మంది హాజరైనట్లు వివరణ




నడికూడ, అక్టోబర్ 12 (జనంసాక్షి) : ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం నడికూడ మండలంలో ఆశించిన స్థాయిలో అమలుకావడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణికి పలు శాఖల అధికారులు హాజరుకాకపోవడంతో ప్రజలు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి నెలకొందని ఫిర్యాదుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమైనప్పటి నుంచి కొన్ని శాఖల అధికారులు గైర్హాజరవుతున్నారని, ఈ విషయంపై ఎంపీడీవో పలుమార్లు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ పరిస్థితిలో మార్పు కనిపించడం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు కార్యక్రమానికి హాజరుకాకపోవడంపై ఫిర్యాదుదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**హాజరు రిజిస్టర్‌పై అనుమానాలు..!**

ప్రజావాణికి కొద్దిమంది అధికారులు మాత్రమే హాజరవుతున్నట్లు కనిపిస్తుండగా, హాజరు రిజిస్టర్‌లో మాత్రం ఎక్కువ మంది సంతకాలు ఉన్నట్లు నమోదవుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు దృష్టి సారించి, హాజరు వివరాలను పరిశీలించాలని కోరుతున్నారు. అయితే, ఈ ఆరోపణలపై అధికారుల వివరణ వెలువడాల్సి ఉంది.

**జిల్లా అధికారులు స్పందించాలి..**

ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు గైర్హాజరవుతుంటే బాధ్యులపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ఫిర్యాదుదారులు ప్రశ్నిస్తున్నారు. ఎంపీడీవో పలుమార్లు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు చెబుతున్న నేపథ్యంలో, ఉన్నతాధికారులు ఈ అంశంపై విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించాలని కోరుతున్నారు. ప్రజావాణికి హాజరయ్యేలా అన్ని శాఖల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతోపాటు, హాజరు రిజిస్టర్‌లో నమోదైన వివరాలను తనిఖీ చేసి, విధుల పట్ల నిర్లక్ష్యం వహించినట్లు తేలితే తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాల్సిన ప్రజావాణి కార్యక్రమం కేవలం నామమాత్రంగా మిగిలిపోకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరుతున్నారు.

# నిర్మల్ అభివృద్ధికి రూ.50 కోట్లు విడుదల చేయాలి

- సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి లేఖ



నిర్మల్ బ్యూరో అక్టోబర్ 12,(జనంసాక్షి) : పట్టణ సమగ్ర అభివృద్ధి కోసం నిర్మల్ మున్సిపాలిటీకి మంజూరైన రూ.50 కోట్ల నిధులను వెంటనే విడుదల చేయాలని బీజేపీ శాసనసభాపక్ష నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే ఈ నిధుల విడుదల కోసం ముఖ్యమంత్రిని కోరినట్లు తెలిపారు. దీనిపై 2025 మే 14న సవరించిన ప్రతిపాదనలు పంపాలని టీయూఎఫ్ఐడీసీ అధికారులు జిల్లా కలెక్టర్‌ను కోరగా, కలెక్టర్ అదే ఏడాది జూన్ 16న ప్రతిపాదనలు పంపించారని పేర్కొన్నారు. అయినప్పటికీ నిధుల విడుదలలో జాప్యం జరుగుతోందన్నారు. ఇటీవల పట్టణాభివృద్ధి కింద నిర్మల్ మున్సిపాలిటీకి రూ.15 కోట్లు మంజూరయ్యాయని, పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధికి మరో రూ.50 కోట్ల నిధులను కూడా వెంటనే విడుదల చేయాలని ముఖ్యమంత్రికి లేఖ రాసినట్లు మహేశ్వర్‌రెడ్డి వెల్లడించారు.

## బెజ్జంకి పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సీపీ రష్మి పెరుమాళ్

- పెండింగ్ కేసుల పరిష్కారానికి వేగం పెంచాలి
- ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు అవగాహన కల్పించాలి




**బెజ్జంకి, అక్టోబర్ 12 (జనం సాక్షి) :** సిద్ధిపేట పోలీస్ కమిషనర్,ఐపీఎస్ రష్మి పెరుమాళ్ సోమవారం బెజ్జంకి పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు.ముందుగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించిన అనంతరం సీఐ విద్యాసాగర్,ఎస్ఐ తిరుపతితో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకుని,పెండింగ్ కేసులను వేగంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎస్ఐ,సిబ్బందిని ఆదేశించారు.క్రైమ్ ప్రాపర్టీని పరిశీలించి వాటి భద్రత,నిర్వహణపై అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు. స్టేషన్ పరిధిలో చట్టవ్యతిరేక,అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.సైబర్ నేరాలపై గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.ప్రతి గ్రామంలో 'సిద్దిపేట సురక్ష నేత్ర' కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటును ప్రోత్సహించాలని తెలిపారు.

యువతకు 'సిద్దిపేట పోలీస్ ఉద్యోగ మిత్ర' కార్యక్రమంపై అవగాహన కల్పించాలని సూచించారు.'డయల్ 112'కు అత్యవసర కాల్ వచ్చిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు అండగా నిలవాలని ఆదేశించారు.పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా,ఆహ్లాదకరంగా ఉంచుకోవాలని సూచించారు.

## మున్నూరు కాపు కార్పొరేషన్‌కు రూ. 5 వేల కోట్లు కేటాయించాలి

- ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 12 (జనం సాక్షి) :** తెలంగాణ మున్నూరు కాపు కార్పొరేషన్ కు బడ్జెట్లో 5 వేల కోట్లు కేటాయించాలని రాజ్యసభ ఎంపీ, మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వద్దిరాజు రవిచంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం బడ్జెట్లో ఈ నిధులు కేటాయిస్తే మున్నూరు కాపు యువత, మహిళ, నిరుపేద రైతులకు ఎంతో లాభం చేకూరుతుందని అన్నారు. సోమవారం ఖమ్మం మున్నూరు కాపు హాస్టల్ భవనంలో జిల్లా నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. జిల్లా సంఘం గౌరవ అధ్యక్షులు కొత్త సీతారాములు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎంపీ రవిచంద్ర ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మున్నూరు కాపు సంఘంలో తాను మొదటి నుండి ఎన్నికలకు దూరమని.. ఏకగ్రీవంగా ఎన్నుకోవడం ద్వారా మన ఐక్యతను నిరూపించుకోవాలనే ఆలోచనతో పనిచేస్తానని అన్నారు. ఇటీవల ఖమ్మం జిల్లాకు చెందిన అన్ని రాజకీయ పార్టీల్లోని మున్నూరు కాపు సంఘం నాయకుల సమక్షంలో పార్టీలకు అతీతంగా జిల్లా కమిటీని ఎన్నుకోవడం జరిగిందని గుర్తు చేశారు. మున్నూరు కాపు కులంలో జన్మించడం తన అదృష్టంగా భావిస్తున్నానని బీసీలలో మున్నూరు కాపుల జనాభా అత్యధికమని గతంలో వి హనుమంతరావు, డి. శ్రీనివాస్, కేశవరావు, పొన్నాల లక్ష్మయ్య లాంటివారు సీఎం పదవి పొందేందుకు అన్ని అర్హతలు ఉన్నా చివరి నిమిషంలో చేజారిందని అన్నారు. మున్నూరు కాపులు అన్ని పార్టీలలో ఉండాలని కానీ సరైన సమయంలో ఐక్యత చూపాలని అన్నారు. ఇప్పటివరకు తాను మనం కులానికి చాలా తక్కువగా చేశామని ఇంకా ఎంతో చేయాల్సింది ఉందని అన్నారు. మొదట ఇంట గెలిచి రచ్చ గెలవాలని, రాష్ట్ర, జాతీయ స్థాయిలో మనం ఎదిగే క్రమంలో స్థానికంగా ఉన్న కులంలో మంచి పేరు సంపాదించి సేవ చేయాలన్నారు. 56% ఉన్న బీసీలను కలుపుకొని వెళ్ళినప్పుడు రాజ్యాధికారం దక్కుతుందన్నారు. స్వాతంత్రం వచ్చి ఇన్ని సంవత్సరాలైనా రాష్ట్ర మంత్రివర్గంలో మొదటిసారి మున్నూరు కాపులకు స్థానం దక్కకపోవడం బాధాకరమన్నారు. ఖమ్మంలో మున్నూరు కాపు ఫంక్షన్ హాల్ అభివృద్ధికి, సంఘం మాజీ అధ్యక్షులు మేకల సంగయ్య విగ్రహ నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. హైదరాబాదులో వివిధ గ్రూప్ లు, సంఘాలుగా ఉన్న సంఘాన్ని మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్రంగా ఆవిర్భవించడంతో ప్రభుత్వం కోట్లది రూపాయల ఐదు ఎకరాల భూమి ఇచ్చిందని అన్నారు. ఇప్పుడు రూ. 150 కోట్ల నిధులతో భవన నిర్మాణానికి పునాదులు పడ్డాయి అన్నారు. ముఖ్యంగా జనాభాలో సగం బాగా ఉన్న మహిళలు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకొని రాజకీయాలలో రాణించాలన్నారు. యువత వ్యాపారంలో రాణిస్తూ ఐక్యంగా ఉంటూ కుల సేవ చేయాలన్నారు యువత తలుచుకుంటే సాధించలేనిది లేదన్నారు. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి తాము ఎంచుకున్న రంగాల వైపు ముందుకు పోవాలన్నారు. అనంతరం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ సమావేశంలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ, జిల్లా మాజీ అధ్యక్షులు పారా నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు శీలంశెట్టి వీరభద్రం, ప్రధాన కార్యదర్శి పసుపులేటి దేవేంద్రం, నాయకులు మడూరు పూర్ణ, మెంతుల శ్రీశైలం, తోట రామారావు, తోట రమేష్, పగడాల మంజుల, తోట సుజలా రాణి, హారిక నాయుడు, పారా ఉదయ్ కుమార్, మేకల శ్రీనివాసరావు, మేకల నాగేందర్, మిర్యాల రామకృష్ణ, లక్కినేని రఘు, మారిశెట్టి వెంకటేశ్వరరావు, ఆళ్ల కృష్ణ, కనకం జనార్ధన్, మేకల బిక్షమయ్య, పసుపులేటి నాసరయ్య తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన గిరిజన కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందించాలి

- గిరిజన దర్బార్ అర్జీలను గడువులోగా పరిష్కరించాలి
- ఐటీడీఏ పీఓ బి. రాహుల్ ఆదేశం

**భద్రాచలం, అక్టోబర్ 12 (జనంసాక్షి) :** గిరిజన దర్బార్‌లో వివిధ సంక్షేమ పథకాల కోసం నమ్మకంతో అర్జీలు సమర్పించే గిరిజనులకు ప్రభుత్వ పథకాలు అందేలా సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఆదేశించారు. నిర్ణీత గడువులోగా అర్జీలను పరిశీలించి అర్హులైన వారికి న్యాయం చేయాలని సూచించారు. సోమవారం భద్రాచలంలోని ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వివిధ ఆదివాసీ గ్రామాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి అధికారులు అర్జీలు స్వీకరించారు. సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజు, ఎస్‌డీసీ ఆనంద్ కుమార్, గురుకులాల ఆర్‌సీఓ అరుణకుమారి, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ మధుకర్ తదితరులతో కలిసి అర్జీలను సంబంధిత అధికారులకు పంపించారు. అర్హులైన ప్రతి గిరిజన కుటుంబానికి



ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని పీఓ స్పష్టం చేశారు.

### వివిధ సమస్యలపై అర్జీలు

గిరిజన దర్బార్‌లో పోడు భూముల పట్టాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం, పట్టాల్లో పేర్ల మార్పులు, భూ సమస్యల పరిష్కారం, చేపల సొసైటీల ఏర్పాటు, స్వయం ఉపాధి కోసం శిక్షణ, వ్యవసాయానికి విద్యుత్ సౌకర్యం, బోర్లు, మోటార్ల మంజూరు వంటి అంశాలపై గిరిజనులు అర్జీలు సమర్పించారు. గిరిజన గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సహాయం అందించాలని కోరారు. సోలార్ విద్యుత్ పథకం ద్వారా బోరుబావులకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని, ఉన్నత చదువుల కోసం ఆర్థిక సహాయం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

### అర్హులకు విడతలవారీగా పథకాలు

గిరిజన దర్బార్‌లో స్వీకరించిన అన్ని అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వాటిని సంబంధిత శాఖల ద్వారా పరిశీలించి అర్హులైన వారికి విడతలవారీగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పీఓ బి. రాహుల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పీపీజీ అధికారి గన్యా, జేడీఎం హరికృష్ణ, హౌసింగ్ ఏఈ హేమంత్, మేనేజర్ ఆదినారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌజన్యతో పాటు సిబ్బంది నాగేశ్వరరావు, నరేందర్, హరిత, విజయ్, జోగారావు, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో టేకు కలప మాయం

**కల్లూరు, అక్టోబర్ 12 (జనం సాక్షి) :** కల్లూరు మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని ఐదు టేకు చెట్లకు సంబంధించిన సుమారు రూ.2 లక్షల విలువైన కలప మాయమైనట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. సుమారు 150 అడుగుల కలప ఏమైందన్న ప్రశ్నలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. నరికిన కలపను రహస్యంగా మారుమూల గ్రామపంచాయతీకి తరలించినట్లు వస్తున్న ఆరోపణలు మరింత అనుమానాలకు తావిస్తున్నాయి. ఐదు టేకు చెట్లను నరికేందుకు అనుమతులు ఉన్నాయా? కలప తరలింపు వెనుక ఎవరున్నారు? అనే ప్రశ్నలకు సమాధానాలు లభించాల్సి ఉంది. చట్టాలను ఉల్లంఘించే సామాన్యులపై చర్యలు తీసుకునే అధికారులు, ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణంలోనే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటే బాధ్యత వహించరా? అంటూ మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఈ వ్యవహారంలో అధికారుల పాత్ర ఏమైనా ఉందా? అనే ఆరోపణలపైనా స్పష్టత రావాల్సి ఉంది. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి సమగ్ర విచారణ చేపట్టి, కలప తరలింపు వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయం పై ఎం డి ఓ ను వివరణ కోరేందుకు ప్రయత్నంచగా అందుబాటు లో లేరని ట్రేనింగ్ కు వెళ్లారని తెలిసింది.ఈ వ్యవహారంపై తహసీల్దార్‌ను వివరణ కోరగా తమకు తెలియదని, ఫారెస్ట్ శాఖ చూసుకుంటుందన్నారు. ఈ విషయంపై ఫారెస్ట్ అధికారి సురేష్ కుమారును వివరణ కోరగా సంఘటన విషయం మా దృష్టికి వచ్చిందని విచారణ చేస్తున్నామని తెలిపారు.

## కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- వివోఏ బిల్డింగును వివోఏ మెట్టు స్వరూపరాణి చేత ప్రారంభించిన మంత్రి పొంగులేటి కట్టుబడింది
- వివోఏ బిల్డింగును వివోఏ మెట్టు స్వరూపరాణి చేత ప్రారంభించిన మంత్రి పొంగులేటి



**తిరుమలాయపాలెం, అక్టోబర్ 12 (జనం సాక్షి) :** మండల పరిధిలోని సుబ్లేడు గ్రామంలో నూతనంగా నిర్మించిన వీవో ఏ బిల్డింగ్‌ను ఆదివారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, గ్రామ వీవోఏ మెట్టు స్వరూప రాణి చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని, చిరు వ్యాపారులకు తక్కువ వడ్డీకి రుణాలు అందించడంతో పాటు మహిళలకు పావలా వడ్డీ సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణం, సబ్సిడీ గ్యాస్ వంటి పథకాలతో మహిళల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు.రానున్న రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందని, రైతులు యాసంగి పంటల సాగుపై ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు. నీటిని పొదుపుగా వినియోగిస్తూ అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో ఆర్ అండ్ బి ఎస్ఈ యుగంధర్ రావు, పిఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, డీఆర్డీవో శ్రీరామ్, హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, ఎంపీడీవో సిలార్ సాహెబ్, సీతారాం రెడ్డి సర్పంచ్ సంఘ బత్తుల స్వాతి సుమన్ రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు గ్రామ సహాయం నరేష్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ఎంపీపీ కొప్పుల అశోక్, మండల పార్టీ ఉపాధ్యక్షులు సామ శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ బోడ మంగిలాల్, మద్దులపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ నంద్యాల శ్యాం సుందర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి బెల్లం శ్రీనివాస్, ఏపిఎం సత్యనారాయణ రాజు, సీసీలు లక్ష్మీ రాం బాయ్ మ్మ కొట్య, ప్రభాకర్, వెంకన్న, రాములమ్మ, అకౌంటెంట్ శేఖర్, వివో ఏలు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కట్కూరి శ్రీనివాస్ రెడ్డి మోరపాక నాగయ్య నంది పాటి మల్లికార్జున్ వనవాసం నరేందర్ రెడ్డి వోరా వెంకటేశ్వర్లు గండు చంద్రయ్య వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసేవే పోలీసుల ప్రధాన లక్ష్యం

- డీజీపీ సీవీ ఆనంద్

రాజేంద్రనగర్, అక్టోబర్ 12 (జనం సాక్షి) : ప్రజల కన్నీళ్లు తుడిచి, వారికి న్యాయం చేయడం పోలీసుల బాధ్యతని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ అన్నారు. తెలంగాణ పోలీస్ అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకున్న 112 మంది డీఎస్పీల పాసింగ్ అవుట్ పరేడ్‌లో ఆయన మాట్లాడారు. పోలీసు యూనిఫాం ధరించడం గొప్ప అదృష్టమని, కుల, మత, రాజకీయ రాగద్వేషాలకు అతీతంగా నిజాయతీతో విధులు నిర్వహించాలని సూచించారు. నాయకత్వ లక్షణాలు, నైతిక విలువలు, నిష్పాక్షికత, బృంద స్ఫూర్తి, సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రతి అధికారి అలవర్చుకోవాలన్నారు. సైబర్ నేరాలు, వ్యవస్థీకృత నేరాలు వంటి కొత్త సవాళ్లకు అనుగుణంగా పోలీసింగ్ విధానాలను మార్చుకోవాలని పేర్కొన్నారు. విధుల్లో శారీరక దారుఢ్యం, చురుకుదనం, క్రమశిక్షణను ఉద్యోగ విరమణ వరకు కొనసాగించాలని సూచించారు. పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ మాట్లాడుతూ, శిక్షణ పొందిన 112 మంది డీఎస్పీల్లో 74 మంది పురుషులు, 38 మంది మహిళలు ఉన్నారని తెలిపారు. శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నేహా అగర్వాల్ సీఎం రివాల్వర్‌తో పాటు పలు పురస్కారాలు అందుకున్నారు. కార్యక్రమంలో పోలీసు ఉన్నతాధికారులు, అకాడమీ సిబ్బంది, డీఎస్పీల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి



**సూర్యాపేట, అక్టోబర్ 12 (జనంసాక్షి) :** ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా రెవెన్యూ అధికారి ప్రేమ్ రాజ్ అన్నారు.సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం జరిగే ప్రజావాణికి జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని అన్నారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా, మండల స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని తెలిపారు.కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు.ముఖ్యంగా రాష్ట్ర ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని తెలిపారు.ప్రతి అధికారి తమ లాగిన్ లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అన్నారు. ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.మండల స్థాయిలో ప్రారంభమైన ప్రజావాణికి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని అన్నారు.మండల స్థాయి సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని పేర్కొన్నారు.వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 86 దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శిరీష, డిఆర్డిఓ పిడి సన్యాసయ్య, డిఎంహెచ్వో డాక్టర్ వెంకటరమణ, డిఏఓ శ్రీధర్ రెడ్డి, జిల్లా స్పోర్ట్స్ అండ్ యూత్ వెల్ఫేర్ అధికారి వెంకటరెడ్డి, మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి , జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఫోర్జరీ సంతకాలతో ఆక్రమణకు యత్నం

- ఫోర్జరీ సంతకంపై ప్రజావాణిలో భార్గవ్ ఫిర్యాదు
- ఫోర్జరీ సంతకాలు చేశారని తేల్చి చెప్పిన పంచాయతీ కార్యదర్శి
- సివిల్ పంచాయతీలలో వేలు పెట్టిన పోలీస్ శాఖ
- భూ వివాదంలో పోలీసుల జోక్యంపై సర్వత్ర విమర్శలు
- లబోదిబోమంటున్న అసలైన పట్టాదారులు...

**కొత్తగూడెం క్రైమ్, అక్టోబర్ 12 (జనం సాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం బసవతారక కాలనీ గ్రామపంచాయతీ పరిధిలో భూ వివాదం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అసలు సర్వే నంబర్ 62/70/2 కాగా, సంబంధిత భూమి విషయంలో 61/62/3 సర్వే నంబర్‌ను చూపిస్తున్నారని, ఫోర్జరీ సంతకాలతో భూమిని ఆక్రమించేందుకు




ప్రయత్నిస్తున్నారని బానోతు భార్గవ నాయక్ (తండ్రి బద్రు నాయక్) ఆరోపిస్తున్నారు.

తహసీల్దార్ స్థాయిలో తమకు అనుకూలంగా న్యాయం జరిగినప్పటికీ, భూమి స్వాధీనంలోకి వెళ్లే ప్రయత్నంలో రూరల్ పోలీసుల నుంచి ఇబ్బందులు ఎదురవుతున్నాయని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సివిల్ వివాదంలో పోలీసుల జోక్యం ఎందుకని ప్రశ్నిస్తూ, ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని కోరుతున్నారు.

ఇదే వ్యవహారంలో సర్వే నంబర్ల మార్పులు, ఫోర్జరీ సంతకాల ఆరోపణలపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని బాధితుడు డిమాండ్ చేస్తున్నారు. పంచాయతీ రికార్డులు, రెవెన్యూ పత్రాలు, అసలు పట్టాదారు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

మరోవైపు, ఈ భూమికి సంబంధించిన పౌల్ట్రీ, బ్రిక్స్ ఫ్యాక్టరీల విద్యుత్ వినియోగం, బిల్లులు, గతంలో విధించిన జరిమానాల అంశాలను కూడా పరిశీలించాలని బాధితులు కోరుతున్నారు.

అసలు సర్వే నంబర్ ఏది? మార్పులు జరిగితే వాటికి ఆధారాలేమిటి? ఫోర్జరీ సంతకాల ఆరోపణల్లో వాస్తవమెంత? సివిల్ వివాదంలో పోలీసుల జోక్యం నిబంధనలకు అనుగుణంగానే జరిగిందా? అనే ప్రశ్నలకు సంబంధిత శాఖల విచారణతోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

భూమికి సంబంధించిన అసలు పత్రాలు, సర్వే రికార్డులు, ఫోర్జరీ ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను పరిశీలించి, నిష్పక్షపాతంగా విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని బానోతు భార్గవ నాయక్ అధికారులను కోరుతున్నారు.

## ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

**అమీన్పూర్, అక్టోబర్ 12 (జనం సాక్షి) :** ప్రజా సమస్యలపై అధికారులు ఎప్పటికప్పుడు స్పందించి సమస్యలను పరిష్కరించాలని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజన పేర్కొన్నారు. సోమవారం అమీన్పూర్ సర్కిల్ పరిధిలోని బీరంగూడ లో ఆమె పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. ప్రజా సమస్యలపై ఫిర్యాదులు వస్తే వెంటనే స్పందించి అక్కడ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అమీన్పూర్ పరిధిలో జరుగు తున్న నిర్మాణాలు సక్రమంగా ఉండేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీలో సమస్యలపై అమీన్పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి వినతి పత్రం అందజేశారు. కాలనీలో సమస్యలపై అధికారులు స్పందిస్తారని ఆమె శశిధర్ రెడ్డికి హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో అమీన్పూర్ సర్కిల్ కమిషనర్ ప్రదీప్ కుమార్, డి ఈ ఈ వెంకటరమణ, అధికారులు స్థానిక నాయకులు ఉన్నారు.



జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
13.10.2026



## 14న గోదావరిఖనిలో కేటీఆర్ పర్యటన..

### భారీ సభకు ఏర్పాట్లు షురూ..

**గోదావరిఖని, జనంసాక్షి :**
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్మిక సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి, తెలంగాణ గుండెకాయ లాంటి సింగరేణి సంస్థను నిర్వీర్యం చేస్తోందని బీఆర్ఎస్ పార్టీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. కార్మికుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వ మోసపూరిత విధానాలను ఎండగట్టేందుకు ఈనెల 14వ తేదీన గోదావరిఖని సింగరేణి స్టేడియం వేదికగా 'సింగరేణి కార్మిక గర్జన' పేరుతో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు పార్టీ నేతలు ప్రకటించారు. ఇందులో భాగంగా సోమవారం సింగరేణి స్టేడియంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బాల్క సుమన్, కోరుకంటి చందర్ పార్టీ ముఖ్య నేతలు కొబ్బరికాయ కొట్టి సభా ఏర్పాట్లను లాంఛనంగా ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, కోరుకంటి చందర్, బీఆర్ఎస్ కార్మిక సంఘం నాయకులు మిరియాల రాజారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనపై మండిపడ్డారు. గత ఎన్నికల్లో ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలను దారుణంగా మోసం చేసిందని బాల్క సుమన్ ఆరోపించారు. కేసీఆర్ హయాంలో సింగరేణి కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తే, నేడు కొత్త మైనింగ్ తెవకపోగా వేల కోట్ల రూపాయల అవినీతితో సంస్థను కుదేలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ సింగరేణి గడ్డపై సింహ గర్జన చేసి కార్మికులకు అండగా నిలిచారని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ గుర్తుచేశారు. కార్మికుల పొట్టకొడుతున్న పాలకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించేందుకే కేటీఆర్ ఈ సభకు వస్తున్నారని, బకాయిలు రాక, ఉత్పత్తి పడిపోయి, వైద్యం, సొంత ఇంటి పథకం వంటి సౌకర్యా లు అందక సింగరేణి సంస్థ రాతియుగంలోకి నెట్టబడిం దని టీబీజీకేఎస్ నాయకులు మిరియాల రాజా రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల హక్కులను, సంస్థను కాపాడుకోవడం కోసం ఈనెల 14న సాయంత్రం 5 గంటలకు జరిగే ఈ బహిరంగ సభకు కార్మికులు, వారి కుటుంబాలు, యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

## 'ప్రత్యామ్నాయ' సాగుతో అధిక ఆదాయం

- నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- రైతు నేస్తం కార్యక్రమంలో రైతులకు అవగాహన.. పంటల వైవిధ్యంతో లాభాలు



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 12 (జనంసాక్షి):** వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం, భూగర్భ జలమట్టాల తగ్గుదల నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకుంటూ, సమగ్ర వ్యవసాయ విధానాలు, సహజ వ్యవసాయ పద్ధతులను అనుసరించడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు. రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు రైతు నేస్తం కార్యక్రమంలో రైతులకు దిశానిర్దేశం చేస్తూ, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. వరి సాగుకు బదులుగా చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయల సాగును ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.

**72 రైతు వేదికల్లో 5 వేల మంది రైతులతో సమావేశాలు**

చిన్నమల్లారెడ్డి రైతు వేదికలో నిర్వహించిన రైతుల సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని 72 రైతు వేదికల్లో నిర్వహించిన సమావేశాల్లో సుమారు 5 వేల మంది రైతులు, 200 మంది ప్రజాప్రతినిధులు, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నట్లు తెలిపారు. పంటల సాగు, నీటి సంరక్షణ, ప్రత్యామ్నాయ పంటల ఎంపికపై చర్చించినట్లు పేర్కొన్నారు. గత ఏడాదితో పోలిస్తే జిల్లాలో భూగర్భ జలమట్టాలు సగటున నాలుగు మీటర్ల మేర తగ్గాయని, ఈ పరిస్థితుల్లో నీటి వినియోగంపై రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధిక నీరు అవసరమయ్యే వరికి బదులుగా కంది, పెసర, మినుములు, శనగలు, వేరుశనగ, పొద్దుతిరుగుడు, జొన్న, మొక్కజొన్న వంటి పంటలను నేల స్వభావం, స్థానిక పరిస్థితులు, నీటి లభ్యత ఆధారంగా సాగు చేయాలని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకుని ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలని కోరారు.

**పంటల వైవిధ్యంతో రైతు శ్రీకాంత్‌కు అదనపు ఆదాయం**

సమగ్ర వ్యవసాయ విధానాలు, పంటల వైవిధ్యంతో తక్కువ భూమిలోనూ అధిక ఆదాయం పొందవచ్చని రైతు శ్రీకాంత్ తన అనుభవంతో నిరూపిస్తున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. మూడు ఎకరాల భూమిలో పసుపు, ఉల్లిగడ్డ, కూరగాయలు, పెసర్లు, డ్రాగన్ ఫ్రూట్ వంటి పంటలను సాగు చేస్తూ రసాయన ఎరువులు, యూరియా వినియోగాన్ని తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నారని వివరించారు. వర్షపు నీటిని నిల్వ చేసుకునేందుకు పొలంలో నీటి కుంటను ఏర్పాటు చేసుకోవడంతో పాటు, నేల సారాన్ని పెంచేందుకు పెసర్లను పచ్చిరొట్ట ఎరువుగా వినియోగిస్తున్నారని తెలిపారు. పందిరి విధానం ద్వారా తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ పంటలు సాగు చేస్తూ అందుబాటులో ఉన్న భూమిని సమర్థవంతంగా ఉపయోగించుకుంటున్నారని చెప్పారు. అర ఎకరంలో సాగు చేస్తున్న డ్రాగన్ ఫ్రూట్ ద్వారా మొదటి ఏడాది రూ. 1.50 లక్షలు, రెండో ఏడాది రూ. 3 లక్షలు, మూడో ఏడాది నుంచి సుమారు రూ. 5 లక్షల వరకు ఆదాయం పొందుతున్నట్లు రైతు శ్రీకాంత్ వెల్లడించారు. పంటల వైవిధ్యం, సహజ వనరుల సంరక్షణ రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనాలను అందిస్తాయని కలెక్టర్ తెలిపారు.

**పామాయిల్‌తో పాటు అంతర పంటల సాగు**

గాంధారి మండలం గుడిమెట్ గ్రామానికి చెందిన ఓ రైతు పామాయిల్ సాగుతో పాటు అంతర పంటలు సాగు చేస్తూ అదనపు ఆదాయం పొందుతున్నారని కలెక్టర్ వివరించారు. గతంలో 15 ఎకరాల్లో సోయాబీన్, మొక్కజొన్న, వరి సాగు చేసిన సదరు రైతు, వరి సాగును తగ్గించి 2023 జూన్‌లో పామాయిల్ సాగు ప్రారంభించినట్లు తెలిపారు. పామాయిల్ తోటలో మొదటి ఏడాది పత్తి, మునగ, రెండో ఏడాది మునగ, కంది పంటలను అంతర పంటలుగా సాగు చేశారు. ప్రస్తుతం మూడో ఏడాది ఉద్యానవన శాఖ ద్వారా పొందిన బంతిపూల మొక్కలను సాగు చేస్తున్నారు. మొదటి కోతలో మూడు క్వింటాళ్ల వరకు పామాయిల్ దిగుబడి వచ్చిందని, పంట విక్రయించిన మూడు నుంచి నాలుగు రోజుల్లోనే డబ్బులు ఖాతాలో జమ కావడం సంతృప్తినిచ్చిందని రైతు తెలిపినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. నీటి వసతి తగ్గడంతో గతంలో నాలుగు నుంచి ఐదు ఎకరాల్లో సాగు చేసిన వరిని ప్రస్తుతం ఇంటి సమీపంలోని ఒక ఎకరానికే పరిమితం చేసినట్లు రైతు వివరించారు. రానున్న యాసంగి సీజన్‌లో ఆ ఎకరంలోనూ వరికి బదులుగా మునగ సాగు చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

**నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి**

రైతులు నీటి లభ్యతను ముందుగానే అంచనా వేసుకుని పంటల ఎంపికలో మార్పులు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. పామాయిల్ వంటి దీర్ఘకాలిక పంటలతో పాటు అనువైన అంతర పంటలు సాగు చేయడం ద్వారా అదనపు ఆదాయం పొందే అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు నీటి సంరక్షణ, నేల ఆరోగ్య పరిరక్షణ, పంటల వైవిధ్యం, సహజ వ్యవసాయ పద్ధతులకు ప్రాధాన్యత ఇవ్వాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బీమాయాల లక్ష్మి, కామారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ధర్మగోని లక్ష్మి, వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి, ఉద్యానవన శాఖ అధికారిణి జ్యోతి, తహసీల్దార్ హిమబిందు, డీఆర్‌డీవో దామోదర్ రెడ్డి, రైతులు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

## వ్యయాలను ఏఐ వైపు మళ్లిస్తున్న కంపెనీలు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**
కృత్రిమమేధ వల్ల ఐటీ సెక్టార్ తీవ్రంగా ప్రభావితమవుతోందని ఆందోళనలు వ్యక్తమవుతున్న తరుణంలో టీసీఎస్ సీఈఓ కృతివాసన్ కీలక వ్యాఖ్యలు చేశారు. టెక్ సంస్థలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నూతన సాంకేతిక సేవలపై భారీగా నిధులు వెచ్చిస్తున్నాయన్నారు. దీంతో సంప్రదాయ ఐటీ సేవల వృద్ధి తగ్గుముఖం పట్టనుందని పేర్కొన్నారు. ఈ చర్యలు టీసీఎస్ వృద్ధి నమూనాలోనూ ఒక నిర్మాణాత్మక మార్పుకు సంకేతమన్నారు. అయితే టెక్ సంస్థల్లో సాంప్రదాయ సేవలు తగ్గుముఖం పట్టినప్పటికీ.. ఏఐ, ఇతర నూతన సేవల ద్వారా ఆ క్షీణతను భర్తీ చేయవచ్చన్నారు. ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, సుంకాలు, స్థూల ఆర్థిక అనిశ్చితి ఉన్నప్పటికీ.. సాంకేతికతపై పెట్టుబడులు పెట్టడానికి టెక్ సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయన్నారు. ద్రవ్యోల్బణం, పెరుగుతున్న ఖర్చుల వల్ల కొన్ని రంగాలు ఒత్తిడి ఎదుర్కొంటున్నప్పటికీ కృత్రిమ మేధ (ఏఐ) విషయంలో మాత్రం వెనక్కి తగ్గట్లేదని కృతివాసన్ పేర్కొన్నారు. గత ఆరు నెలలుగా, వినియోగదారులు కూడా స్థూల ఆర్థిక అనిశ్చితి గురించి తక్కువగా.. ఏఐ అందించే అవకాశాల గురించి ఎక్కువగా మాట్లాడుతున్నారని అన్నారు. మరోవైపు ఏఐ ద్వారా శ్రామిక శక్తిపై ప్రతికూల ప్రభావం పడుతుందనే వాదనలను టీసీఎస్ సీఓఓ ఆర్తి సుబ్రమణియన్ తప్పుబట్టారు. కృత్రిమ మేధ ఉద్యోగాల సామర్థ్యాన్ని తగ్గించే శక్తిగా కాకుండా, వారు మరింత సమర్థంగా పని చేసే సాధనంగా ఉపయోగపడుతోందని పేర్కొన్నారు. ఉద్యోగుల సంఖ్యను తగ్గించడానికి బదులుగా.. వారిని కొత్త కస్టమర్ ప్రాజెక్టులను దక్కించుకోవడానికి మళ్లించాలని టీసీఎస్ భావిస్తోందన్నారు. టీసీఎస్ వార్షిక ఏఐ ఆదాయం 3 బిలియన్ డాలర్లను దాటి.. దాని వ్యాపారంలో పదో వంతు కంటే ఎక్కువ వాటాను సాధించిన వేళ సంస్థ అధినేతలు ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.
వారి నియామకానికే మొగ్గు..
ఇకపై టీసీఎస్ నియమించుకునే కొత్త ఉద్యోగులలో 80శాతం వరకు డిజిటల్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నైపుణ్యాలు (ఏఐ బనితిశ్రీశ్రీబ) కలిగిన వారే ఉంటారని ఆర్తి సుబ్రమణియన్ పేర్కొన్నారు. ఇందుకోసం మార్కెట్లో కావలసినంతమంది ప్రతిభావంతులు అందుబాటులో ఉన్నారని తెలిపారు. ఫ్రెషర్లు మాత్రమే కాకుండా.. కొత్త విషయాలు నేర్చుకోవడానికి సిద్ధంగా ఉండే ఉద్యోగులకు కూడా ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 'ప్రత్యేక ప్రతిభ'పై భవిష్యత్తులోనూ పెట్టుబడులు పెట్టడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.



## రిటెయిల్ ద్రవ్యోల్బణం పైకి..

### సెప్టెంబర్‌లో 5.54%

న్యూఢిల్లీ(జనంసాక్షి): దేశీయంగా రిటెయిల్ ద్రవ్యోల్బణం పెరిగింది. ఈ ఏడాది సెప్టెంబరులో 5.54 శాతానికి చేరిందని ప్రభుత్వ గణాంకాలు వెల్లడించాయి. అంతకుముందు ఆగస్టు నెలలో వినియోగదారు ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 4.83 శాతంగా ఉంది. ఆహార పదార్థాల ధరలు పెరగడం ద్రవ్యోల్బణం పెరుగుదల కారణమని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి ద్రవ్యోల్బణ గణాంకాలకు కొత్త విధానాన్ని కేంద్రం అనుసరిస్తోంది. ఈ సిరీస్ విడుదల తర్వాత ఈ స్థాయిలో ద్రవ్యోల్బణం నమోదు కావడం ఇదే తొలిసారి. ఆగస్టులో ఫుడ్ బాస్కెట్ ద్రవ్యోల్బణం 5.97% ఉండగా.. సెప్టెంబర్ నెలలో 7.74 శాతానికి చేరింది. ద్రవ్యోల్బణ ఆందోళనల నేపథ్యంలోనే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గత వారం రెపోరేటును 25 బేసిస్ పాయింట్లు పెంచి 5.50 శాతానికి చేర్చిన సంగతి తెలిసిందే. అయితే, ఆర్‌బీఐ నిర్దేశించుకున్న లక్షిత స్థాయి (2-6 శాతం)లోనే ఉండడం ఊరట కల్పించే అంశం.

## బ్యాంకుల వద్ద పటిష్టమైన భద్రత

- ప్రతి బ్యాంకు, ఏటీఎం వద్ద సెక్యూరిటీ గార్డు..
- సీసీ కెమెరాలు, అలారం సిస్టమ్ తప్పనిసరి..
- సీపీ అంబర్ కిషోర్ ఝా..



**గోదావరిఖని, జనంసాక్షి :**
బ్యాంకు అధికారులు, సిబ్బంది పోలీస్ అధికారులతో సమన్వయంతో పనిచేస్తే బ్యాంకులు, ఏటీఎంల వద్ద జరిగే నేరాలను సమర్థవంతంగా నియంత్రించవచ్చని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. సోమవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్ల ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, వివిధ బ్యాంకుల అధికారులతో బ్యాంకులు, ఏటీఎంల భద్రతా ప్రమాణాలపై పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీసీ కెమెరాల ఏర్పాటు, ఆర్థిక నేరాల నివారణ, గతంలో జరిగిన బ్యాంకు, ఏటీఎం సంబంధిత నేరాలు, భవిష్యత్‌లో తీసుకోవాల్సిన భద్రతా చర్యలు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి జోన్‌లో 109 బ్యాంకులు, 79 ఏటీఎం కేంద్రాలు, మంచిర్యాల జోన్‌లో 109 బ్యాంకులు, 89 ఏటీఎం కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. ప్రతి బ్యాంకు, ఏటీఎం వద్ద భద్రతా ప్రమాణాలను పాటించాలని ఆదేశించారు.

**ప్రతి బ్యాంకు, ఏటీఎం వద్ద భద్రత తప్పనిసరి..**

ప్రతి ఏటీఎం కేంద్రంలో 24 గంటలూ సెక్యూరిటీ గార్డు, నాణ్యమైన సీసీ కెమెరాలు, అలారం సిస్టమ్ ఏర్పాటు చేసుకోవాలని సీపీ సూచించారు. పోలీస్ శాఖ నిర్వహించిన భద్రతా ఆడిట్‌లో కొన్ని బ్యాంకులు, ఏటీఎంలలో నాణ్యత లేని సీసీ కెమెరాలు ఉండటం, కొన్ని చోట్ల సెక్యూరిటీ గార్డులు లేకపోవడం గుర్తించినట్లు తెలిపారు. అందువల్ల అన్ని బ్యాంకులు, ఏటీఎంలలో నాణ్యమైన సీసీ కెమెరాలు, అలారం సిస్టమ్‌లను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. దోపిడీ లేదా ఇతర అత్యవసర పరిస్థితుల్లో సిబ్బంది ఎలా స్పందించాలనే అంశంపై బ్యాంకు ఉద్యోగులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. బ్యాంకు ప్రవేశ ద్వారం వద్ద డి ఎఫ్ ఎండి (ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్ ) ఏర్పాటు చేయడంతో పాటు సెక్యూరిటీ గార్డులకు హెచ్ హెచ్ ఎం డి (హైడ్ మెటల్ డిటెక్టర్) అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. సెక్యూరిటీ గార్డులను బ్యాంకు లేదా సెక్యూరిటీ ఏజెన్సీ నియమించినప్పటికీ, వారి పూర్తి వ్యక్తిగత వివరాలు, ఫోటోతో సహా బ్యాంకు వద్ద రికార్డుగా ఉంచాలని సూచించారు. కొత్తగా లేదా తాత్కాలికంగా నియమితులైన సెక్యూరిటీ సిబ్బంది విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

**ఏటీఎంలలో నగదు నింపే సమయంలో పోలీసులకు సమాచారం ఇవ్వాలి..**

ఏటీఎంలలో నగదు నింపే సమయంలో స్థానిక పోలీసులకు ముందస్తుగా సమాచారం అందించాలని సీపీ తెలిపారు. తద్వారా ఆయా ప్రాంతాల్లోని బ్లూకోట్స్, పెట్రో కార్ సిబ్బందిని అప్రమత్తం చేయడం ద్వారా భద్రతను మరింత పటిష్టం చేయవచ్చన్నారు. ప్రతి బ్యాంకు అధికారి, సిబ్బందికి తమ పరిధిలోని పోలీస్ స్టేషన్ అధికారుల ఫోన్ నంబర్లు తప్పనిసరిగా తెలిసి ఉండాలని సూచించారు. హెల్ప్‌లైన్, పోలీస్ స్టేషన్ సంప్రదింపు నంబర్లను స్పష్టంగా కనిపించే విధంగా బ్యాంకులో ప్రముఖ ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గతంలో ఏటీఎంలను సెలవు రోజులు, తెల్లవారుజామున లక్ష్యంగా చేసుకున్న ఘటనలు, అలాగే బ్యాంకులను ప్రారంభించే సమయంలో, మూసివేసే సమయంలో, భోజన విరామ సమయంలో నేరాలకు పాల్పడిన ఘటనలు ఉన్నాయని సీపీ తెలిపారు. ఈ సమయాల్లో సెక్యూరిటీ గార్డులతో పాటు బ్యాంకు సిబ్బంది కూడా మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏదైనా అనుమానాస్పద లేదా ప్రమాదకర పరిస్థితి ఎదురైతే వెంటనే డయల్ 112 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. బ్యాంకు పని వేళల్లో సెక్యూరిటీ గార్డులు లోపల కూర్చోకుండా ప్రధాన ద్వారం వద్ద అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, పని వేళలు ముగిసిన అనంతరం బ్యాంకు తలుపులు పూర్తిగా మూసివేసిన తర్వాత మాత్రమే సిబ్బంది బయటకు వెళ్లాలని సూచించారు.

**సీసీ కెమెరాలు, డీవీఆర్‌ల భద్రతపై ప్రత్యేక దృష్టి..**

నేరాలకు పాల్పడే వ్యక్తులు సీసీ కెమెరాలపై స్ప్రే చేసి వాటిని పనిచేయకుండా చేయడం, డీవీఆర్‌లను దొంగిలించడం లేదా ధ్వంసం చేయడం వంటి చర్యలకు పాల్పడే అవకాశం ఉన్నందున, డీవీఆర్‌లను బహిరంగంగా కనిపించకుండా సురక్షితమైన రహస్య ప్రదేశంలో ఏర్పాటు చేయాలని సీపీ సూచించారు. బ్యాంకు లోపల, బయట పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలు, వారి ప్రవర్తనను సెక్యూరిటీ గార్డులు నిరంతరం గమనించాలని ఆదేశించారు. అటెన్షన్ డైవర్షన్ గ్యాంగ్‌లకు సంబంధించిన వ్యక్తులను గుర్తించేలా సెక్యూరిటీ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్, రామగుండం సీఐ కృష్ణ కుమార్, మంచిర్యాల టౌన్ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్ రావు, గోదావరిఖని 1 టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సీసీఎస్ ఎస్ఐలు, వివిధ బ్యాంకుల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 13 కోట్ల ఓట్ల తొలగింపు ప్రజాస్వామ్య హక్కులకు విఘాతం..

### రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాగూర్..



**అంతర్గాం, జనంసాక్షి:**
ఏఐసీసీ పిలుపు మేరకు ఢిల్లీలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఆందోళనఏఐసీసీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటంలో భాగంగా రామగుండం నియోజకవర్గ శాసన సభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాగూర్ ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ× దేశంలో 13 కోట్ల ఓట్లను తొలగించారనే అంశంపై ఆందోళన వ్యక్తం చేస్తూ, ఓటు హక్కు పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని, అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఓటు హక్కును కాపాడటం, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడం లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పోరాటాన్ని కొనసాగిస్తుందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ఓటర్ల హక్కులకు రక్షణ కల్పించడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. "మన ఓటు మన హక్కు, ప్రజాస్వామ్యం మన బలం" అనే నినాదంతో ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఓటు హక్కు పరిరక్షణే లక్ష్యంగా ప్రజాస్వామ్య విలువల కోసం కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాగూర్ స్పష్టం చేశారు.

## ఐటీ, ఎఫ్ఎంసీజీ స్టాక్స్‌లో అమ్మకాలు..

### సెన్సెక్స్ 548 పాయింట్లు పతనం

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాలతో ముగిశాయి. ఉదయం లాభాల్లో ప్రారంభమైన సూచీలు.. కాసేపటికే నష్టాల్లోకి జారుకున్నాయి. ఇంట్రాడే గరిష్ఠాల నుంచి సెన్సెక్స్ ఓ దశలో 1200 పాయింట్లు క్షీణించింది. ముఖ్యంగా ఎఫ్ఎంసీజీ, ఐటీ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి సూచీలపై ప్రభావం చూపింది. పీఎస్‌యూ బ్యాంక్స్, ఆయిల్ అండ్ గ్యాస్ షేర్లూ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. సెన్సెక్స్ ఉదయం 72,771.32 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 72,472.33) వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఆరంభంలో కాసేపు లాభాల్లో కదలాడిన సూచీ.. ఇంట్రాడేలో 72,884.25 వద్ద గరిష్ఠాన్ని తాకింది. ఆపై నష్టాల్లోకి జారుకుని 71,676.10 కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 547.65 పాయింట్ల నష్టంతో 71,924.68 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 157.10 పాయింట్ల నష్టంతో 22,363.35 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.75గా ఉంది. సెన్సెక్స్30 సూచీలో ఐటీసీ, టెక్ మహీంద్రా, హిందుస్థాన్ యూనిలీవర్, ఎల్అండ్‌టీ, ఎస్‌బీఐ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. బీఈఎల్, మహీంద్రా అండ్ మహీంద్రా, కోటక్ మహీంద్రా బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు లాభపడ్డాయి.

## ఈక్విటీ ఫండ్స్‌లోకి కొనసాగిన పెట్టుబడులు.. స్మాల్‌క్యాప్స్‌లోకే అధికం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**
ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లోకి సెప్టెంబరులోనూ నిధుల ప్రవాహం కొనసాగింది. అదే సమయంలో డెట్ మ్యూచువల్ ఫండ్స్ నుంచి రికార్డు స్థాయిలో నిధులు బయటికెళ్లాయి. ఈ మేరకు సెప్టెంబరు నెలకు సంబంధించిన గణాంకాలను మ్యూచువల్ ఫండ్స్ అసోసియేషన్- యాంఫీ సోమవారం వెల్లడించింది. యాంఫీ గణాంకాల ప్రకారం.. సెప్టెంబర్ నెలలో ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్స్ స్కీముల్లోకి రూ. 38,306.55 కోట్లు నిధులు వచ్చాయి. ఆగస్టు నెలతో (రూ. 29,328.62 కోట్లు) పోలిస్తే 31 శాతం వృద్ధి నమోదైంది. అదే సయమంలో డెట్ మ్యూచువల్



ఫండ్స్ నుంచి ఏకంగా రూ. 1.83 లక్షల కోట్లు తరలిపోయాయి. ఆగస్టు నెలలో ఈ మొత్తం రూ. 8127.32 కోట్లుగా ఉంది. దీంతో నికరంగా సెప్టెంబర్‌లో మ్యూచువల్ ఫండ్స్ నుంచి రూ. 1,33,214.25 కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. ఆగస్టులో ఈ మొత్తం రూ. 41,368.05 కోట్లుగా ఉంది.

**స్మాల్‌క్యాప్స్‌లోకి అత్యధికంగా**

ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్స్‌లోని స్మాల్‌క్యాప్ ఫండ్స్ ఎక్కువ నిధులను ఆకర్షించాయి. వరుసగా మూడో నెలా స్మాల్‌క్యాప్ ఫండ్స్ మదుపర్లను ఆకర్షించాయి. ఆగస్టు నెలలో స్మాల్‌క్యాప్స్‌లోకి రూ. 7,973 కోట్ల పెట్టుబడులు రాగా.. సెప్టెంబర్‌లో ఈ మొత్తం రూ. 9038 కోట్లకు పెరిగింది. ఆ తర్వాతి స్థానంలో మిడ్‌క్యాప్ (రూ. 7834 కోట్లు), ఫ్లెక్సీక్యాప్ (రూ. 6701 కోట్లు) ఫండ్స్ ఉన్నాయి. లార్జ్‌క్యాప్ ఫండ్స్ నుంచి వరుసగా రెండో నెలా నిధులు (రూ. 859 కోట్లు) తరలిపోయాయి. సెప్టెంబరు నెలలో గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి రూ. 4,450 కోట్లు నిధులు రాగా.. సిల్వర్ ఈటీఎఫ్‌ల్లోకి రూ. 1974 కోట్లు నిధులు వచ్చినట్లు యాంఫీ వెల్లడించింది.

## 'ఎల్‌నినో' ప్రభావంపై అవగాహన



రైతు నేస్తం కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి(జనంసాక్షి):**
ఎల్ నినో నేపథ్యంలో రైతులకు వాస్తవ పరిస్థితులపై అవగాహన కల్పిస్తున్నామని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. రబీ పంటల ప్రణాళిక, పంటల మార్పిడి , అనువైన పంటల ఎంపిక, సాగు పద్ధతులు, పంటల యాజమాన్యం తదితర అంశాలపై ఆయా శాఖల అధికారులను సమన్వయపర్చి క్షేత్రస్థాయిలో రైతులు పంటల వైవిధ్యీకరణ అవలంభించేలా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పించేందుకు వీలుగా సోమవారం రాష్ట్ర ప్రభుత్వం అన్ని రైతు వేదికల ద్వారా రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించింది. ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, ఇతర వ్యవసాయ, ఉద్యానవన, వాతావరణ, విద్యుత్, భూగర్భజలాలు తదితర శాఖల అధికారులు, వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. నిజామాబాద్ జిల్లా బోధన్ డివిజన్ ఎడపల్లి మండల కేంద్రంలోని రైతు వేదిక నుండి కలెక్టర్ ఇలా త్రిపాఠి ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, అదనపు కలెక్టర్ భుజంగరావు తదితరులు కలెక్టర్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో యాసంగిలో వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు అధిక లాభాలు అందించే ఆయిల్ పామ్ పంట దిశగా రైతులను ప్రోత్సహిస్తున్నామని అన్నారు. ఎల్ నినో ప్రభావాన్ని అధిగమించేందుకు ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను సిద్ధం చేశామని అన్నారు. వ్యవసాయ ఉద్యానవన, విద్యుత్, నీటి పారుదల తదితర శాఖల అధికారులను సమన్వయం చేస్తూ, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై స్పష్టమైన దిశానిర్దేశం చేశామని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఎల్‌నినో పరిస్థితులపై రైతులను ముందుగానే అప్రమత్తం చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో సుమారు 15 లక్షల ఎకరాల మేర వరి సాగు విస్తీర్ణం తగ్గిందని పేర్కొన్నారు. సాగులో ఉన్న పంటలను కాపాడుకోవడంతో పాటు రబీలో పప్పుదినుసులు, నూనెగింజలు, తక్కువ కాలంలో చేతికొచ్చే పంటలను సాగు చేయాలని సూచించారు. రిజర్వాయర్లు, ప్రాజె క్టుల్లో అందుబాటులో ఉన్న నీటిని ప్రణాళికాబద్ధంగా వినియోగిం చుకోవాలని, తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నా రు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు, వాతావరణ శాఖ, వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఉద్యాన విశ్వవిద్యా లయం, పశుసంవర్ధక శాఖల అధికారులు ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఆయా శాఖల ద్వారా చేపట్టనున్న చర్యలను వివరించారు. బోధన్ ఆర్డీఓ విజయ కుమారి, జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి, జిల్లా ఉద్యానశాఖ అధికారి శ్రీనివాస్ రావు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
13 అక్టోబర్ 2026




# గుడిసెకు 5వేలు అద్దె

## నివాసం ఉండడానికి అద్దె భవనాలు దొరక్క..
## పొలాల వద్ద గుడిసెల్లో వలస కార్మికుల నివాసం

- పరిశ్రమలతో నిండిపోయిన గ్రామం
- ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలు

**కేజీఎఫ్ సినిమాను తలపిస్తున్న ఎలికట్ట**



*ఒకప్పుడు పచ్చటి పంట పొలాలతో కళకళలాడిన ఎలికట్ట.. నేడు కాలుష్యకారక పరిశ్రమల కబంధ హస్తాల్లో చిక్కి ఉక్కిరిబిక్కిరవుతోంది. పచ్చదనం కనుమరుగై, పరిశ్రమల పొగతో ప్రజలు రోగాల బారిన పడుతుండగా.. కలుషిత నీరు, గడ్డి మూగజీవాల ప్రాణాలను బలిగొంటున్నాయి. మరోవైపు పరిశ్రమల్లో పనిచేసేందుకు ఇతర రాష్ట్రాల నుంచి వేలాదిగా తరలివస్తున్న కార్మికులకు నిలువ నీడ కరువైంది. అద్దె గదులు దొరక్క పొలాల్లోని గుడిసెలకే నెలకు రూ.5 వేలు చెల్లించాల్సిన దుస్థితి నెలకొంది. గ్రామాన్ని చుట్టుముట్టిన పరిశ్రమలు, రహదారులపై భారీ వాహనాల రాకపోకలతో ఎలికట్ట ప్రాంతం కేజీఎఫ్ సినిమాను తలపిస్తోంది. ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.*

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని ఫరూక్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామం ఒకప్పుడు పచ్చటి పంట పొలాలతో కనిపించేది. ఎలాంటి కాలుష్యం లేకుండా బతికినంతకాలం ఈ ప్రాంత ప్రజలు జీవనం సాగిస్తూ ఉండేవారు. ప్రస్తుతం ఆ పంటలు, ఆ ప్రకృతి మచ్చుకైనా కనిపించే పరిస్థితి లేదు. ఇప్పటికే వందలాది కాలుష్యకారక పరిశ్రమలు ఈ గ్రామాన్ని చుట్టుముట్టేశాయి. వంద లాది ఎకరాల్లో వందలాది పరిశ్రమలను ఏర్పాటు చేశారు బడా పారిశ్రామికవేత్తలు, పరిశ్రమల యాజమాన్యాలు. ఈ పరిశ్రమల వల్ల గ్రామస్తులు, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు కాలుష్యంతో పాటు శ్వాసకోశ, చర్మ సంబంధిత రకరకాల రోగాల బారిన పడి బతుకుతున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా పరిశ్రమలు గొట్టాల ద్వారా పొగను వదులుతున్నాయి. ఈ ప్రాంతంలో ఉన్న నీరు తాగిన మూగజీవులు, కాలుష్యపు గడ్డి తిన్న పశువులు మృత్యువాత పడుతున్నాయి. ఇదిలా ఉంటే కాలుష్యకారక పరిశ్రమలు రసాయన వ్యర్థ పదార్థాలను గ్రామానికి ఆనుకొని ఉన్న చెరువులోకి పంపడంతో ఆ నీటిని తాగిన మూగజీవులు మృత్యువాత పడుతున్నాయి. ఇక కాలుష్యంతో గ్రామ ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సంబంధిత శాఖల అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకున్న పాపాన పోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.





**పొలం దగ్గర ఉన్న గుడిసెకు ఐదువేలు అద్దె**

ఫరూక్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామ శివారులో వెలిసిన భారీ పరిశ్రమల్లో పనిచేసేందుకు పరిశ్రమల యాజమాన్యాలు ఇతర రాష్ట్రాలకు సంబంధించిన కూలీలను వేలాదిగా రంగంలోకి దించాయి. ఇతర రాష్ట్రాలకు చెందిన కూలీలు ఇక్కడికి పని నిమిత్తం వచ్చారు. జార్ఖండ్ రాష్ట్రానికి సంబంధించిన శివశంభు అనే డ్రైవర్ కార్మికుడు అదానీ పరిశ్రమలో టిప్పర్ డ్రైవర్‌గా వచ్చి ఈ గుడిసెలో నివాసం ఉంటున్నాడు. ఇలా ఎంతోమంది వలస కార్మికులు అద్దె భవనాలు దొరక్క పంట పొలాల్లో ఉన్న గుడిసెల్లో, రేకుల షెడ్లలో అద్దెకు ఉంటు న్నారు. దీంతో ఎలికట్ట గ్రామ శివారులో ఎక్కడ కూడా ఇతర రాష్ట్రాల కార్మికులు ఉండేందుకు రూములు అద్దెకు దొరక్కపోవడంతో పొలాల దగ్గర ఉన్న గుడిసెల్లో సైతం ఇతర రాష్ట్రాలకు చెందిన వలస కూలీలు ఉంటూ నెలకు ఐదు వేల రూపాయలు అద్దె చెల్లిస్తున్నారంటే ఎంత పెద్ద ఎత్తున ఇతర రాష్ట్రాల కార్మికులు పరిశ్రమల్లో దిగారో స్పష్టంగా అర్థమవుతుంది.

**అటువైపు.. ఇటువైపు పరిశ్రమలు.. మధ్యలో హైవే..**

అటువైపు ఇటువైపు పరిశ్రమలు.. మధ్యలో షాద్‌నగర్ నుంచి బీజాపూర్, బీదర్ వైపు వెళ్లే నేషనల్ హైవే. ఈ హైవేపై పెద్ద ఎత్తున వాహనాలు ప్రయాణిస్తుంటాయి. దీనికి తోడు ఎలికట్ట గ్రామం నుంచి మొగలిగిద్ద గ్రామం వరకు భారీ వాహనాలు ప్రయాణించడం, పెద్ద ఎత్తున పరిశ్రమలకు సంబంధించిన టిప్పర్లు, లారీలు నిబంధనలకు విరుద్ధంగా రోడ్లకు ఇరువైపులా నిలిపివేయడంతో ప్రమాదాలు చోటుచేసుకొని ఎంతోమంది వాహనదారులు మృత్యువాత పడుతున్నారు.



**నిబంధనలు పాటించని పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవాలి:**
*తిరుమలయ్య, పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి*

షాద్‌నగర్ ప్రాంతంలో ఇప్పటికే విచ్చలవిడిగా కాలుష్యకారక పరిశ్రమలు వెలిసి ఈ ప్రాంతం లో వ్యవసాయం లేకుండా చేస్తున్నాయి. ఈ కాలుష్యకారక పరిశ్రమలతో ఈ ప్రాంత ప్రజలు రకరకాల రోగాల బారిన పడి ఇబ్బందులకు గురవుతున్నారు. ఇలాంటి పరిశ్రమలపై సంబంధిత శాఖ అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. కాలుష్యకారక పరిశ్రమలకు అడ్డదిడ్డంగా అనుమతులు ఇవ్వొద్దని డిమాండ్ చేస్తున్నాం.



**ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దు:**
*బిజిలి సత్యం, యూటీఎఫ్ మండల అధ్యక్షులు*

పరిశ్రమల యాజమాన్యాలు పేద ప్రజల ప్రాణాలతో చెలగాటమా డొద్దని, ఇలాంటి కాలుష్యకారక పరిశ్రమలపై సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని, ఇలాంటి పరిశ్రమలకు అనుమ తులు ఇచ్చేముందు సంబంధిత శాఖ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి అనుమతులు ఇవ్వాలని, నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇవ్వొద్దని, నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న కాలుష్యకారక పరిశ్రమలపై సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం.



## కుబీర్‌లో ప్రారంభమైన పత్తి కొనుగోళ్లు

**కుబీర్, అక్టోబర్ 12, (జనంసాక్షి):** కుబీర్ మండల కేంద్రంలోని నాగేష్ ఇండస్ట్రీలో సోమవారం పత్తి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. స్థానిక సర్పంచ్ కందూర్ సాయినాథ్ కొనుగోళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్వింటాలు పత్తికి రూ.9,100 ధర చెల్లించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే ఎక్కువ ధర లభించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సంతోష్, బోయిడి విఠల్, బంక బాబు ఆయా గ్రామాల సర్పంచ్ తోకల మారుతి, రెడ్ శెట్టి సంతోష్, రెడ్ శెట్టి ఆనంద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## స్మశాన వాటికకు దారేది..?

- కేశంపేటలో ఎస్సీల స్మశాన వాటిక కబ్జా
- దహన సంస్కారాలకు నోచుకోని దళితులు

**రేవల్లి, అక్టోబర్ 12 (జనంసాక్షి) :** మండలంలోని కేశంపేట గ్రామంలో ఎస్సీల స్మశాన వాటిక వివాదం ముదిరింది. గ్రామంలో ఎస్సీ కాలనీకి చెందిన స్మశాన వాటికను అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కబ్జా చేశాడని, దీంతో తమ కుటుంబ సభ్యుల దహన సంస్కారాలు చేసుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆరోపిస్తూ గ్రామంలో గల డా. బీ ఆర్. అంబేద్కర్ విగ్రహం ముందు స్థానిక ఎస్సీ కాలనీ యువకులు ధర్నా నిర్వహించారు. గత వందల సంవత్సరాలుగా తమ పూర్వీకుల నుండి స్మశాన వాటికగా వాడుకుంటున్న స్థలాన్ని, గత 2,3 సంవత్సరాలుగా తన పేరు మీద పట్టా ఉందంటూ అడ్డుకుంటున్నారని, స్మశానానికి వెళ్లే దారిని కూడా ఇతరులకు రిజిస్ట్రేషన్ చేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. దీంతో చేసేది లేక స్థానిక యువకులు రేవల్లి మండల ఎమ్మార్వోకు ఫిర్యాదు చేశారు. స్మశాన వాటిక స్థలానికి ప్రత్యేక దారిని కేటాయించి, కబ్జా నుండి విడిపించి న్యాయం చేయాలని వినతి పత్రంలో కోరారు. వెంటనే అధికారులు స్పందించి తమ స్మశాన వాటికను పరిరక్షించాలని కేశంపేట ఎస్సీ కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

## ఎండిన పంటలకు పరిహారం చెల్లించాలి

- క్షేత్రస్థాయిలో పంట నష్టాలను పరిశీలించాలి
- రైతుబంధు, ఎరువుల కొరతపై బీఆర్ఎస్ నేతలు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, అంజయ్య యాదవ్ విమర్శ

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):** ఎండిపోతున్న పంటలను పరిశీలించి నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వర్షాల కొరత, ఎల్‌నినో ప్రభావం, విద్యుత్ కోతలు, ఎరువుల కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండల కేంద్రంలోని జి.ఎం. పటేల్ మినీ గార్డెన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. పంటలు ఎండిపోతున్నా రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. తెలంగాణ నదీ జలాలను ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తున్నారంటూ ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్ అరెస్టు విషయంలోనూ పోలీసుల తీరును విమర్శించారు. పార్టీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఎండిపోయిన పంటలను పరిశీలించాలని కోరారు. పంట నష్టాలపై నివేదికలు రూపొందించి, బాధిత రైతులకు తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రైతుబంధు అమలుపైనా ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, వ్యవసాయ రంగానికి అవసరమైన సహకారం అందించి రైతుల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో కొందుర్గు సర్పంచ్ చౌడపురం ప్రభాకర్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మన్నె కవిత నారాయణ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు శ్రీధర్ రెడ్డి, హఫీజ్, నటరాజన్, లక్ష్మణ్ నాయక్, బంగారు రాములు, పోతురాజు గోపాల్, మోహనచారి, సోని శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# కన్నవారే కాటేస్తున్నారు!

- చిన్నచిన్న వివాదాలకే కర్కశ హత్యలు
- గద్వాల జిల్లాలో కలవరపెడుతున్న ఘటనలు

**రాజోళి/గద్వాల టౌన్, అక్టోబర్ 12 (జనంసాక్షి):** ఒకప్పుడు ఆపదలో ఆదుకునే బంధాలు..నేడు ప్రాణాలు తీసేంతగా బలహీనపడుతున్నాయి? రక్తం పంచుకున్న వారే రక్తం చిందిస్తున్న ఘటనలు సమాజాన్ని కలవరపెడుతున్నాయి. తండ్రి, కొడుకు, అన్న, తమ్ముడు.. భార్య, భర్త ఇలా కుటుంబ సభ్యుల మధ్య తలెత్తుతున్న విభేదాలు హింసకు దారితీస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. జోగులాంబ గద్వాల జిల్లాలో చోటుచేసుకుంటున్న వరుస ఘటనలు కుటుంబ బంధాల విలువలపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.



**అయినవారే కడతేర్చుతున్నారు!**

జిల్లాలో కుటుంబ కలహాలు, వ్యక్తిగత విభేదాలు ప్రాణాంతకంగా మారుతున్న ఘటనలు వెలుగుచూస్తున్నాయి. ధరూర్ మండలం ఓబులోనిపల్లి గ్రామంలో భార్యాభర్తల మధ్య జరిగిన వివాదం విషాదాంతమైంది. జమ్ములమ్మను ఆమె భర్త గోపి రోకలిబండతో కొట్టి హత్య చేసినట్లు కథనంలో పేర్కొనబడింది. మరో ఘటనలో తనను తిట్టిందనే కోపంతో తమ్ముడి వరుసయ్యే బంధువు ఓ మహిళను కత్తితో పొడిచి హత్య చేసినట్లు సమాచారం. గతంలో తోడబుట్టినవాడనే కనికరం లేకుండా ఇద్దరు వ్యక్తులు ఓ వ్యక్తిని హత్య చేసి, మృతదేహాన్ని బైక్‌పై తరలించిన ఘటన కూడా జిల్లాలో సంచలనం సృష్టించింది. గద్వాల పట్టణంలోని బీసీ కాలనీ సమీపంలో శంకరమ్మ అనే వృద్ధురాలిని ఆమె సమీప బంధువు మేకల రామంజి కత్తితో దాడి చేసి హత్య చేసిన ఘటన సైతం బంధాల మధ్య పెరుగుతున్న హింసకు అద్దం పడుతోంది.

**మానవత్వమే బంధాలకు పునాది**

ఒకప్పుడు కుటుంబం అంటే ఆప్యాయత.. పెద్దల మాటకు గౌరవం.. సమస్య వస్తే అందరూ కలిసి పరిష్కరించుకునే సంస్కారం. ఇప్పుడు అదే కుటుంబాల్లో అనుమానాలు, కక్షలు, ఆస్తి వివాదాలు చిచ్చు పెడుతున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. కోపం వచ్చినప్పుడు కాస్త ఆగడం..ఎదుటివారి మాట వినడం..అవసరమైతే చట్టాన్ని ఆశ్రయించడం ఎంతో ముఖ్యం. బంధుత్వం అంటే కేవలం రక్తసంబంధం కాదు.. కష్టంలో తోడుగా నిలిచే బాధ్యత కూడా. ఆ విలువను గుర్తించనంతకాలం ఇలాంటి విషాద ఘటనలు సమాజాన్ని వెంటాడుతూనే ఉంటాయి. కుటుంబ వ్యవస్థ బలహీనపడకుండా ఉండాలంటే పరస్పర గౌరవం, సహనం, సంయమనం అవసరం. సమస్య ఏదైనా చర్చలతో పరిష్కరించుకోవాలి తప్ప హింసకు పాల్పడకూడదు. రక్తసంబంధాల విలువను గుర్తించి, ఆవేశాన్ని అదుపులో ఉంచుకొని, చట్టాన్ని గౌరవించినప్పుడే కుటుంబాల్లో ప్రశాంతత నెలకొంటుంది. లేదంటే చిన్నపాటి వివాదాలే తీరని విషాదాలకు కారణమవుతాయి.



**హత్యలతో సమస్యలు పరిష్కారం కావు**

జిల్లాలో కుటుంబ సభ్యులు ఒకరిని ఒకరు చంపుకోవడం వంటి సంఘటనలు తరచూ జరగడం విచారకరం. ఆస్తులు, భూ సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించేందుకు చట్టాలు ఉన్నాయి. క్షణికావేశంలో హత్యలు చేయడం సరికాదు. నేర ప్రవృత్తిలో మార్పు, సామాజిక విలువలు, మానవ సంబంధాలపై అవగాహన కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. గంజాయి, మత్తు పదార్థాల వినియోగం తగ్గితే హత్యా నేరాల సంఖ్య కూడా తగ్గుతుంది.

-గద్వాల డీఎస్పీ, మొగులయ్య

# మురుగునీటి కోరల్లో అన్నరాయుని చెరువు

- ఎగువ ప్రాంతాల నుంచి డ్రైనేజీ ప్రవాహం.. కాలుష్యంతో స్థానికుల అవస్థలు



**కీసర, అక్టోబర్ 12 (జనంసాక్షి) :** అన్నరాయుని చెరువులోకి ఎగువ ప్రాంతాల నుంచి చేరుతున్న మురుగునీటిని అరికట్టి, జలవనరును కాలుష్య కోరల నుంచి కాపాడాలని నాగారం మున్సిపల్ మాజీ కౌన్సిలర్ కొమిరెల్లి అనితా సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మేడ్చల్ నియోజకవర్గం ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని నాగారం డివిజన్‌లో ఉన్న అన్నరాయుని చెరువు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న మురుగునీటితో తీవ్రంగా కలుషితమవుతోందని కొమరెల్లి అనితా సుధాకర్‌రెడ్డి తెలిపారు. డ్రైనేజీ నీరు చెరువులోకి చేరుతుండటంతో జలవనరు కాలుష్యమయంగా మారుతోందని, దీంతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సమస్యను తక్షణమే పరిష్కరించి చెరువును పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రత్యేక కాలువ ద్వారా మళ్లించాలి

సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే మల్లారెడ్డి.. అన్నరాయుని చెరువును కాలుష్యం నుంచి కాపాడేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని హైడ్రా కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న మురుగునీరు చెరువులోకి చేరకుండా ప్రత్యేక ఫీడర్ కెనాల్ ద్వారా మళ్లించాలని కోరారు. చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్క, పూడికను తొలగించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. సుందరీకరణ చేపట్టాలి చెరువు పరిసరాలను అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండేలా సుందరీకరించి అభివృద్ధి చేయాలని అనితా సుధాకర్‌రెడ్డి కోరారు.
ఈ సమస్య పరిష్కారం కోసం మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, హైడ్రా కమిషనర్‌లకు సైతం వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోమిరెల్లి సుధాకర్ రెడ్డి, కమ్మంపాటి యాకయ్య, పంజాల నర్సింహాగౌడ్, పంగచంద్రయ్య, అబ్బోజు రాంసుదాకర్, విశాల్ పాల్గొన్నారు.

# రైతులను వారి కర్మానికి వదిలేసి ఢిల్లీకి యాత్రలా?

- సీఎం, మంత్రులు ఢిల్లీకి వెళ్లడంపై మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



**వనపర్తి బ్యూరో అక్టోబర్12 (జనంసాక్షి) :** రైతుల సమస్యలపై కీలక క్యాబినెట్ సమావేశం నిర్వహించాల్సిన సమయం లో దానిని వాయిదా వేసి ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు ఢిల్లీకి వెళ్లడాన్ని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఎల్‌నినో ప్రభావంపై చర్చించడంతో పాటు రైతువేదికల్లో రైతులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తామని ప్రకటించి, చివరకు ఆ కార్యక్రమాలను వాయిదా వేయడం కాంగ్రెస్ ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని ఆయన విమర్శించారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు అబద్ధాలతోనే పాలన కొనసాగిస్తోందని ఆయన ఆరోపించారు. మొన్నటివరకు ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని రైతులకు సూచించిన ప్రభుత్వం, ఇప్పుడు రెండో పంట వేయవద్దంటూ హెచ్చరించడం దుర్మార్గమని మండిపడ్డారు. రాష్ట్రంలో సాగునీరు మాత్రమే కాకుండా కనీసం తాగునీరు కూడా అందించలేమని, విద్యుత్ సరఫరా చేయలేమని ప్రభుత్వం ప్రకటించడం రైతులు, వ్యవసాయం, ప్రజల సమస్యల పట్ల ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేస్తోందని నిరంజన్ రెడ్డి విమర్శించారు. సాగునీటిని ఎత్తిపోసుకునే అవకాశం ఉన్నప్పటికీ ఎత్తిపోతల మోటార్లను నిలిపివేయడం ద్వారా ప్రభుత్వం రైతాంగానికి తీవ్ర నష్టం కలిగిస్తోందని ఆరోపించారు.రాష్ట్రంలో విద్యుత్ కోతలు, లో-వోల్టేజీ సమస్యలతో పంటలు ఎండిపోతున్నాయని, మోటార్లు కాలిపోతుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం రోడ్లపైకి వస్తుంటే, కాంగ్రెస్ నాయకులు మాత్రం విమానాలు ఎక్కి ఢిల్లీకి వెళ్తున్నారని విమర్శించారు.జాతీయ పార్టీలను నమ్ముకుంటే తెలంగాణకు అన్యాయం జరుగుతుందని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పలుమార్లు చెప్పారని నిరంజన్ రెడ్డి గుర్తుచేశారు. తెలంగాణ ప్రయోజనాల కంటే జాతీయ పార్టీలకు తమ పార్టీ, వ్యక్తిగత ప్రయోజనాలే ముఖ్యమని, తెలంగాణ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇచ్చే పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని ఆయన పేర్కొన్నారు.కేసీఆర్ పాలనలో వ్యవసాయం పండుగలా సాగిందని, రైతులు గౌరవంగా జీవించారని పేర్కొన్న నిరంజన్ రెడ్డి, కాంగ్రెస్ పాలనలో రైతులు తిరిగి గతంలో ఎదుర్కొన్న ఇబ్బందులను చవిచూస్తున్నారని విమర్శించారు. జాతీయ పార్టీల మోసపూరిత హామీలు, అబద్ధాలను నమ్మి తెలంగాణ ప్రజలు నష్టపోయారని అన్నారు.రాష్ట్రంలో వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానికి భవిష్యత్తులో తెలంగాణ సమాజం తగిన బుద్ధి చెబుతుందని నిరంజన్ రెడ్డి హెచ్చరించారు. రైతుల సమస్యలపై చర్చించాల్సిన క్యాబినెట్ సమావేశాన్ని వాయిదా వేసి ముఖ్యమంత్రి, మంత్రులు ఢిల్లీకి వెళ్లడాన్ని ఆయన ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు.

# ఇన్నాళ్లున్న బెల్ట్ షాపులు ఇప్పుడెందుకు తీస్తాం

- విధి నిర్వహణ మరిచి సీఐ వెంకటేశ్వర్లు బెదిరింపులు
- టార్గెట్ల సాకుతో అక్రమ మద్యాన్ని ఏరులై పారిస్తున్న ఆబ్కారీ శాఖ
- ప్రశ్నించిన బాధితులపైనే రివర్స్ దౌర్జన్యం
- వైరల్ అవుతున్న సీఐ సంభాషణ




**మహబూబ్ నగర్ బ్యూరో, అక్టోబర్ 12 (జనంసాక్షి):** గ్రామాల్లో విచ్చలవిడిగా వెలిసిన అక్రమ బెల్ట్ షాపులను అరికట్టాల్సిన ఆబ్కారీ అధికారులే, వాటికి బాహాటంగా కొమ్ముకాస్తున్నారా? అంటే అవుననే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మహబూబ్ నగర్ జిల్లా కేంద్ర పరిధిలోని బండమీదిపల్లె గ్రామంలో బెల్ట్ షాపులను తక్షణమే నిషేధించాలని డిమాండ్ చేస్తూ సోమవారం గ్రామస్తులంతా ఏకమై జిల్లా కలెక్టర్ కార్యాలయం ఫిర్యాదు చేశారు. సమస్యను పరిష్కరించాల్సిన ఎక్సైజ్ అధికారులు మాత్రం బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం స్థానికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. “కొత్తగా వచ్చిన షాపులు కాదు కదా.. ఇన్ని రోజులుగా నడుస్తున్న బెల్ట్ షాపులను ఇప్పుడే ఎందుకు తీస్తాం? మాకు తొలగించడం సాధ్యం కాదు” అంటూ ఎక్సైజ్ సీఐ వెంకటేశ్వర్లు గ్రామస్తులతో అన్న మాటలు ప్రస్తుతం సోషల్ మీడియాలో తీవ్ర దుమారం రేపుతున్నాయి.

**టార్గెట్ల పేరిట ప్రోత్సాహం..?**

“మాకు టార్గెట్లు ఉంటాయి.. మేము వాటిని ఏమీ చేయలేము” అంటూ అధికారులు ఏకంగా చేతులెత్తేయడం, ప్రశ్నించిన గ్రామస్తుల పైనే బెదిరింపు ధోరణిలో ప్రవర్తించడాన్ని బాధితులు తీవ్రంగా తప్పుబడుతున్నారు. అక్రమ మద్యాన్ని అరికట్టాల్సిన అధికారులే ఇలా మాట్లాడటం చూస్తుంటే, బెల్ట్ షాపుల నిర్వాహకులకు ఎక్సైజ్ శాఖే ప్రత్యక్షంగా సహకరిస్తోందన్న అనుమానాలు బలపడుతున్నాయి.

**ఉన్నతాధికారులు స్పందించాలి**

అధికారుల నిర్లక్ష్య వైఖరిపై సామాన్య ప్రజలు మండిపడుతున్నారు. పల్లెల్లో బెల్ట్ షాపుల వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, తక్షణమే ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని బండమీదిపల్లెలోని బెల్ట్ షాపులను రద్దు చేయాలని, బాధ్యతారాహిత్యంగా మాట్లాడిన సీఐపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## విద్యుత్ షాక్‌కు గురైన యువకుడు చికిత్స పొందుతూ మృతి

- పండుగ పూట ముల్కనూర్‌లో విషాదం
- సర్పంచ్‌తో సహా ముగ్గురుపై కేసు నమోదు



**చిగురుమామిడి అక్టోబర్ 12(జనంసాక్షి):** బతుకమ్మ, దసరా పండుగ సందర్భంగా గ్రామంలో విద్యుత్ బల్బులు వేస్తూ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందడంతో ముల్కనూర్ గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. చిగురుమామిడి ఎస్సై జగదీశ్వర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి..కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని ముల్కనూర్ గ్రామానికి చెందిన కత్తెరమల్ల రమేష్ (31) ఎలక్ట్రిషన్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 6న ఉదయం 10గంటల సమయంలో సర్పంచ్ సాంబారి భారతమ్మ, సర్పంచ్ భర్త సాంబారి కొమురయ్య, భామండ్ల కళ్యాణ్, పందిపెల్లి నిఖిల్ అను వ్యక్తులు రమేష్‌ను బలవంతంగా స్ట్రీట్ లైట్ రిపేర్ చేయడానికి తీసుకువెళ్లి నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రమాదానికి గురి చేశారని మృతుడి పెద్దనాన్న కత్తెరమల్ల వెంకటి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.గ్రామంలో విద్యుత్ బల్బులు వేసేటప్పుడు ఎవరూ విద్యుత్ అధికారుల నుండి ఎలాంటి ఎల్ సి తీసుకోకుండా, కనీస భద్రతా చర్యలు పాటించకుండా రమేష్ చేత బలవంతంగా పని చేయించారని తెలిపారు.దింతో రమేష్ ప్రమాదవశాత్తూ తీవ్రమైన విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే తీవ్రంగా పడినట్లు పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే బాధితుడిని కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ అత్యవసర విభాగంలో చికిత్స పొందుతూ రమేష్ పరిస్థితి విషమించి సోమవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు తెలిపారు.బాధితుడి పెద్దనాన్న కత్తెరమల్ల వెంకటి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సదరు నలుగురి నిర్లక్ష్యం కారణంగా మరణానికి కారణమైనందుకు గానూ చట్టపరమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జగదీశ్వర్ తెలిపారు.

## కీళ్ల నొప్పులను నిర్లక్ష్యం చేయొద్దు

- పెయిన్‌కిల్లర్స్ దీర్ఘకాలిక వాడకంతో ప్రమాదం
- మీడియా సమావేశంలో మెడికవర్ ఆర్థోపెడిక్ సర్జన్లు డా. వేణుగోపాల్ - డా.రాకేష్ వెల్లడి




**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 12 (జనంసాక్షి) :**
ఆర్థరైటిస్ సమస్యను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన చికిత్స తీసుకుంటే మంచి ఫలితం ఉంటుందని కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆర్థోపెడిక్ సర్జన్లు డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ రాకేష్ సూచించారు. ప్రపంచ ఆర్థరైటిస్ దినోత్సవం సందర్భంగా సోమవారం రోజు కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రిలో విలేకరుల సమావేశంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మెడికవర్ ఆర్థోపెడిక్ సర్జన్లు డా. వేణుగోపాల్, డా.రాకేష్ మాట్లాడుతూ... కీళ్లలో వాపు, నొప్పి, బిగుతు, కదలికల్లో ఇబ్బందులు కలిగించే పరిస్థితులను ఆర్థరైటిస్ అంటారని తెలిపారు. ఆస్టియో ఆర్థరైటిస్, రుమటాయిడ్ ఆర్థరైటిస్ సహా పలు రకాలుగా ఇది కనిపిస్తుందని, వయసు పెరగడం, కీళ్లపై అధిక ఒత్తిడి, అధిక బరువు, గతంలో కీళ్లకు గాయాలు కావడం, రోగనిరోధక వ్యవస్థలో మార్పులు వంటి కారణాలతో ఈ సమస్య తలెత్తవచ్చని తెలిపారు. ఆర్థరైటిస్‌తో నడవడం, మెట్లు ఎక్కడం, కూర్చుని లేవడం వంటి రోజువారీ పనులు కూడా బాధాకరంగా మారుతాయన్నారు. ఆర్థరైటిస్ తీవ్రత, కీళ్లకు జరిగిన నష్టం, రోగి ఆరోగ్య పరిస్థితిని బట్టి చికిత్సలను నిర్ణయిస్తారని, ప్రారంభ దశలో వైద్యుల సూచనల మేరకు మందులు, ఫిజియోథెరపీ, తగిన వ్యాయామాలు, బరువు నియంత్రణతో ఉపశమనం పొందవచ్చనని తెలిపారు. వ్యాధి ముదిరి కీళ్లలో తీవ్రమైన నష్టం ఏర్పడి, మందులు, ఇతర చికిత్సలతోనూ నొప్పి తగ్గకపోతే శస్త్రచికిత్సను పరిశీలిస్తామన్నారు. అవసరమైన సందర్భాల్లో మోకీలు లేదా తుంటి కీలు మార్పిడి శస్త్రచికిత్సతో నొప్పి తగ్గి, కదలికలు మెరుగుపడే అవకాశం ఉంటుందన్నారు. నొప్పి తగ్గించే మందులను వైద్యుల సలహా లేకుండా తరచుగా వాడటం వల్ల కడుపులో అల్సర్లు, రక్తస్రావం, మూత్రపిండాలు, గుండె సంబంధిత సమస్యల ముప్పు పెరగవచ్చన్నారు. నొప్పిని నిర్లక్ష్యం చేయడం వల్ల కదలికలు తగ్గి రోజువారీ జీవితం పై ప్రభావం పడుతుందని తెలిపారు. బరువు అదుపులో ఉంచుకోవడం, కీళ్లపై అధిక ఒత్తిడి పడకుండా చూడటం, వైద్యుల సూచనలతో వ్యాయామం చేయడం, మందులను సూచించిన విధంగానే వాడటం ద్వారా సమస్యను నియంత్రించుకోవచ్చని సూచించారు. ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆద్వర్యంలో జరిగిన ఈ అవగాహన సదస్సులో అనెస్థీషియా హెడ్ డాక్టర్ వినయ్‌కుమార్, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఓట్ల చోరీని అరికట్టాలి

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి
- 'చలో ఢిల్లీ - ప్రజాస్వామ్యం కోసం' ర్యాలీలో తెలంగాణ కాంగ్రెస్ నాయకులతో కలిసి పాల్గొన్న
- కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ : వైద్యుల అంజన్ కుమార్




**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 12 (జనంసాక్షి) :**
కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓటు చోరీకి పాల్పడుతూ, రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తోందని సైమన్ గో బ్యాక్ అని ఆనాడు భగత్ సింగ్ తీసుకున్న ఒక విప్లవాత్మకమైన నిర్ణయాన్ని స్వాతంత్ర పోరాటానికి నాంది పలికింది. నేడు జ్ఞానేశ్వర్ గో బ్యాక్ అని రాహుల్ గాంధీ తీసుకున్న నిర్ణయం మరో స్వతంత్ర పోరాటంగా కార్యరూపం దాల్చిన సందర్భంగా డిమాండ్ చేస్తూ, జ్ఞానేష్ కుమార్ గో బ్యాక్ కార్యక్రమం తీసుకోవడం జరిగిందని కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైద్యులు అంజన్ కుమార్ విమర్శించారు. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.
'ఓట్ల చోరీ'కి వ్యతిరేకంగా, ప్రజాస్వామ్య పరిరక్షణ లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో ఇండియా కూటమి చేపట్టిన 'చలో ఢిల్లీ - ప్రజాస్వామ్యం కోసం' నిరసన కార్యక్రమంలో భాగంగా సోమవారం ఢిల్లీలో నిర్వహించిన ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖరిగే, ప్రియాంక గాంధీ, మన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మన జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్, మన జిల్లా ఎమ్మెల్యేలు, మన ఉమ్మడి కరీంనగర్ జిల్లా మంత్రులు శ్రీధర్ బాబు, లక్ష్మణ్ కుమార్, ఆది శ్రీనివాస్, కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, విజయ రమణారావు, మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, సంజయ్, అగ్ర నాయకులతో కలిసి కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్సీలు, సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ నిరసన ర్యాలీ తెలంగాణ భవన్ నుంచి బారాఖంబా రోడ్‌లోని మండి హౌస్ మీదుగా సుప్రీంకోర్టు సమీపం వరకు కొనసాగింది. ఓటు చోరీని అరికట్టాలని, ప్రజాస్వామ్య వ్యవస్థలను పరిరక్షించాలని కాంగ్రెస్ నాయకులు ఈ సందర్భంగా నినదించారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వైద్యుల అంజన్ కుమార్ పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీరుపై విమర్శలు చేశారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాదని, ఆ హక్కును కాపాడాల్సిన ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో జరుగుతున్న ఎస్ ఐ ఆర్ ప్రక్రియను నిలిపివేసి, ఎన్నికల వ్యవస్థ పై ప్రజలకు విశ్వాసం కల్పించాలని డిమాండ్ చేశారు.

## ప్రజావాణి అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు

- జిల్లా స్థాయిలో 138 దరఖాస్తుల స్వీకరణ : కలెక్టర్ చిత్రా మిశ్రా
- కరీంనగర్ నగరపాలక సంస్థకు 19 అర్జీలు
- పెండింగ్ దరఖాస్తులపై అధికారులకు సమీక్ష



**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 12 (జనంసాక్షి):** ప్రజావాణికి అందిన దరఖాస్తులతో పాటు పెండింగ్ అర్జీలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి 138 దరఖాస్తులు స్వీకరించి, సంబంధిత శాఖలకు బదిలీ చేశారు. అనంతరం పోలీస్, పంచాయతీ, భూ సర్వే, రిజిస్ట్రేషన్, విద్యుత్, కార్పొరేషన్ తదితర శాఖల్లో పెండింగ్‌లో ఉన్న అర్జీలపై శాఖల వారీగా సమీక్షించారు. ముఖ్యమంత్రి ప్రజావాణి ద్వారా వివిధ కార్యాలయాలకు వచ్చిన దరఖాస్తుల వివరాలను తెలుసుకుని, వాటిని కూడా త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, డీఆర్వో స్వామి, ఆర్డీవో షర్మిల, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.
కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ప్రజల నుంచి 19 దరఖాస్తులు స్వీకరించారు. వీటిలో టౌన్ ప్లానింగ్ విభాగానికి 7, రెవెన్యూకు 3, ఇంజినీరింగ్‌కు 6, పారిశుధ్య విభాగానికి 2, ఎస్టాబ్లిష్‌మెంట్‌కు ఒక అర్జీ అందాయి. ఆస్తిపన్ను సవరణ, ఆస్తుల అసెస్‌మెంట్, ఆక్రమణల తొలగింపు, అనధికార నిర్మాణాలు, అభివృద్ధి పనులకు సంబంధించిన సమస్యలపై ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. అర్జీలపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, పెండింగ్‌లో పెట్టకుండా వేగంగా పరిష్కరించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆయాజ్, అసిస్టెంట్ కమిషనర్ రాజమనోహర్, ఇన్‌చార్జి ఈఈ లచ్చిరెడ్డి, డీసీపీ వేణు మాధవ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కార్మికుల హక్కుల సాధనే లక్ష్యంగా కార్మిక గర్జన

- ఈ నెల 14న గోదావరిఖనిలో బహిరంగ సభ
- సభ వాల్‌పోస్టర్ ఆవిష్కరించిన టీబీజీకేఎస్ నేతలు
- కార్మికుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలి
- సభకు భారీగా తరలిరావాలని పిలుపు



**గోదావరిఖని, అక్టోబర్ 12 (జనంసాక్షి):** సింగరేణి కార్మికుల హక్కుల సాధన, సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ నెల 14న గోదావరిఖనిలో నిర్వహించనున్న 'సింగరేణి కార్మిక గర్జన' బహిరంగ సభను విజయవంతం చేయాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక టీబీజీకేఎస్ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సభకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా నాయకుడు మిరియాల రాజిరెడ్డి మాట్లాడుతూ, టీబీజీకేఎస్ గుర్తింపు సంఘంగా ఉన్న సమయంలో కార్మికుల హక్కుల సాధన కోసం పోరాడి అనేక విజయాలు సాధించిందన్నారు. కారుణ్య నియామకాల ద్వారా 14 వేల మందికి, ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్ ద్వారా 3,800 మందికి, పెండింగ్‌లో ఉన్న 3,250 మందికి ఒకేసారి ఉద్యోగాలు ఇప్పించిన ఘనత తమ సంఘానిదని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం, గుర్తింపు కార్మిక సంఘాలు ఎన్నికల ముందు కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యాయని ఆయన విమర్శించారు. హామీల అమలులో జరుగుతున్న జాప్యాన్ని కార్మికులు ప్రశ్నించాలని, హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే కార్మిక గర్జన సభ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. అక్టోబర్ 14న జరిగే సభకు కార్మికులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశానికి ఆర్జీ-1 ఏరియా ఇన్‌చార్జి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నూనె కొమరయ్య అధ్యక్షత వహించారు. టీబీజీకేఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామ్మూర్తి, అధికార ప్రతినిధి పర్లపల్లి రవి, కోశాధికారి చల్లూరి సతీష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఐ. సత్యం, పల్లె సురేందర్, వంగళ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### 220 కేవీ కథలాపూర్ సబ్‌స్టేషన్
## నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



**కథలాపూర్ అక్టోబర్ 12 (జనం సాక్షి ) :** జగిత్యాల జిల్లా కథలాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్మాణంలో ఉన్న పనులను 220 కేవీ టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ శ్రీ కర్నాటి వరుణ్ రెడ్డి సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల పురోగతిని సమీక్షించారు. అలాగే 132 కేవీ కోరుట్ల సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేసి విద్యుత్ సరఫరా పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా 220 కేవీ కథలాపూర్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను వేగవంతం చేసి, 2027 జనవరి 10వ తేదీ నాటికి పనులు పూర్తిచేసి విద్యుత్ సరఫరాకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత ట్రాన్స్‌కో అధికారులను, కాంట్రాక్టర్‌ను సీఎండీ ఆదేశించారు. పనుల్లో జాప్యం జరగకుండా అదనపు కార్మికులను నియమించుకొని, నిర్దేశించిన లక్ష్యాల ప్రకారం పనులు పూర్తి చేయాలని సూచించారు.
రాబోయే సీజన్‌లో విద్యుత్ డిమాండ్ పెరిగే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని, ముందస్తు ప్రణాళికతో విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేయాలని ఆయన పేర్కొన్నారు. నిర్మాణ పనుల్లో జాప్యం కారణంగా రైతులు, వినియోగదారులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అవసరమైన చర్యలు చేపట్టి, నాణ్యమైన, నమ్మకమైన విద్యుత్ సరఫరా అందించాలని అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో కాలిపోయిన పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్లను త్వరితగతిన మార్చాలని, రైతులకు అదనపు మోటార్ల వినియోగం వల్ల కలిగే సమస్యలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకునేలా వినియోగదారులకు సూచనలు చేయాలని తెలిపారు. ఈ తనిఖీలో ట్రాన్స్‌కో కన్‌స్ట్రక్షన్ డీఈ హనుమయ్య, ట్రాన్స్‌కో డీఈ సంపత్, జగిత్యాల డీఈ గంగారం, మెట్పల్లి డీఈ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

### దుబాయ్‌లో అంబరాన్నంటిన
## బతుకమ్మ సంబరాలు

- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవం
- వేలాదిగా తరలివచ్చిన ప్రవాస తెలంగాణవాసులు
- మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తకు ఘన సన్మానం
- ఆటపాటలు, జానపద గీతాలతో పండుగ సందడి



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 12 (జనం సాక్షి):** విదేశీ గడ్డపై తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెబుతూ దుబాయ్‌లో బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఎమిరేట్స్ తెలంగాణ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు వేలాదిగా ప్రవాస తెలంగాణవాసులు తరలివచ్చారు. తెలంగాణ నుంచి ప్రత్యేక అతిథిగా హాజరైన నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. తెలంగాణ మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బతుకమ్మలతో పాల్గొని ఆటపాటలతో సందడి చేశారు. జానపద గీతాలు, బతుకమ్మ పాటలు, సంప్రదాయ నృత్యాలతో వేడుకల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. తెలంగాణ పల్లె వాతావరణాన్ని తలపించేలా సాగిన సంబరాలు ప్రవాసులలో ఉత్సాహాన్ని నింపాయి. బతుకమ్మ పాటలతో పాటు 'జై తెలంగాణ.. జై కేసీఆర్' నినాదాలు, రాజకీయ గీతాలు వేడుకల్లో వినిపించాయి.
విదేశాల్లో నివసిస్తున్నప్పటికీ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ భావితరాలకు అందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులను బిగాల గణేశ్ గుప్త అభినందించారు. బతుకమ్మ పండుగను వైభవంగా నిర్వహిస్తూ తెలంగాణ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటుతున్న మహిళలు, ప్రవాసుల కృషిని ప్రశంసించారు. తెలంగాణ ఆడపడుచులకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి వేడుకలు ప్రవాస తెలంగాణవాసుల మధ్య ఐక్యతను బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, జీవన్ రెడ్డి, షకీల్, ఎన్ఆర్ఐ గ్లోబల్ కోఆర్డినేటర్ మహేష్ బిగాల తదితరులు పాల్గొన్నారు.

### పర్యావరణ టీం విజేతగా ఎన్టిపిసి-రామగుండం

గోదావరిఖని, జనంసాక్షి : పర్యావరణ టీం విజేతగా ఎన్టిపిసి రామగుండం నిలిచింది. విజేతగా నిలిచిన ఎన్‌టిపిసి రామగుండం అండ్ తెలంగాణకు చెందిన 'టీమ్ పర్యావరణ్' హైదరాబాద్‌లో సోమవారం జరిగిన నో సెట్- 2026 ప్రాంతీయ రౌండ్‌లో ఎన్టిపిసి రామగుండం ౘ తెలంగాణకు చెందిన 'టీమ్ పర్యావరణ్' విజేతగా నిలిచింది. ఈ విజయంతో, జాతీయ స్థాయి పోటీలో ఈ బృందం దక్షిణ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించనుంది. ఈ ప్రాంతీయ పోటీలో వల్లూరు, సింహాద్రి, కుడ్గి, రామగుండం ౘ తెలంగాణ అనే ఐదు ఎన్టిపిసి కేంద్రాలు, దక్షిణ ప్రాంత ప్రధాన కార్యాలయం (ఎస్సార్ హెచ్ క్యూ) పాల్గొన్నాయి. ఇందులో పాల్గొన్న బృందాలు తమ పరిజ్ఞానం, నైపుణ్యం మరియు పోటీతత్వాన్ని ప్రదర్శించాయి. విజేతగా నిలిచిన ఈ బృందంలో రవి ఉప్పల, పోతు అశోక్, సాగర్ బరకాల, ఓంప్రకాష్ బలరామ్ పటేల్ సభ్యులుగా ఉన్నారు.

## ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు





- 251 కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి చర్యలు
- సీఎంఆర్ డెలివరీ వేగవంతం చేయాలి
- ప్రజావాణి అర్జీలను గడువులోగా పరిష్కరించాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

**రాజన్న సిరిసిల్ల బ్యూరో, అక్టోబర్ 12 (జనంసాక్షి):**
ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) డెలివరీని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో 123, పీఏసీఎస్ ద్వారా 122, మెప్మా ఆధ్వర్యంలో 6 చొప్పున మొత్తం 251 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్లు ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలన్నారు. 2025--26 ఖరీఫ్, యాసంగి సీజన్లకు సంబంధించిన సీఎంఆర్ డెలివరీ లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు.
అనంతరం నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్, అదనపు కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లా కేంద్రంలో 129, సిరిసిల్ల ఆర్డీఓ కార్యాలయంలో 7, వేములవాడ ఆర్డీఓ కార్యాలయంలో ఒకటి చొప్పున మొత్తం 137 దరఖాస్తులు అందాయి. వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపించి, ప్రతి అర్జీని పరిశీలించి గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. రెవెన్యూ డివిజన్, ఎంపీడీఓ కార్యాలయాల్లోనూ ప్రజావాణి కొనసాగుతుందని, ప్రజలు తమ సమస్యలపై ఆయా కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించవచ్చని తెలిపారు. అందిన అర్జీలన్నింటినీ ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, సహకార శాఖ అధికారి రామకృష్ణ, పౌరసరఫరాల శాఖ అధికారి బుచ్చిబాబు, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, హౌసింగ్ పీడీ వెంకట మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

## పనిమనిషి ముసుగులో వృద్ధురాలి హత్య

- బంగారు ఆభరణాల దోపిడీ
- కామారెడ్డిలో సంచలనం సృష్టించిన కేసును ఛేదించిన పోలీసులు
- భార్యాభర్తల అరెస్ట్.. 8 తులాల బంగారం స్వాధీనం
- గొంతు బిగించి హత్య చేసినట్లు పోలీసుల వెల్లడి
- పోలీసు బృందాన్ని అభినందించిన ఎస్పీ రాజేష్ చంద్ర




**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 12 (జనం సాక్షి):** పట్టణంలో వృద్ధురాలి హత్య, బంగారు ఆభరణాల దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. ఇంట్లో పనిమనిషిగా పనిచేస్తున్న మహిళ తన భర్తతో కలిసి పథకం ప్రకారం హత్యకు పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైందని పోలీసులు తెలిపారు. ఈ కేసులో భార్యాభర్తలను అరెస్ట్ చేసి, సుమారు 8 తులాల బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. కామారెడ్డి ముష్రీఫ్‌బాగ్‌కు చెందిన చిట్మల్ అనసూయ (66) సెప్టెంబర్ 29న ఇంట్లో హత్యకు గురయ్యారు. ఆమె భర్త ఇంటికి తిరిగి వచ్చేసరికి మంచంపై అపస్మారక స్థితిలో కనిపించారు. మెడపై గాయాలు ఉండటంతో పాటు, పుస్తెల తాడు, రెండు ఉంగరాలు, చెవి ఆభరణాలు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో హత్య, దోపిడీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.
జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు, డీఎస్పీ ఎస్. మధుసూదన్ పర్యవేక్షణలో పట్టణ ఇన్‌స్పెక్టర్ బి. నరహరి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. దర్యాప్తులో మృతురాలి ఇంట్లో పనిమనిషిగా పనిచేస్తున్న బోసు రజిత (40), ఆమె భర్త బోసు నర్సింగ్ (48)పై అనుమానం రావడంతో వారిని గంజ్ పాఠశాల సమీపంలో అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ సందర్భంగా నేరానికి సంబంధించిన వివరాలు వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. పెద్ద మొత్తంలో డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో బంగారు ఆభరణాల కోసం హత్యకు పథకం వేసినట్లు విచారణలో వెల్లడైందని పోలీసులు పేర్కొన్నారు. అనసూయ భర్త ఇంటి నుంచి బయటకు వెళ్లిన సమయంలో నిందితులిద్దరూ ఇంట్లోకి ప్రవేశించి, ఆమె పూజ చేస్తున్నప్పుడు విద్యుత్ సరఫరా నిలిపివేసినట్లు తెలిపారు. అనంతరం ఆమెను మరో గదిలోకి తీసుకెళ్లి తువ్వాలుతో గొంతు బిగించి హత్య చేసి, ఆభరణాలతో వెళ్లిపోయినట్లు వివరించారు. అనుమానం రాకుండా రజిత యథావిధిగా పనిమనిషిగా ఇంటికి వస్తూ వెళ్లినట్లు వెల్లడించారు. రజితకు 2023లోనూ కామారెడ్డిలో మరో ఇంట్లో పనిచేస్తున్న సమయంలో బంగారు ఆభరణాల చోరీకి పాల్పడినట్లు విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు. ప్రస్తుతం నిందితుల నుంచి పుస్తెల తాడు, రెండు ఉంగరాలు, చెవి ఆభరణాలతో పాటు సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన భార్యాభర్తలను రిమాండ్ నిమిత్తం న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు వెల్లడించారు. కేసును ఛేదించడంలో కీలక పాత్ర పోషించిన ఇన్‌స్పెక్టర్ బి. నరహరి, ఏఎస్సై రంగారావు, కానిస్టేబుళ్లు రామస్వామి, రాజు నాయక్, సంపత్‌లను ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర అభినందించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
13 అక్టోబర్ 2026

## మంత్రి సీతక్క విజ్ఞప్తికి స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం

- ములుగులో విద్యుత్ లైన్ల మార్పు, విస్తరణకు రూ.3 కోట్లు మంజూరు
- సానుకూలంగా స్పందించిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



**ములుగు ప్రతినిధి, అక్టోబర్12 (జనం సాక్షి):** ములుగు నియోజకవర్గంలో ఇళ్ల మీదుగా వెళ్తున్న విద్యుత్ లైన్ల మార్పు, విస్తరణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.3 కోట్లు మంజూరు చేసింది. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క విజ్ఞప్తి మేరకు ఇంధన శాఖ ఈ నెల 8న ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 32 జారీ చేసింది.నివాస గృహాల మీదుగా విద్యుత్ లైన్లు వెళ్లడంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, భద్రతాపరమైన సమస్యలను మంత్రి సీతక్క ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రమాదాల ముప్పును తగ్గించేందుకు విద్యుత్ లైన్లను మార్చాలని, ఇందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు.మంత్రి సీతక్క విజ్ఞప్తికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారు. తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ సమర్పించిన ప్రతిపాదనలను పరిశీలించిన ప్రభుత్వం రూ.3 కోట్ల అంచనా వ్యయంతో విద్యుత్ లైన్ల మార్పు, విస్తరణ పనులకు ఆమోదం తెలిపింది.ఆర్థిక శాఖ సమ్మతితో జారీ చేసిన ఈ ఉత్తర్వుల ప్రకారం పనుల అమలుకు అవసరమైన తదుపరి చర్యలు చేపట్టాలని తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ ఈ ఉత్తర్వులు జారీ చేశారు.మంత్రి సీతక్క చొరవతో మంజూరైన ఈ నిధులతో విద్యుత్ లైన్ల మార్పు పనులు చేపట్టనున్నారు. పనులు పూర్తయితే ఇళ్ల మీదుగా వెళ్తున్న విద్యుత్ లైన్లతో ఎదురవుతున్న ఇబ్బందులు తగ్గి, ప్రజలకు భద్రత పెరగనుంది.దీర్ఘకాలంగా ఉన్న సమస్య పరిష్కారానికి కృషి చేసిన మంత్రి సీతక్కకు ములుగు నియోజకవర్గ ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

# ఢిల్లీలో బెదిరింపులు, ఆంక్షలు ఆందోళనకరం

## నిరసనకారులపై పోలీసుల దమనకాండను ఖండించిన ఎఫ్‌సీడీ

- మహిళలు, జర్నలిస్టుల నిర్బంధంపై ఆందోళన..
- రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు ప్రజాస్వామిక శక్తుల ఐక్యవేదికకు పిలుపు



**హైదరాబాద్, అక్టోబర్ 12 (జనంసాక్షి):** ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మహిళా కార్యకర్తలు, నిరసనకారులు, విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టుల పట్ల పోలీసులు, భద్రతా సిబ్బంది వ్యవహరించిన తీరును ఫోరం ఫర్ కాన్‌స్టిట్యూషనల్ డెమోక్రసీ (ఎఫ్‌సీడీ) తీవ్రంగా ఖండించింది. ప్రజాస్వామ్య హక్కులను వినియోగించుకునే పౌరులపై బలప్రయోగం, బెదిరింపులు, ఆంక్షలు విధించడం ఆందోళనకరమని పేర్కొంది. భావప్రకటనా స్వేచ్ఛ, శాంతియుతంగా సమావేశమయ్యే హక్కు, స్వతంత్ర జర్నలిజాన్ని అధికారులు గౌరవించాలని స్పష్టం చేసింది. అక్టోబర్ 12న హైదరాబాద్‌లో



జరిగిన సమావేశంలో ఈ అంశాలపై చర్చించి పలు అభిప్రాయాలను వెల్లడించింది. అక్టోబర్ 11న సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో ఢిల్లీలో పోలీసుల చర్యలపై సమావేశం చర్చించింది. ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో శాంతియుత నిరసనకారులను చట్టవిరుద్ధంగా నిర్బంధించరాదని, పౌరుల రాకపోకలకు, జర్నలిస్టులు, న్యాయ వాదులు తమ వృత్తిపరమైన విధులు నిర్వహించేందుకు ఆటంకం కలిగించరాదని సుప్రీం కోర్టు ఆదేశించినట్లు ఎఫ్‌సీడీ పేర్కొంది. అయితే సాయంత్రం ఐదు గంటల నుంచి మహిళా కార్యకర్తలు సహా నిరసన కారులను బలవంతంగా అక్కడి నుంచి తొలగించి నిర్బంధించినట్లు వార్తలు వెలువడ్డాయని తెలిపింది. ఈ పరిణామాలు న్యాయ స్థానం ఆదేశాల అమలుపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని, దీనిపై న్యాయపరమైన పరిశీలన అవసరమని అభిప్రాయపడింది.

దేశంలో రాజ్యాంగ ప్రజాస్వామ్యం, పౌర స్వేచ్ఛలు, సంస్థాగత జవాబుదారీతనానికి ఎదురవుతున్న సవాళ్లపైనా సమావేశం చర్చించింది. గత 12 సంవత్సరాల్లో రాజ్యాంగ హక్కులు, ప్రజాస్వామ్య విలువల ఉల్లంఘనలకు సంబంధించిన ఘటనలను నమోదు చేసి, ఆధారాలను సేకరించి ప్రజల ముందుంచాలన్న మల్లేపల్లి లక్ష్మయ్య ప్రతిపాదనను పరిశీలించింది. ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), ఓటు హక్కుల పరిరక్షణ అంశాలు కూడా సమావేశంలో చర్చకు వచ్చాయి. తమ ఓటు హక్కును కాపాడుకోవాలని కోరుతూ నిరసనలకు దిగుతున్న యువత ఆందోళనలను అర్థం చేసుకోవాలని, వారి అభిప్రాయాలను ఆలకించి ప్రజాస్వామ్య భాగస్వామ్యాన్ని పరిరక్షించే ప్రయత్నాలకు సంఘీభావం ప్రకటించాలని సమావేశం పేర్కొంది. రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం పౌర సమాజ సంస్థలు, విద్యార్థులు, మేధావులు, మహిళా సంఘాలు, కార్మికులు, విద్యావేత్తలు, జర్నలిస్టులు, ఇతర ప్రజాస్వామిక శక్తులను ఒక స్వతంత్ర వేదికపైకి తీసుకురావాల్సిన అవసరం ఉందని ఎఫ్‌సీడీ అభిప్రాయపడింది. ప్రజల్లో అవగాహన కల్పించడం, హక్కుల ఉల్లంఘనలను నమోదు చేయడం, సమన్వయంతో ప్రజాస్వామ్య కార్యక్రమాలు చేపట్టడంపై చర్చించింది. రాజ్యాంగ పరిరక్షణ, పౌర స్వేచ్ఛలు, న్యాయం, సమానత్వం, జవాబుదారీతనం కోసం విస్తృతమైన, శాంతియుత ప్రజాస్వామ్య ఉద్యమాన్ని నిర్మించేందుకు కృషి చేస్తామని ప్రకటించింది. ఎఫ్‌సీడీ సమావేశానికి కన్వీనర్ కె. రామచంద్ర మూర్తి, జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి, ప్రొఫెసర్ శాంతా సిన్హా, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, మల్లేపల్లి లక్ష్మయ్య, గుజ్జా బిక్షం, మాజీ సమాచార హక్కు కమిషనర్, సీనియర్ జర్నలిస్టు ఆర్. దిలీప్ రెడ్డి, తంకశాల అశోక్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ అధ్యక్షుడు విరాహత్ అలీ, సీనియర్ న్యాయవాది జ్యోతి కిరణ్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎం.వి. రెడ్డి, ప్రొఫెసర్ వెంకటనారాయణ, తెలంగాణ విద్యావంతుల వేదికకు చెందిన నాగయ్య, సీనియర్ జర్నలిస్టు రహమాన్, దీప్తి బత్తిని, జే) అధ్యక్షుడు శంకర్ గౌడ్ శిగ్గ, వేణుగోపాల్ రెడ్డి, నల్గొండకు చెందిన దయాకర్ రెడ్డి, రిటైర్డ్ ఇంజినీర్స్ అసోసియేషన్‌కు చెందిన టి. వెంకటేశం, రిటైర్డ్ న్యాయమూర్తి కంతయ్య, తెలంగాణ విద్యావంతుల వేదిక ప్రధాన కార్యదర్శి డాక్టర్ తిప్పర్తి యాదయ్య తదితరులు హాజరయ్యారు.

## భారత్-వెస్టిండీస్ టీ20 మ్యాచ్‌కు
# పటిష్ట పోలీసు భద్రత

- 2,200 మంది పోలీసులతో బందోబస్తు..
- 408 సీసీటీవీ కెమెరాలు, డ్రోన్లతో నిఘా




**ఉప్పల్, అక్టోబర్ 12 (జనం సాక్షి):** హైదరాబాద్‌లోని ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో అక్టోబర్ 14, 2026న రాత్రి 7 గంటలకు జరగనున్న భారత్-వెస్టిండీస్ నాలుగో టీ20 అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌కు మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. మ్యాచ్‌ను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు పోలీసు శాఖ విస్తృత బందోబస్తు ప్రణాళికను సిద్ధం చేసింది. ప్రేక్షకుల భద్రతతో పాటు ట్రాఫిక్ నియంత్రణ, స్టేడియం పరిసరాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. మ్యాచ్ సందర్భంగా మొత్తం 2,200 మంది పోలీసు సిబ్బందిని భద్రతా విధుల్లో నియమించనున్నారు. లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులతో పాటు షీ టీమ్స్, బాంబ్ డిటెక్షన్ బృందాలు, స్పెషల్ ఆపరేషన్ టీమ్ (ఎస్ఓటీ) తదితర ప్రత్యేక విభాగాలు సమన్వయంతో పని చేయనున్నాయి. స్టేడియంలోకి వచ్చే ప్రేక్షకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, మ్యాచ్ ముగిసిన అనంతరం కూడా ట్రాఫిక్ రద్దీని నియంత్రించేలా ప్రణాళికలు రూపొందించారు. స్టేడియంలో ఇప్పటికే ఏర్పాటు చేసిన 408 సీసీటీవీ కెమెరాలతో పాటు డ్రోన్ల ద్వారా కూడా నిఘా కొనసాగించనున్నారు. స్టేడియం లోపల, వెలుపల అనుమానాస్పద కదలికలను గుర్తించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించనున్నారు. మహిళలు, చిన్నారులు, క్రికెట్ అభిమానులు, ఆటగాళ్ల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మ్యాచ్‌ను వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో ప్రేక్షకులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులకు సహకరించాలని అధికారులు సూచిస్తున్నారు. పోలీసుల సూచనలు పాటిస్తూ, భద్రతా సిబ్బందికి సహకరించాలని ప్రేక్షకులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

# సరస్‌లో సిరుల సందడి

- ఆరో రోజు అదుర్స్ అనిపించిన మేళా
- కాశ్మీర్ కార్పెట్ల నుంచి కేరళ మసాలాల వరకు భారీ గిరాకీ
- విదేశీయులు, ప్రముఖుల సందర్శనతో సందడి



**హైదరాబాద్, అక్టోబర్ 12 (జనంసాక్షి) :** హైదరాబాద్‌లోని ఐమాక్స్ పక్కన ఉన్న హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న సరస్ మేళా ఆరవ రోజు సందర్శకులతో సందడిగా మారింది. తెలంగాణతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల స్వయం సహాయక సంఘాల మహిళలు తయారుచేసిన ఉత్పత్తులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. విదేశీయులు, పలువురు ప్రముఖులు మేళాను సందర్శించి వివిధ స్టాళ్లలో ప్రదర్శనకు ఉంచిన ఉత్పత్తులను ఆసక్తిగా తిలకించారు. ఎమ్మెల్సీ వాణిదేవి సైతం సరస్ మేళాలోని స్టాళ్లను సందర్శించి మహిళా సంఘాల ఉత్పత్తులను పరిశీలించారు. కాశ్మీర్ ప్రత్యేకతను చాటే కార్పెట్ల నుంచి కేరళకు చెందిన సుగంధ ద్రవ్యాల వరకు అనేక రకాల ఉత్పత్తులకు కొనుగోలుదారుల నుంచి భారీ స్పందన లభిస్తోంది. హస్తకళలు, గృహోపకరణాలు, సంప్రదాయ వస్తువులు, ఆహార ఉత్పత్తులు, చేనేత వస్త్రాలు ఇలా విభిన్న ఉత్పత్తులు ఒకే చోట అందుబాటులో ఉండటంతో సందర్శకులు కొనుగోళ్లకు ఆసక్తి చూపుతున్నారు. మణిపూర్‌కు చెందిన మహిళా సంఘం ఏర్పాటు చేసిన వెదురు ఉత్పత్తుల స్టాల్ సందర్శకులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఒక్క రోజులోనే సుమారు రూ.లక్ష విలువైన వెదురు ఉత్పత్తులను విక్రయించినట్లు ఆ స్టాల్ నిర్వాహకురాలు తెలిపారు. నారాయణపేట ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ సీతాఫల్ స్టాల్ ప్రారంభం కావడంతో మేళాలో మరో ప్రత్యేక ఆకర్షణ చేరింది. స్థానికంగా లభించే సీతాఫలాలను విక్రయానికి ఉంచగా సందర్శకులు పెద్ద సంఖ్యలో కొనుగోళ్లకు ముందుకొచ్చారు. కిలో సీతాఫలాలను కేవలం రూ.100కే అందిస్తుండటంతో వాటిని కొనుగోలు చేసేందుకు సందర్శకులు ఆసక్తి చూపారు.

### ప్రత్యేక ఆకర్షణగా ఇందిరా మహిళా శక్తి చీర

మేళా ప్రాంగణంలో తెలంగాణ చేనేత, వస్త్ర సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తున్న ఇందిరా మహిళా శక్తి చీర సందర్శకులను ఆకట్టుకుంటోంది. ఏడాది డిజైన్‌కు సంబంధించిన ప్రత్యేక చీరను తెలంగాణ స్టేట్ కో-ఆపరేటివ్ (టీజీఎస్సీఓ) ఆధ్వర్యంలో ప్రదర్శనకు ఉంచారు. మహిళా సాధికారతను ప్రతిబింబించే ఈ చీరను సందర్శకులు ఆసక్తిగా పరిశీలించారు. మహిళల ఆర్థిక స్వావలంబన, సంప్రదాయ వస్త్రకళలకు ప్రోత్సాహం వంటి అంశాలను ఈ ప్రదర్శన చాటిచెబుతోంది. మహిళా సాధికారతకు ఆర్థిక స్వావలంబనతో పాటు విద్య కూడా కీలకమనే సందేశాన్ని అందించేందుకు సెర్ప్, తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ సంయుక్తంగా ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేశాయి.



## సింగూరు ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తివేత

**పుల్కల్, అక్టోబర్ 12 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లాలోని సింగూరు ప్రాజెక్టు నుంచి అధికారులు నీటిని దిగువన ఉన్న మంజీరా బ్యారేజ్ కు త్రాగునీటి కోసం జలాలను విడుదల చేశారు.సోమవారం మధ్యాహ్నం 3.10 గంటల సమయంలో ప్రాజెక్టులోని 5,6వ నంబరు గేట్లను రెండు మీటర్ల మేర ఎత్తి నీటిని దిగువకు వదిలారు.ఈ రెండు గేట్ల ద్వారా మొత్తం 10,806 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలవుతున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రాజెక్టు నుంచి నీటి విడుదల కొనసాగుతున్న నేపథ్యంలో దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ప్రాజెక్టు పరిసర ప్రాంతాలు, దిగువ ప్రవాహ ప్రాంతాల్లోని ప్రజలు నీటి ప్రవాహం వైపు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నీటి విడుదలకు సంబంధించి అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

## భారత్-జపాన్ దేశాల మధ్య స్నేహ సంబంధాలు మరింత బలోపేతం కావాలి

- తెలంగాణ-హిరోషిమా మధ్య పారిశ్రామిక, సాంకేతిక, విద్యా రంగాల్లో సహకారం మరింత పెరగాలి
- తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి




**హైదరాబాద్, అక్టోబర్ 12 (జనంసాక్షి) :** ప్రజాస్వామ్య వ్యవస్థల బలోపేతానికి అంతర్జాతీయ శాసనసభల మధ్య పరస్పర సహకారం అవసరం అని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. తెలంగాణ అసెంబ్లీని జపాన్ హిరోషిమా ప్రిఫెక్చరల్ అసెంబ్లీ, ప్రభుత్వ ప్రతినిధుల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా అసెంబ్లీలో జపాన్ దేశానికి చెందిన హిరోషిమా ప్రిఫెక్చరల్ అసెంబ్లీ, ప్రిఫెక్చరల్ ప్రభుత్వ ప్రతినిధుల బృందంతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, శాసన మండలి సెక్రెటరీ డా. నరసింహాచార్యులు, శాసనసభ సెక్రెటరీ ఆర్. తిరుపతి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అంతకుముందు.. జపాన్ ప్రతినిధుల బృందానికి తెలంగాణ శాసనసభ తరఫున ఘన స్వాగతం పలికారు. శాసన మండలి చైర్మన్ గుత్తా మాట్లాడుతూ భారతదేశం, జపాన్ దేశాల మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న స్నేహపూర్వక సంబంధాలు పరస్పర విశ్వాసం, గౌరవం, సహకారానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయని అన్నారు. జపాన్ దేశం సాంకేతిక పరిజ్ఞానం, పారిశ్రామిక అభివృద్ధి, క్రమశిక్షణ, పరిశోధనలు, ఆవిష్కరణల రంగాల్లో ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రం కూడా సమాచార సాంకేతికత, ఫార్మా, వ్యవసాయం, విద్య, వైద్య రంగాలతో పాటు మౌలిక సదుపాయాల అభివృద్ధిలో వేగంగా ముందుకు సాగుతోందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం, జపాన్‌లోని హిరోషిమా ప్రాంతం మధ్య పారిశ్రామిక, సాంకేతిక, విద్యా, సాంస్కృతిక రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత విస్తరించుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. హిరోషిమా నగరం ప్రపంచ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉందని, రెండో ప్రపంచ యుద్ధంలో తీవ్ర విధ్వంసాన్ని ఎదుర్కొన్నప్పటికీ శాంతి, పునర్నిర్మాణం, అభివృద్ధికి ప్రపంచవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. హిరోషిమా ప్రజలు చూపిన ఆత్మవిశ్వాసం, పట్టుదల, శాంతి సందేశం ప్రపంచ దేశాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ప్రపంచంలో శాంతి, సామరస్యం, సుస్థిర అభివృద్ధి సాధించేందుకు దేశాల మధ్య పరస్పర సహకారం అత్యంత అవసరమని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభల పాత్ర ఎంతో కీలకమని, వివిధ దేశాల శాసనసభల మధ్య జరిగే ఇటువంటి సమావేశాలు శాసన ప్రక్రియలు, పరిపాలనా విధానాలు, ప్రజాస్వామ్య విలువలపై పరస్పర అవగాహన పెంపొందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు.ఈ సమావేశంలో తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, శాసన మండలి సెక్రెటరీ డా. నరసింహాచార్యులు, శాసనసభ సెక్రెటరీ రెండ్ల తిరుపతి, జపాన్ ప్రతినిధుల బృందం సభ్యులు, శాసనసభ, శాసన మండలి ఉన్నతాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు యూనిఫాం ధరించడం గొప్ప అదృష్టం

### డీజీపీ సీవీ ఆనంద్

- తెలంగాణ పోలీస్ అకాడమీలో 112 మంది డీఎస్పీల పాసింగ్ అవుట్ పరేడ్
- నాయకత్వం, నైతిక విలువలు, సాంకేతిక పరిజ్ఞానంపై డీజీపీ దిశానిర్దేశం



**హైదరాబాద్, అక్టోబర్ 12 (జనంసాక్షి) :** పోలీసు యూనిఫాం ధరించడం గొప్ప అదృష్టమని, ప్రజలకు సేవ చేయడంతోపాటు వారి ప్రాణాలను కాపాడే అరుదైన అవకాశం పోలీసు శాఖలో పనిచేసేవారికి లభిస్తుందని డీజీపీ సీవీ ఆనంద్ అన్నారు. తెలంగాణలో నాలుగు కోట్ల జనాభాలో సుమారు 90 వేల మందికే పోలీసు యూనిఫాం ధరించే అవకాశం ఉందని, ఇది మొత్తం జనాభాలో 0.3 శాతం మాత్రమేనని వివరించారు. ప్రతిరోజూ కనీసం 50 మంది కన్నీళ్లు తుడిచే అవకాశం పోలీసులకు ఉంటుందని పేర్కొన్నారు. నిజాయితీ, నైతిక విలువలను విస్మరించరాదని, కుల, మత, రాజకీయ రాగద్వేషాలకు అతీతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. తెలంగాణ పోలీసు అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకున్న 112 మంది డీఎస్పీల పాసింగ్ అవుట్ పరేడ్ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2014 తర్వాత పూర్తిస్థాయిలో శిక్షణ ముగించుకుని బయటకు వస్తున్న తొలి డీఎస్పీ బ్యాచ్ కావడంతో దీనికి ప్రత్యేకత ఉందన్నారు. 44 వారాలపాటు చట్టాలు, దర్యాప్తు విధానాలు, ఔట్‌డోర్ శిక్షణ, క్రీడల్లో శిక్షణ పొందిన అధికారులను అభినందించారు. శిక్షణలో ప్రతిభ కనబరిచిన వారిని ప్రశంసిస్తూ, అకాడమీ అధికారులు, అధ్యాపకులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. కొన్ని కారణాల వల్ల ముఖ్యమంత్రి పాసింగ్ అవుట్ పరేడ్‌కు హాజరు కాలేకపోతున్నట్లు తెలిపారని పేర్కొన్నారు. పాసింగ్ అవుట్ పరేడ్ సందర్భంగా చేసే ప్రమాణం అధికారుల 30-35 ఏళ్ల వృత్తి జీవితానికి మార్గదర్శకంగా నిలవాలని డీజీపీ సూచించారు. రాజ్యాంగం పట్ల నిబద్ధతతో, ప్రజలకు నిజాయతీగా, రాగద్వేషాలకు అతీతంగా విధులు నిర్వహిస్తానని చేసిన ప్రమాణాన్ని ఎప్పుడూ గుర్తుంచుకోవాలన్నారు. అకాడమీలో శిక్షణ పూర్తయిన తర్వాత మరో 46 వారాలపాటు క్షేత్రస్థాయిలో శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ దశలోనూ అదే శ్రద్ధ, క్రమశిక్షణ, నిజాయతీతో వ్యవహరించాలని సూచించారు. తన 35 ఏళ్ల పోలీసు అనుభవంలో నేర్చుకున్న అంశాలను గతంలో డీఎస్పీలతో నిర్వహించిన ముఖాముఖిలో వివరించానని, నాయకత్వ లక్షణాల ప్రాధాన్యాన్ని మరోసారి గుర్తుచేస్తున్నానని చెప్పారు. ధైర్యం, దార్శనికత, నైతిక విలువలు, నిష్పాక్షికత, బృంద స్ఫూర్తి, సంభాషణ నైపుణ్యాలు, కష్టపడే తత్వం, సాంకేతిక పరిజ్ఞానం, నూతన ఆలోచనలు, వినయం.. ఈ పది లక్షణాలను ప్రతి అధికారి అలవర్చుకోవాలని సూచించారు. విధుల నిర్వహణలో నైతిక విలువలను ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించరాదన్నారు. తాము యూనిఫాం ధరించిన రోజుల్లో నక్సలిజం ప్రధాన సవాలుగా ఉండేదని, ఆ సమస్యను పోలీసులు సమర్థంగా ఎదుర్కొన్నారని డీజీపీ గుర్తుచేశారు. ప్రస్తుతం సైబర్ నేరాలు, వ్యవస్థీకృత నేరాలు, రోడ్డు భద్రత, ఇతర కొత్త తరహా సవాళ్లు పోలీసుల ముందున్నాయని తెలిపారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పోలీసు శాఖలో సంస్థాగత మార్పులు చేపట్టామని చెప్పారు. గ్రేహౌండ్స్ తదితర విభాగాల పునర్వ్యవస్థీకరణతోపాటు ఈగల్ ఫోర్స్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో, టీజీ ఫాస్ట్, టీజీ స్పార్క్ వంటి విభాగాలను బలోపేతం చేసి కొత్త సవాళ్లను ఎదుర్కొనేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. క్షేత్రస్థాయిలో పనిచేసే అధికారులు కూడా ఈ మార్పులకు అనుగుణంగా సిద్ధంగా ఉండాలని సూచించారు. పోలీసు శాఖలో శారీరక దారుఢ్యం, చురుకుదనం, వృత్తిపరమైన నైపుణ్యాలు అత్యంత ముఖ్యమని డీజీపీ అన్నారు. యూనిఫాం ధరించిన తొలిరోజు ఉన్న ఉత్సాహం, క్రమశిక్షణ, ఫిట్‌నెస్ 30 ఏళ్ల తర్వాత కూడా కొనసాగాలని ఆకాంక్షించారు. పోలీసు పాసింగ్ అవుట్ పరేడ్‌లో బెల్టుపై ఉన్న హోల్ (రంధ్రం) 30 ఏళ్ల సర్వీసు పూర్తయ్యే వరకు, ఉద్యోగ విరమణ చేసేంతవరకు అలాగే ఉండాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ, సమర్థవంతమైన నాయకులుగా ఎదగాలని డీఎస్పీలకు పిలుపునిచ్చారు.

తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ మాట్లాడుతూ.. 112 సంఖ్యకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందన్నారు. ప్రజల అత్యవసర సేవల కోసం తెలంగాణ పోలీసు వ్యవస్థలో 112 సేవలు అందుబాటులో ఉన్నాయని, ఇప్పుడు 112 మంది డీఎస్పీలు ప్రజా సేవలోకి అడుగుపెట్టడం విశేషమని పేర్కొన్నారు. పోలీస్ శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నేహా అగర్వాల్ ముఖ్యమంత్రి రివాల్వర్‌తో పాటు మరో మూడు పురస్కారాలను అందుకున్నారు. బెస్ట్ ఆల్‌రౌండ్ పెర్ఫార్మెన్స్‌కు సీఎం రివాల్వర్, రాజా బహదూర్ వెంకట రామారెడ్డి బంగారు పతకం, కోన రామచంద్రారెడ్డి స్మారక బంగారు పతకం, ఇండోర్ సబ్జెక్టుల్లో ప్రతిభకు హోంమంత్రి బేటన్ ఆమెకు లభించాయి. పాసింగ్ అవుట్ పరేడ్‌లో సీనియర్ పోలీసు అధికారులు, రిటైర్డ్ పోలీసు అధికారులు, అకాడమీ సిబ్బంది, శిక్షణ పొందిన డీఎస్పీల కుటుంబ సభ్యులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370